అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 12-04-2025



వక్ఫ్ సవరణచట్టానికి వ్యతిరేకంగా చార్మినార్ వద్ద నిరసన ప్రదర్శన

సంపుటి : 11 | సంచిక : 101 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



బెదిరిస్తే బెదరం


ట్రంప్‌పై చైనా ఆగ్రహం

యూఎస్‌పై టారిఫ్‌లు

125 శాతానికి పెంపు

న్యూఢిల్లీ : అమెరికా, చైనా మధ్య టారిఫ్ యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. ట్రంప్ భయపెడితే ఎవరూ బెదిరే వాళ్ల లేరని చైనా స్పష్టం చేసింది. బ్లాక్ మెయిళ్లకు తలొగ్గమని మరోమారు తెలిపింది. అమెరికా వరుసగా టారిఫ్‌లను పెంచుతున్న వేళ చైనా ...6లో

భారత్ నుంచి వంద మంది



ఇది పెగాసస్ టార్గెట్ చేసిన వాట్సప్ వినియోగదారుల సంఖ్య


మెక్సికోది మొదటి స్థానం..

స్పైవేర్ బారిన 456 మంది

ప్రపంచవ్యాప్తంగా 51 దేశాల్లో బాధితులు

వివరాలు 15లో

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



మానవ హక్కుల కమిషన్ చైర్మెన్‌గా షమీమ్ అక్తర్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం 15లో..



సీనియర్ సిటిజన్ల కన్నా కాసులే మిన్న

రైల్వేశాఖ రాయితీ ఎత్తివేతతో...

ఐదేండ్లలో ఖజానాకు రూ.8,913 కోట్ల ఆదాయం

సమాచారహక్కు చట్టం ద్వారా వెల్లడి

వివరాలు 15లో





వ్యూహాలను సమీక్షిస్తాం

సాంస్కృతిక పంథాకు పదును పెడతాం

సరికొత్త పోరాట నమూనాలను రూపొందిస్తాం

జాతీయ మహాసభలు లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశలు నింపాయి

మన ప్రజాస్వామ్య పునాదులు ఒత్తిడిలో ఉన్నాయి :

నవతెలంగాణతో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

ములాఖాత్

దేశ ప్రజాస్వామ్య పునాదులు ఎన్నడూ లేనంత ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు మదురైలో జరిగిన సీపీఐ(ఎం) 24వ పార్టీ మహాసభ దేశంలో వామపక్ష, ప్రగతిశీల శక్తులకు కొత్త వెలుగునిచ్చిందని సీపీఐ(ఎం) నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగ విలువలను క్షీణింపజేస్తోందని, మతపరమైన విభజనలను తీవ్రతరం చేస్తోందని ప్రజలపై తీవ్రమైన ఆర్థిక, సాంస్కృతిక దాడిని కొనసాగిస్తోందని విమర్శించారు. వామపక్షాల రాజకీయ, సాంస్కృతిక వ్యూహాన్ని పున్ణసమీక్షించాలని మహాసభ పిలుపునిచ్చిందన్నారు. మహాసభ తీర్మానాలు పోరాడే శక్తులలో కొత్త ఆశను, ఉత్సాహాన్ని రేకెత్తించాయని చెప్పారు. నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలను వెల్లడిస్తూ పార్టీ మహాసభ ఆమోదించిన కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

సీపీఐ(ఎం) స్వంత బలాన్ని పెంచాలనే పార్టీ మహాసభ పిలుపును రాజకీయంగా ఎలా అర్థం చేసుకోవాలి?

పార్టీ మహాసభ రెండు కీలకమైన పనులను నిర్దేశించింది. మొదటిది.. సీపీఐ(ఎం), వామపక్షాల స్వంత బలాన్ని గణనీయంగా పెంచుకోవడం. రెండోది.. ప్రమాదకరమైన మోడీ పాలనకు వ్యతిరేకంగా రాజకీయ సైద్ధాంతిక పోరాటాన్ని విస్తృతం చేయడం. మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానం దీనినే స్పష్టం చేస్తుంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం జాతిని తిరోగమనానికి నడపడం మాత్రమే కాదు, మొత్తం భారతీయ సమాజ నిర్మాణాన్ని విషపూరితం చేస్తోంది. నయా ఫాసిస్ట్ ధోరణులను ప్రదర్శిస్తోంది. మోడీ ప్రభుత్వం ఒకదాని తరువాత ఒకటిగా తీసుకుంటున్న చర్యలు మన రాజ్యాంగ విలువలన్నింటినీ నాశనం చేస్తున్నాయి.

పార్టీ మహాసభ ముగిసిన తర్వాత ఒకే రోజులో రెండు ముఖ్య పరిణామాలు జరిగాయి. మొదటిది... తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను నిరోధించడంలో ...3లో

పూలే మార్గం అందరికి ఆచరణీయం

అంబర్‌పేటలో పూలే విగ్రహానికి సీఎం నివాళి

నవతెలంగాణ-అంబర్‌పేట

పూలే మార్గం అందరికి ఆచరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకొని మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో...15లో

మూసీ పునరుజ్జీవ పనులు వేగవంతం చేయండి

సీఎం రేవంత్ ఆదేశం

వివరాలు 16లో

సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త ఫూలే

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



పూలేకు నివాళ్లు అర్పిస్తున్న జాన్‌వెస్లీ

నవతెలంగాణ-అంబర్‌పేట

అన్ని రంగాల్లో మనుషులంతా సమానత్వంతో జీవించాలని, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ తన జీవితాన్ని ధారపోసిన భారతీయ సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం పూలే 199వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని అంబర్‌పేట అలీ కేఫ్ చౌరస్తా వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక దార్శనికునిగా, సంఘ సంస్కర్తగా, వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి బాటలు వేసి వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. పూలే 19వ శతాబ్దంలో...15లో

జాబ్‌మేళాలో తోపులాట

పలువురికి గాయాలు..స్థానిక ఆస్పత్రిలో చికిత్స



25 వేల మందికిపైగా హాజరైన నిరుద్యోగులు

తగిన ఏర్పాట్లు లేక గందరగోళ పరిస్థితులు

అనంతరం కొనసాగిన ఇంటర్వ్యూలు

మేళాను ప్రారంభించిన మంత్రులు

అవకాశాలు అందిపుచ్చుకొని ముందుకు సాగాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

నిరుద్యోగాన్ని పారదోలేందుకే జాబ్ మేళా : మంత్రి సురేఖ

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అధిక సంఖ్యలో అభ్యర్థులు తరలి రావడంతో తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. గాయపడిన వారికి సమీప ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించిన అనంతరం జాబ్ మేళాలో ఇంటర్వ్యూ చేయించారు. ఈ మెగా జాబ్ మేళాలో 56 కంపెనీలు పాల్గొననున్నట్టు వారం, పది రోజులుగా విస్తృతంగా ప్రచారం చేయడంతో శుక్రవారం దాదాపు 25 వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. కానీ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచే నిరుద్యోగులు కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నప్పటికీ గేట్లు తెరవలేదు. ఉదయం 9:30 గంటలకు రావాల్సిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క దాదాపు గంటన్నర ఆలస్యంగా ...7లో

కంచ గచ్చిబౌలి భూముల స్కాంలో బీజేపీ ఎంపీ హస్తం



రూ.10 వేల కోట్ల అవినీతికి తెరలేపిన రేవంత్

సుప్రీం తీర్పుల ప్రకారం అది ముమ్మాటికీ అటవీ భూమే :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంచ గచ్చిబౌలి భూముల్లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.10వేల కోట్ల అవినీతికి తెరలేపారని ఆరోపించారు. "ఈ భూ కుంభకోణం కర్త, కర్మ, క్రియ ముఖ్యమంత్రే. రూ. పది వేల కోట్ల లోన్ ఇచ్చిన ఐసీఐసీఐ బ్యాంకు తన క్రెడిబులిటీని కోల్పోయింది. త్వరలోనే ఆ బ్యాంకు కుప్పకూలడం ఖాయం. ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రధాని మోడీ వెంటనే విచారణకు ఆదేశించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో జరిగిన పర్యావరణ విధ్వంసంపై దేశం మొత్తం నివ్వెరపోయిందని అన్నారు. రాత్రికి రాత్రి బుల్డోజర్లను పెట్టి వందల ఎకరాల్లో చెట్లను కూల్చివేసి మూగజీవాలకు నిలువనీడ లేకుండా చేశారని ఆరోపించారు. "కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాలు ముమ్మాటికీ అటవీ భూమే. రిజర్వ్ ఫారెస్ట్ అని ప్రత్యేకంగా డిక్లేర్ చేయకపోయినా అడవులకు ఉండాల్సిన లక్షణాలు ఉంటే యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నా దాన్ని అటవీ...15లో



కేసీఆర్ భూదోపిడీపై విచారణ జరపాలి

అస్మదీయులకు వేల ఎకరాలు కట్టబెట్టారు

బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకుని హెచ్‌సీయూ భూములపై మౌనం

ఈ-ఫార్ములా రేసు కుంభకోణంలో కేటీఆర్ అరెస్టు కాకతప్పదు :

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూదోపిడీపై విచారణ జరపాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 'నా' అనుకున్న వారికి వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. శుక్ర వారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్లలో భూ దోపిడీపై చర్చకు సిద్ధమా? దమ్ము, ధైర్యముంటే చర్చకు రావాలంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారని తెలిపారు. ఈ-ఫార్ములా రేసు కేసులో కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్టు కాక తప్పదని స్పష్టం చేశారు. పదేండ్ల పాలనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాలను విక్రయించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ చుట్టూ ఉన్న వేల ఎకరాలను కేసీఆర్ తన వారికి మాత్రమే అమ్ముకున్నారని విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూముల గురించి పదేండ్లలో ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల సమస్య కోర్టు వివాదంలో ఉన్నప్పుడు ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఐఎంజీ సంస్థ అధినేత బిల్లీరావుతో కమీషన్ మాట్లాడుకొని ఆ భూములను పట్టించు కోలేదని అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుప్రీంకోర్టులో పోరాడి 400 ఎకరాలను సాధించామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఆ భూములను కాపాడకపోయి ఉంటే, ఆ భూమి ఐఎంజీ చేతికి వెళ్లి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లీరావుతో మాట్లాడుకున్న వేల కోట్ల కమీషన్ పోయిందనే ...6లో

డంప్‌యార్డుకు ధారావి నివాసితులు

పునరావాసం కోసం డియోనార్ చెత్త ప్రాంతానికి

మహారాష్ట్రలో ఉన్న అతిపెద్ద మురికివాడ ధారావి. ఇక్కడ ఎంతో మంది దారుణ పరిస్థితుల్లోనే జీవిస్తున్నారు. అయితే, వీరి కోసం ధారావి మురికివాడ పునరాభివృద్ధి ప్రాజెక్టును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ ప్రాజెక్టులోని 50వేల నుంచి లక్ష మంది నివాసితులకు ముంబయిలోని అతిపెద్ద వ్యర్థాల డంప్‌లలో ఒకటైన డియోనార్ ల్యాండ్‌ఫిల్ వద్ద పునరావాసం కల్పించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించింది. అయితే, విషవాయువులను వెదజల్లే ఈ మురికి ప్రదేశానికి నివాసితులను తరలించాలనే ప్రభుత్వ నిర్ణయంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు చర్యలపై ప్రశ్నలను లేవనెత్తుతున్నారు.



అతిపెద్ద వ్యర్థాల డంప్‌లో ఇదీ ఒకటి

దాదాపు లక్ష మందికి అక్కడే 'అద్దె యూనిట్లు'

విషవాయువులను వెదజల్లే కూపం

సగటున గంటకు 6202 కేజీల మిథేన్ విడుదల

తరలింపు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

'మహాయుతి' సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

చర్చనీయాంశంగా అదానీ-మహారాష్ట్ర 'ధారావి ప్రాజెక్టు'



ముంబయి : ధారావి మురికివాడ పునరాభివృద్ధి ప్రాజెక్టును అదానీ గ్రూప్-మహారాష్ట్ర ప్రభుత్వ జాయింట్ వెంచర్ నిర్వహిస్తున్నది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ), క్షేత్రస్థాయి సందర్శనలు, ఈ ప్రాజెక్టుల్లో భాగమైన అధికారుల ఇంటర్వ్యూలలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. డియోనార్‌కు తరలింపు ప్రక్రియ కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) రూపొందించిన పర్యావరణ నిబంధనలు, మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నదని వెల్లడవుతున్నది. క్లోజ్డ్‌ల్యాండ్‌ఫిల్ (మూసివేయబడిఉన్న చెత్తకుప్ప)లో అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో సీపీసీబీ 2021 మార్గదర్శకాల ప్రకారం.. ఆస్పత్రులు, గృహాలు, పాఠశాలలు, సౌకర్యాలను ల్యాండ్‌ఫిల్ లోపల నిర్మించకూడదు. దాని సరిహద్దు నుంచి వంద మీటర్ల అభివృద్ధి రహిత జోన్ తప్పనిసరి.

డియోనార్.. డేంజర్ ప్లేస్

డియోనార్ ప్రాంతం విషవాయువులను వెదజల్లే కూపం. వ్యర్థాల కుప్పల నుంచి బయటకు వచ్చే ద్రవం, భూగర్భజలాలు, ఉపరితల నీరు, నేలను విషపూరిత సేంద్రీయ, అకర్బన కాలుష్య కారకాలతో కలుషితం చేసే అవకాశం ఉన్నది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రిన్సిపల్ బెంచ్‌కు సమర్పించిన 2024 సీపీసీబీ నివేదిక ప్రకారం.. డియోనార్ ల్యాండ్‌ఫిల్ నుంచి సగటున ప్రతి గంటకు 6202 కేజీల మేథేన్ విడుదలవుతుంది. భారత్‌లోని టాప్ 22 మీథేన్‌హాట్‌స్పాట్‌లలో ఇది ఒకటి. దీంతో ధారావి నివాసితులను డియోనార్ ప్రదేశానికి తరలించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నది. మహారాష్ట్రలోని మహాయుతి సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏమిటీ ఈ ప్రాజెక్టు?

ధారావిలో ఉన్న 600 ఎకరాలలో 296 ఎకరాలు ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టు (డీఆర్‌పీ) కోసం కేటాయించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద మురికివాడను..మెరుగైన ...7లో

పారిశ్రామికోత్పత్తి ఢమాల్

ఫిబ్రవరిలో

2.9 శాతానికి పరిమితం

ఏడు నెలల కనిష్టానికి పతనం

పేలవంగా తయారీ, మైనింగ్ రంగాలు 6లో..





మీకు ప్రాథమిక హక్కులుంటే..

ప్రజా హక్కుల సంగతేంటీ ?:

ఈడీపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : ప్రజల ప్రాథమిక హక్కుల గురించి కూడా ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆలోచించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ ఆపుర్తి నిగమ్ (ఎన్ఏఎన్) కుంభకోణం కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి ...7లో

ఆస్తుల కబ్జా కోసమే వక్ఫ్ సవరణ చట్టం

విభజించి పాలించడమే బీజేపీ లక్ష్యం : ఎస్వీకే వెబినార్‌లో ఎమ్‌డీ అబ్బాస్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వక్ఫ్ ఆస్తుల్ని కబ్జా చేసేందుకే మోడీ సర్కార్ సవరణ చట్టాన్ని తెచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్ అన్నారు. దేశ ప్రజల్ని మత ప్రాతిపదికగా విభజించి, పాలించడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శుక్రవారం నాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'వక్ఫ్ చట్టాన్ని దేనికోసం సవరించారు?' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. దేశంలో సుదీర్ఘకాలంగా ఓరల్ వక్ఫ్, వారసత్వ వక్ఫ్, రిజిస్టర్డ్ వక్ఫ్ విధానాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వక్ఫ్ చట్ట సవరణ కోసం కేంద్రం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఎదుట అన్ని పార్టీల ఎంపీలు సవరణలు సూచించారనీ, కానీ ప్రతిపక్షాలు సూచించిన ఏ ఒక్క సవరణను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదించలేదని వివరించారు. జేపీసీని తూతూ మంత్రంగా ముగించారని విమర్శించారు. ఐదేండ్లు అదే మతంలో ఉన్నవారు మాత్రమే వక్ఫ్ చేయడానికి అర్హులంటూ చట్ట సవరణ చేశారనీ, ఇది అత్యంత ప్రమాదకరమని చెప్పారు. భవిష్యత్‌లో ముస్లింలకు ఎలాంటి చారిటీ లేకుండా చేయాలనే దురుద్దేశ్యం దీనివెనుక ఉందన్నారు. మత సామరస్యానికి చిహ్నంగా అనేకమంది హిందువులు కూడా దర్గాలు, ఈద్గాలకు భూముల్ని దానం ఇచ్చే సంప్రదాయం ఉందనీ, దాన్ని నిలువరించేందుకే ఐదేండ్ల నిబంధన విధించారని వివరించారు. అలాగే వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను కూడా ఉంచాలని చట్ట సవరణ చేశారనీ, ఇది వారిపై నిఘాను పెట్టడమేనని ఆక్షేపించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), సిక్కు గురుద్వారా ప్రబంధక్ కమిటీలు, జైనుల దేవాలయాల నిర్వహణలో ముస్లింలకు అవకాశం కల్పిస్తారా? అని ప్రశ్నించారు. కేవలం వక్ఫ్ బోర్డుల్లోనే ముస్లిమేతరులు ఎందుకు ఉండాలన్నారు. అన్ని మతాల నిర్వహణ బోర్డుల్లో ఇతర మతస్తులు కూడా ఉండాలనే చట్టాన్ని తెస్తే స్వాగతిస్తామనీ, ఇది మత సామరస్యానికి, పారదర్శకతకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అందుకు భిన్నంగా కేవలం ముస్లింలనే టార్గెట్ చేయడం విభజించి, పాలించడమే అవుతుందని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పారు. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ఎత్తివేశారనీ, దీనివల్ల వక్ఫ్ భూములకు చట్టబద్ధ రక్షణ లేకుండా పోతుందన్నారు. చారిత్రకంగా వక్ఫ్ ఆస్తులు నోటి మాటగా, రాతపూర్వకంగా, వారసత్వంగా సంక్రమించాయనీ, వాటి వినియోగాన్ని చూడాలే తప్ప, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు చూపాలనడం సరికాదన్నారు. వక్ఫ్ ఆస్తులు రిజిస్టర్ లేకుంటే ఆ భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం లేదా కబ్జాలకు మార్గాన్ని సుగమం చేయడమే అవుతుందని విశ్లేషించారు.

వక్ఫ్ సవరణ చట్టంలో వక్ఫ్ బై యూజర్ అనే పదాన్ని ఎత్తివేశారనీ, దీనివల్ల ముస్లిం శ్మశానవాటికలు, పాత మసీదులు, చారిత్రక కట్టడాలన్నీ కబ్జాల్లోకి వెళ్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వక్ఫ్ సర్వే కమిషనర్ నియామకాన్ని ప్రభుత్వమే నియమించి, హద్దులు నిర్ణయించే అవకాశం ఉందనీ, ఇప్పుడు దాన్ని కలెక్టర్ లేదా ఆపై అధికారి మాత్రమే ఆస్తుల నిర్ధారణ చేయాలని చట్ట సవరణ చేశారని చెప్పారు. ఇది సరైంది కాదని అభ్యంతరం తెలిపారు. వక్ఫ్ ఆస్తులన్నింటినీ ఆరు నెలల్లో జిల్లా కలెక్టర్ల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని షరతు విధించారనీ, ఏ మతానికి లేని షరతులు కేవలం ముస్లింలకే ఎందుకు విధించారని ప్రశ్నించారు. వక్ఫ్ ఆస్తుల్ని బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకొనే కుట్ర కనిపిస్తుందనీ, దీన్ని ప్రజలు, సమాజం తిరస్కరించాలని చెప్పారు. సుప్రీంకోర్టు సామాజిక కోణంలో దీనిపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. వెబినార్‌కు సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఇక భూమి వివరాలు సులభం

ఎన్‌ఆర్‌ఎస్‌సీతో హైడ్రా ఒప్పందం
ఎంఓయూపై ఇరు సంస్థలు సంతకం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓఆర్ఆర్ పరిధిలో భూముల వివరాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి హైడ్రా కసరత్తు ప్రారంభించింది. ఎక్కడ చెరువు ఉంది, ఆ చెరువు విస్తీర్ణం ఎంత, కాలువలు, నాలాల పరిస్థితి ఏంటి..? అనే సమాచారంతో పాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించి సరైన హద్దులతో సమాచారాన్ని సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఎన్‌ఆర్‌ఎస్‌సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్)తో హైడ్రా శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రభుత్వ ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల వివరాలతో పాటు, చెరువుల హద్దులు అందుబాటులో ఉంటే ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఇరువురు ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి హద్దుల విషయంలో ఎలాంటి అపోహలకు ఆస్కారం లేకుండా సరైన సమాచారం అందించడమే హైడ్రా ముందున్న లక్ష్యమని తెలిపారు. ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన నిపుణులతో 100 శాతం నమ్మకమైన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఎన్‌ఆర్‌ఎస్‌సీ శాటిలైట్ ఇమేజ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రహదారులు ఇలా ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల సమాచారం ప్రజలకు అందుబాటులోకి తీసుకురాడానికి ఎన్‌ఆర్‌ఎస్‌సీతో కుదుర్చుకున్న ఒప్పందం మైలురాయి లాంటిదని తెలిపారు. 1970వ సంవత్సరంలో సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేసిన టోపో షీట్లు, కెడెస్ట్రియల్ మ్యాప్స్, రెవెన్యూ రికార్డులు, చెరువులకు సంబంధించిన సమాచారంతో పాటు ఎన్.ఆర్.ఎస్.సీ శాటిలైట్ ఇమేజ్‌లతో సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకురావడమే హైడ్రా లక్ష్యమన్నారు. ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ.. చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పర్యావరణ హితమైన నగరాన్ని రూపొందించడానికి ఇంత పెద్దఎత్తున చర్యలు తీసుకున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలబడుతుందని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకుంటే దేశంలోనే గొప్ప నగరంగా హైదరాబాద్ పేరుగాంచుతుందని తెలిపారు. హైడ్రా చర్యలతో ఇది సాధ్యమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

పూలే విగ్రహానికి
సీఎం స్థల పరిశీలన

సర్వే చేసి నివేదికివ్వాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ ఐమాక్స్ సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. శుక్రవారం సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు దీనికి హాజరయ్యారు. స్థలాన్ని సర్వే చేసి పూర్తిస్థాయి ప్రణాళికలతో నివేదికను అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ట్రాఫిక్‌తోపాటు ఇతర సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుని డిజైనింగ్ చేయాలని సీఎం అధికారులకు సూచించారు. అనంతరం అంబర్‌పేటలో పూలే విగ్రహానికి నివాళులు అర్పించారు.

వ్యూహాలను సమీక్షిస్తాం

- సాంస్కృతిక పంథాకు పదును పెడతాం
- సరికొత్త పోరాట నమూనాలను రూపొందిస్తాం
- జాతీయ మహాసభలు లౌకిక, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తుల్లో కొత్త ఆశలు నింపాయి

'నవతెలంగాణ'తో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

(మొదటి పేజీ తరువాయి)
గవర్నర్ చర్య తప్పు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని దెబ్బతీస్తోందనే సీపీఐ(ఎం) వైఖరిని ఈ తీర్పు బలపరుస్తుంది. రెండోది... పెట్రోల్, డీజిల్‌పై సుంకాలు పెంచింది. వంట గ్యాస్ ధరలు పెంచింది. మోడీ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక దాడిని కొనసాగిస్తోందన్న మా విమర్శ అక్షర సత్యమని ఇది మరోసారి రుజువు చేసింది. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాలను నిర్మించాలంటే సీపీఐ(ఎం) బలాన్ని పదిరెట్లు పెంచాలి. సంస్థాగతంగా, పార్టీ, వర్గ ప్రజా సంఘాల ప్రభావం, సామర్థ్యాన్ని పెంచాలి. దీనికి ఉపయోగపడే అనేక విషయాలను పార్టీ మహాసభ నిర్మాణ సమీక్షా నివేదికలో చర్చించాం. మానవులకు జీవ కణాల వలె, పార్టీకి జీవ కణాలైన శాఖలు చాలా ముఖ్యమైనవి. దేశవ్యాప్తంగా దాదాపు లక్ష శాఖలు ఉన్నాయి. శాఖల కార్యకలాపాలను సమన్వయం చేసే స్థానిక కమిటీలు, ఉపకమిటీలు ఉన్నాయి. జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు, కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో ఉన్నాయి. ఈ కమిటీల పనితీరును, సామర్థ్యాలను అనేక రెట్లు పెంచాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. పార్టీ స్వంత బలాన్ని పెంచుకోవడంలో ఇదొక కీలకమైన కర్తవ్యం. దీనికి సమాంతరంగా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై స్థానికంగా ఆందోళనలు చేపట్టాలి. ప్రజల స్థానిక సమస్యలపై పోరాటాలను విజయవంతం చేయడంపై దృష్టి పెట్టాలని మహాసభ నిర్ణయించింది. పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు ప్రజలతో మమేకమై కార్యకలాపాలను చేపట్టాలని నిర్ణయించాం. వయనాడ్ కొండచరియల విపత్తు బాధితులకు ఇండ్లు అందించే ప్రాజెక్టులో భాగంగా డీవైఎఫ్ఐ కార్యకర్తలు రూ.20.4 కోట్లను సేకరించారు. వ్యర్థ పదార్థాలను సేకరించి విక్రయించి బిర్యానీ ఛాలెంజ్ నిర్వహించారు. ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని పార్టీ కేంద్ర కమిటీకి సమర్పించినప్పుడు చాలామందికి ఆశ్చర్యం కలిగింది. ఇటువంటి కార్యకలాపాలతో సాధించిన విజయాలను మదురై పార్టీ మహాసభ గుర్తు చేసింది. ఇది కొత్త పోరాట నమూనాలను స్వీకరించడానికి మాకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను.

సంఘ్ పరివార్‌ను సైద్ధాంతికంగా, సాంస్కృతికంగా ఎదుర్కోవడానికి మీరు ఎలాంటి ప్రణాళికను అమలు చేయాలనుకుంటున్నారు?

సంఘ్‌పరివార్ ప్రభావం సమాజంలో లోతుగా పాతుకు పోయింది. ఆర్ఎస్ఎస్ అనేక పేర్లతో, వివిధ రూపాల్లో ఉన్న సంస్థల ద్వారా పనిచేస్తుంది. మన దేశంలోని చాలా రాజకీయ పార్టీలు దీనివల్ల కలిగే ముప్పును తీవ్రంగా పరిగణించడానికి ఇష్టపడటం లేదు. బీజేపీని తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మరో రాజకీయ పార్టీగా మాత్రమే చూస్తున్నాయి. బీజేపీని కేవలం ఒక రాజకీయ పార్టీగానే చూడలేము. సీపీఐ(ఎం) పార్టీ కార్యక్రమంలో పేర్కొన్నట్టుగా, బీజేపీ అనేది ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్ నియంత్రణలో పని చేస్తున్న ఒక రాజకీయ పార్టీ. ఆర్ఎస్ఎస్ ప్రణాళికను సాకారం చేయడానికి ఏర్పడింది. దేశంలోని ఇతర ప్రతిపక్ష పార్టీలు ఈ కోణంలో చూడలేకపోవడం వల్ల సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో పరిమితులు ఏర్పడుతున్నాయి. ప్రతిపక్షాలలో ఈ స్పష్టత లేకపోవడం సంఘ్‌పరివార్ పట్ల సైద్ధాంతిక ప్రతిఘటనను బలహీనపరుస్తున్నది.

సంఘ్‌పరివార్‌కు వ్యతిరేకంగా సీపీఐ(ఎం), వామపక్షాల వైఖరిని, భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేయబోతున్నారు?

1990 ప్రారంభంలో దేశ రాజకీయాల్లో బీజేపీ ముప్పుగా ఎదగడం ప్రారంభించినప్పుడు, 'ఫ్రంట్‌లైన్' వారపత్రిక ఆరెస్సెస్ అంటే ఏమిటి? అనే దానిపై అప్పటి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు సీతారాం ఏచూరి రాసిన 'వాట్ ఈజ్ హిందూ స్టేట్' అనే వ్యాసం ప్రచురించింది. దీనిని ఫ్రంట్‌లైన్ స్వయంగా పుస్తకంగా కూడా ప్రచురించింది. ఇప్పుడు పార్టీ మహాసభ సందర్భంగా దాన్ని తిరిగి ప్రచురించారు. బీజేపీ అన్ని రాజకీయ పార్టీల వంటిది కాదన్న సీపీఐ(ఎం) వైఖరికి అది అద్దం పడుతుంది. కానీ బూర్జువా మీడియా ఆధిపత్యం ఉన్న భారతీయ సమాజంలో ఆర్ఎస్ఎస్, బీజేపీల ప్రమాదం గురించి సీపీఐ(ఎం), వామపక్షాలు చెప్పేది తగినంతగా వ్యాప్తి చెందడం లేదు. ఈ బలహీనతను పరిష్కరించడానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని పార్టీ మహాసభ నిర్ణయించింది. ఇది ఒక సాంస్కృతిక, రాజకీయ లక్ష్యం. ఇది కేవలం సాంస్కృతిక సంఘాలపై ఆధారపడటంతోనే నిర్వహించలేం. అన్ని వర్గ, ప్రజా సంఘాల్లో ప్రజల సాంస్కృతిక జీవితంలో జోక్యానికి ఒక సంస్థాగత వ్యవస్థ ఉండాలి. ప్రస్తుతం ఇది ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో జరుగుతోంది. అయితే, సంఘ్ పరివార్ సంస్థలు వ్యక్తిగతంగా, సమిష్టిగా ఇండ్లలో, కార్యాలయాల్లో నిర్వహించే సూక్ష్మమైన పనిపై దృష్టి పెట్టాలి. దీనిని ఎదుర్కోవడానికి, ప్రజలను వారి నివాస ప్రాంతాల్లో సందర్శించడం, వారితో ఓపికగా మాట్లాడటం, మతపరమైన ఆలోచనల పట్టు నుంచి వారిని విడిపించడానికి వివిధ స్థాయిలలో క్రమపద్ధతిలో పనిచేయాలి.




వామపక్షాలకు ఈ దేశంలో భవిష్యత్తులేదనే వారికి మీ సమాధానం ఏమిటి?

సాధారణంగా ప్రపంచ పరిస్థితిని అంచనా వేసేటప్పుడు, కొన్ని చోట్ల తీవ్ర మితవాద పెరుగుదలను ఉదహరిస్తూ కమ్యూనిస్టులు, వామపక్షాలకు భవిష్యత్తు లేదని వాదించేవారు ఉన్నారు. కానీ కమ్యూనిస్టులు, వామపక్షాల ప్రభావం లేని ప్రపంచం భవిష్యత్తు గురించి ఆలోచనాపరులైన ప్రజలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలు కోట్లాది మంది ప్రజలపై ఎన్ని భరించలేని కష్టాలను రుద్దుతున్నాయి? ఆక్స్‌ఫామ్ వంటి స్వతంత్ర పరిశోధనా బృందాలు దీనిపై గణాంకాలను అందిస్తాయి. ప్రపంచ జనాభాలో 95 శాతం మంది సంపద మొత్తం కంటే, ఒక శాతం మంది అత్యంత ధనవంతుల సంపద ఎక్కువ. బిలియనీర్ల సంపద ప్రతిరోజూ 2.7 బిలియన్ డాలర్లు పెరుగుతోంది. మరోవైపు ద్రవ్యోల్బణం 1.7 బిలియన్ల కార్మికుల వాస్తవిక ఆదాయాన్ని తగ్గిస్తోంది. ఔషధాలు, వ్యవసాయం, సాంకేతికత వంటి రంగాలలో ఒక సమూహం ప్రపంచ గుత్తాధిపత్యాన్ని సాధించింది. ఏడు సోషల్ మీడియా, టెక్నాలజీ, చిప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 12 ట్రిలియన్ల అమెరికా డాలర్లకు చేరుకుంది. వారు ఈ ఆధిపత్యాన్ని ఉపయోగించి ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. రాజకీయ జోక్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు పన్నులు తగ్గించడం ద్వారా, కార్మిక చట్టాలను బలహీనపరచడం ద్వారా కార్పొరేట్లకు సహాయం చేస్తున్నాయి.

ప్రపంచంలో ఉక్రెయిన్, గాజాలో దోపిడీ వ్యవస్థ సృష్టించే యుద్ధాలు, మారణహోమాన్ని మనం చూస్తున్నాము. అధిక లాభాల కోసం సహజ వనరులను దోపిడీ చేయడం వెనుక పెట్టుబడిదారీ విధానం చోదక శక్తిగా ఉంది. దీనిని నిరోధించగలిగే శక్తులు కమ్యూనిస్టులు మాత్రమే. ఇప్పటికే ఈ వెలుగులో ప్రపంచ జనాభాలో 25శాతం మంది అసమానతలు లేని సామ్యవాద సమాజాలను నిర్మించడానికి మార్గాలను అన్వేషిస్తున్న దేశాలలో నివసిస్తున్నారని అంచనా. అందువల్ల, ప్రపంచ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే వారికి పెట్టుబడిదారీ విధానం సృష్టిస్తున్న దుస్థితి, దానిని అంతం చేయగలిగేది కమ్యూనిజమేనన్న వాస్తవం బోధపడుతుంది.

ప్రపంచంలోనే దేశాల మధ్య వైరుధ్యాలు వేర్వేరుగా ఉన్నాయి కదా!, అన్ని దేశాల్లో పరిస్థితులను ఒకేలా అర్థం చేసుకోవడం సాధ్యమా?

అవును, ప్రపంచంలోని దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నాయి. అన్ని దేశాల్లో పరిస్థితులు ఒకేలా ఉండవు. కానీ అన్ని దేశాల్లో ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. అందుకే ప్రతి దేశానికి అనువైన రూపంలో సమ సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చని సీపీఐ(ఎం) దృఢంగా విశ్వసిస్తున్నది. భారత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సోషలిస్ట్ సమాజాన్ని ప్రజా ప్రజాస్వామ్య మార్గం ద్వారా నిర్మించాలనే ఆలోచనను పార్టీ 24వ మహాసభ ముందుకు తెచ్చింది. ప్రపంచంలోలానే, భారతదేశంలో 2017-18లో మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 32 శాతం. 2024-25లో ఇది 26.5 శాతానికి తగ్గింది. 2014-15లో 20.8 శాతంగా ఉన్న ఆదాయపు పన్ను ఆదాయం వాటా 2024-25లో 30.9 శాతానికి పెరిగింది. కార్పొరేట్ పన్ను కోతల వల్ల ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.1.45 లక్షల కోట్లు నష్టపోతోంది. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత అసమానతలు కలిగిన దేశంగా మారింది. జనాభాలో ఒక శాతం మంది నియంత్రణలో దేశ ఆదాయంలో 22.6 శాతం ఉంది. దేశ సంపదలో 40.1 శాతం వారివద్దే ఉంది.



భారతదేశం బలమైన మత ప్రభావం కలిగిన దేశం. కమ్యూనిస్టులు, సోషలిస్టులు మత వ్యతిరేకులని జరుగుతున్న ప్రచారం సీపీఐ(ఎం) బలోపేతానికి ఆటంకం కలిగించడం లేదా?

కమ్యూనిస్టులు మత వ్యతిరేకులనేది నిరాధారమైన ప్రచారం. కమ్యూనిస్టులు మత విశ్వాసాలకు వ్యతిరేకం కాదు. మతం పేరుతో జరుగుతున్న ఉన్మాద చర్యలకు, మతోన్మాదానికి, మత విభజనలకు వ్యతిరేకం. 1864లో ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ (ఫస్ట్ ఇంటర్నేషనల్)ను కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, మిఖాయిల్ బకునిన్ ఏర్పాటు చేసినప్పుడు దీనిని స్పష్టం చేశారు. రష్యన్ విప్లవకారుడు బకునిన్ ఇంటర్నేషనల్‌లో మతపరమైన భావజాలాలతో సంబంధం లేని వారిని మాత్రమే సంస్థలో సభ్యత్వంలోకి చేర్చాలని వాదించారు. మార్క్స్, ఎంగెల్స్ దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల విముక్తి కోసం పోరాటంలో పాల్గొనడానికి సిద్ధంగా ఉన్న అన్ని మతపరమైన, దైవిక వ్యక్తులను సంస్థలో చేర్చవచ్చని మార్క్స్, ఎంగెల్స్ వాదించారు. బకునిన్ వైఖరిని అంగీకరించే యాంత్రిక భౌతికవాదాన్ని సీపీఐ(ఎం) సమర్థించదు. మత విశ్వాసులను సమీకరించడంతో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడం, విస్తరించడం సీపీఐ(ఎం) వైఖరి. ఇది 24వ పార్టీ మహాసభ డాక్యుమెంట్ మరింత స్పష్టం చేసింది.



పెరుగుతున్న బీజేపీ ప్రభావాన్ని ఎలా ఎదుర్కొంటారు?

కేంద్రంలో అధికారంలో ఉండటం కొన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైఖరిని అంగీకరించడానికి మార్గం సుగమం చేసింది. సంఘ్‌పరివార్ చేతుల్లో గాంధీజీ రక్తం మరకలు ఉన్నాయని, గాంధీజీని చంపిన తుపాకీతోనే గుజరాత్ మారణహోమం చేశారని, కల్బుర్గి, గౌరీ లంకేష్, దభోల్కర్ ప్రాణాలను తీశారని మన దేశంలో అందరికీ అర్థమయ్యేలా చేస్తేనే కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకున్న నయా-ఫాసిస్టులను తరిమికొట్టగలం. వారు రెండు శాతం ఓట్ల తేడాతో కేంద్రంలో అధికారంలో ఉన్నారు. అందువల్ల, మోడీని ఓడించగల శక్తులు ఆయన చుట్టూ ఉన్నాయనే వాస్తవిక, ఆశావాద నమ్మకాన్ని మనం ప్రజల్లో కలిగించగలగాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమితో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం ముగియదు. ఈ వ్యక్తులు దశాబ్ద కాలంగా క్రమపద్ధతిలో భారతీయ సమాజంలోని దాదాపు ప్రతి భాగాన్ని మతోన్మాదంతో విషపూరితం చేశారు. భారతీయ సమాజ పరిరక్షణకు ఒక భారీ రాజకీయ, సాంస్కృతిక చికిత్స చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిని సాధించడానికి సీపీఐ(ఎం), భావసారూప్యత కలిగిన పార్టీలు, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సంస్థలు, వ్యక్తులు ఐక్యంగా ఉండాలని ప్రతిపాదిస్తున్నది. దీనిని సమర్థవం తంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే సీపీఐ(ఎం), వామపక్షాలు ఇప్పుడున్న దానికి పదిరెట్ల బలాన్ని పొందాలి.



ఈ ప్రశ్నకు బదులేదీ?

ఇది సినిమా పాట కాదండీ! నిజ జీవితం.. తర్కానికి అందని న్యాయం! దుర్మార్గమంటే ఏమిటి? క్రూరత్వానికి పర్యాయపదం ఏమిటి? లైంగిక దాడి అంటే ఏమిటి? న్యాయమంటే ఏమిటి? అన్యాయానికి వత్తాసు పలకటం ఏ విధంగా జరుగుతుంది? ఇటువంటి లక్షోపలక్షల న్యాయబద్ధమైన ప్రశ్నలు ఇప్పుడు భారతీయుల మెదళ్లలో మొలకెత్తుతున్నాయి.

గుల్ఫిషా ఫాతిమా వయస్సు 31 ఏండ్లు. 2020 నుంచి తీహార్ జైల్లో మగ్గుతున్నది. ఈ నెల 9వ తేదీకి జైల్లో అడుగుపెట్టి ఐదేండ్లు పూర్తయ్యాయి. ఒక పేద ముస్లిం కుటుంబంలో పుట్టిన గుల్ఫిషా ఫాతిమా ఉ.పా చట్టం (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కింద అరెస్టయ్యేనాటికి ఢిల్లీ యూనివర్సిటీలో ఉర్దూ ఆనర్స్ చదువుతున్నది. రేడియో జాకీగా పనిచేస్తున్నది. సీఏఏ వ్యతిరేక ఆందోళనలో గుల్ఫిషా ఫాతిమా చురుగ్గా పాల్గొన్నది. ఇదే ఢిల్లీ పోలీసులకు, మోడీ ప్రభుత్వ ఆగ్రహానికి కారణమైంది. 2020 ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లకు కారణమైన వారిలో గుల్ఫిషా కూడా ఒకరని ప్రభుత్వం లెక్కకట్టి అరెస్టు చేసింది. ఆమెకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యాన్ని కూడా పోలీసులు చూపించలేక పోయినారు. ఆమె నేరంపై విచారణ మొదలే కాలేదు. ఐదేండ్లు గడిచిపోయాయి. ఆమె 31 ఏండ్ల జీవితంలో 5 ఏండ్లు జైలు పాలు.

గత మూడేండ్లుగా ఆమె బెయిల్ కోసం ప్రయత్నిస్తూ ఉన్నది. రెండు సార్లు బెయిల్ దరఖాస్తు హైకోర్టు డివిజన్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. కానీ బెయిల్‌పై తీర్పు ఇవ్వక మునుపే జడ్జీల బదిలీ జరిగిపోతున్నది. సుప్రీంకోర్టు బెయిల్ విషయంలో జోక్యం చేసుకోవటానికి నిరాకరించింది. 'బెయిల్ రూల్ జైలు ఎగ్జంప్షన్' చెప్పటానికి, వినటానికి బాగుంటుంది కానీ, ఆచరణలో అది అందరికి సమానంగా ఆపాదించబడదు. ఇప్పుడు మూడోసారి బెయిల్ కోసం విచారణ జరగనున్నది.

ఇప్పుడు ఇటువంటిదే మరో సందర్భం చూద్దాం. ఢిల్లీ రాష్ట్రానికి ప్రస్తుత న్యాయశాఖ మంత్రిగా ఉన్న కపిల్ మిశ్రా ఆనాడు ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడని, ఘర్షణ రెచ్చగొట్టాడని ప్రత్యక్షసాక్షిగా మహమ్మద్ ఇలియాస్ స్వయంగా పోలీసు స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫిర్యాదు తీసుకోవటానికి నిరాకరించారు. దానితో ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కపిల్ మిశ్రాపై తాను చేసిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని పోలీసులకు ఆదేశం ఇవ్వమని జిల్లా కోర్టును అభ్యర్థించాడు. ఇలియాస్ చేసిన ఆరోపణను



పరిశీలించిన అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వైభవ్ చురాసియా, ఇలియాస్ చేసిన ఆరోపణలు, సాక్ష్యాలు అల్లర్లలో కపిల్ మిశ్రా పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించింది. అల్లర్లు జరిగిన ప్రాంతంలో కపిల్‌మిశ్రా ఉన్నాడని, ఆయన స్వయంగా ఇచ్చిన వాంగ్మూలంలో తాను అక్కడే ఉన్నట్టు అంగీకరించడాని, 'అదర్ సైడ్ ముస్లిమ్స్' అనే మాట ఉపయోగించటం, ముస్లింల పట్ల వ్యతిరేక భావాన్ని సూచిస్తున్నదని, కనుక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ చేయమని కోర్టు పోలీసులను ఆదేశించింది.

ఈ ఆదేశంపై స్టే ఇవ్వాలని కోరుతూ, కపిల్ మిశ్రా, ఢిల్లీ పోలీసులు వేర్వేరుగా హైకోర్టుకు వెళ్లారు. పోలీసులైతే ఏకంగా కపిల్ మిశ్రాకు క్లీన్ చిట్ ఇచ్చేశారు కూడా. ఈ స్టే ఎంత త్వరగా వచ్చిందంటే, మన న్యాయ స్థానాలు ఇంత తొందరగా స్పందిస్తాయా అని మూర్ఛపోవాలి. ఏప్రిల్ 1న జిల్లా జడ్జి విచారణకు పోలీసులను ఆదేశిస్తే, దానిపై ఏప్రిల్ 8 న హై కోర్టును కపిల్ మిశ్రా, పోలీసులు ఆశ్రయిస్తే, త్వరలో పరిశీలిస్తామని కోర్టు చెప్పిన మర్నాడే హైకోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా స్టే ఆర్డర్ కూడా జరిగిపోయింది. ఒక న్యాయ శాఖమంత్రి మీద చేసిన ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలున్నాయని జిల్లా జడ్జి భావించి, విచారణకు ఆదేశిస్తే, ముద్దాయిగా వున్న ఢిల్లీ న్యాయ శాఖమంత్రి రాజీనామా చేయలేదు. పైగా పోలీసులు కూడా ఆ మంత్రికి మద్దతుగా కోర్టుకెళ్ళి విచారణ అవసరం లేదని చెప్పటం మన నిష్పక్షపాత న్యాయస్థానాల్లో జరిగే వింత.

వడ్డించేవాడు మనవాడు అయితే కడబంతిన కూర్చున్నా అన్ని అందుతాయనే సామెత ఊరకే రాలేదని ఇటువంటి వాటిని చూస్తే అనిపిస్తుంది. ఐదేండ్లుగా బెయిల్ కోసం ఎదురుచూస్తూ, జైల్లో మగ్గుతున్న గుల్ఫిషా ఫాతిమా ఒకవైపు, ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి గనుక విచారించమని కోర్టు ఆదేశంపై స్టే మరో వైపు, న్యాయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఎక్కడ వెతుక్కోవాలి? రాజ్యాంగ ప్రతుల్లోనా, న్యాయ స్థానాల మెట్ల మీదా? న్యాయ మూర్తుల హృదయాల్లోనా? దీనికి ఎవరు చెబుతారు సమాధానం?

- కర్లపాలెం

బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో భేటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ, శాసనమండలిలో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లు ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం దాన్ని నిజం చేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో ఆమె భేటీ అయ్యారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జోతిబా పూలే విగ్రహ ఏర్పాటుకు మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ బహుజనుల సాధికారతకు ప్రతీకగా పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్ఠించాలని కోరారు. ఇదే డిమాండ్‌తో తాము అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతోనే రిజర్వేషన్ల అమలుకు ఉన్న 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని అన్నారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం కష్టతరమేమి కాదన్నారు.



ఈ బిల్లును కేంద్రం ఆమోదించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి మోడీ అపాయింట్‌మెంట్‌ను వెంటనే తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కోరారు.

పూలే విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తున్నాం : కవిత

హైదరాబాద్‌లో మహాత్మా జోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. అసెంబ్లీ ఆవరణలో విగ్రహం పెట్టేవరకు పోరాడతామని చెప్పారు. అంతకుముందు హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో ఉన్న మహాత్మా జోతిబా పూలే విగ్రహానికి బీసీ నాయకులతో కలిసి కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్, కో కన్వీనర్ బొల్ల శివ శంకర్, యూపీఎఫ్ నాయకులు అలకుంటల హరి, కొట్టాల యాదగిరి, ఎత్తరి మారయ్య, గోపు సదనందు, విజేందర్ సాగర్, రాచమల్ల బాలకృష్ణ, డి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కవిత పోరాటానికి మద్దతు : జాన్‌వెస్లీ

అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్సీ కవిత పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన అభినందనీయమన్నారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదనేది తమ నమ్మకమని అన్నారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

పూలే స్ఫూర్తితో మనువాదంపై మహోద్యమం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు
- కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- మేడ్చల్ జిల్లాలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. వెంకట్, ఎం. అడివయ్య

నవతెలంగాణ-అంబర్‌పేట

సామాజిక విప్లవ స్ఫూర్తి ప్రదాత జోతిబా పూలే స్ఫూర్తితో మనువాదంపై మహోద్యమం నిర్మించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని అంబర్‌పేట బతుకమ్మ కుంట నుంచి ఛే నెంబర్ మీదుగా పూలే విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూలే విగ్రహానికి సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార్‌తో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. పూలే నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. ఆయన స్ఫూర్తితో కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాన్ని చేపట్టాలన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడాలని తెలిపారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్ శక్తులకు మోడీ అమ్ముతున్నారని, దాంతో దళిత, గిరిజన, బలహీనవర్గాలకు క్రమంగా రిజర్వేషన్లు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. పూలే పోరాట స్ఫూర్తితో బీసీ కులగణన వంటి న్యాయమైన డిమాండ్ సాధనకు ఉద్యమించాలన్నారు. మతోన్మాద మనువాద శక్తులపై పోరాడుతూ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రభుత్వ రంగ సంస్థలను, సామాజిక న్యాయాన్ని మతసామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను సవరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ విధానాలు ఉన్నాయన్నారు. నాడు బొంబాయి నూలు మిల్లు కార్మికుల పోరాటంలో పూలే ప్రత్యక్షంగా పాల్గొని కార్మికులకు బాసటగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అంబర్‌పేట జోన్ కన్వీనర్ జి.రాములు, కేవీపీఎస్ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి బి్ర సుబ్బారావు, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు మోహన్, మల్లికార్జున్, వెంకటయ్య, రాజు, సోమయ్య, సురేష్ మాలోత్ వీర్య, శంకరయ్య శ్రీను, ఏసు, జనార్ధన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైనిక్‌పురిలోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.చంద్రమోహన్, సుల్తాన్, రమేష్ బాబు, జిల్లా నాయకులు రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీహార్, యూపీ, జార్ఖండ్‌లో

భారీ వర్షాలు

102 మంది మృతి

న్యూఢిల్లీ : బీహార్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్‌లో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా ఈ మూడు రాష్ట్రాల్లోనూ 102 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. బీహార్‌లో అత్యధికంగా 80 మంది మరణించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసాయి. దీంతో అనేక ప్రాంతాలు జలమయ్యాయి. పిడుగులు, వడగండ్ల కారణంగా మరణాలు సంభవించినట్లు ప్రభుత్వం తెలిపింది. మృతుల కుటుంబాల ఒకొక్కరికీ రూ 4 లక్షల పరిహారాన్ని ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ప్రకటించారు. అయితే రాష్ట్రంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉందని ఆర్‌జేడీ నాయకులు తేజస్వీ యాదవ్ తెలిపారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఒక్క అడుగు వెనక్కు?



డోనాల్డ్ ట్రంప్‌కు తత్వం బోధపడ్డట్టుంది. ప్రపంచ దేశాలతో రాజీకి వస్తున్నాడా!! మూడునెల్లపాటు తాను ప్రకటించిన పన్నుల యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లు చేసిన ప్రకటన దేనికి సూచిక ? ప్రపంచ మార్కెట్ల మీద చైనా ఎలాంటి గౌరవం ప్రదర్శించని కారణంగా 125శాతం విధిస్తున్నట్లు, దానిపై ఎలాంటి సంప్రదింపులు ఉండవని ట్రంప్ చెప్పటం మేకపోతు గాంభీర్యం తప్ప మరొకటి కాదు. యావత్ ప్రపంచం మీద పన్నుపోరు ప్రకటించిన అతగాడి నిర్వాకం కారణంగా స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయన్నది తెలిసిందే. మూడు నెలల వాయిదా ప్రకటనతో ప్రపంచవ్యాపితంగా స్టాక్‌మార్కెట్లు కోలుకున్నాయి. చిత్రం ఏమిటంటే చైనా మీద విధించిన 125 శాతంపై వెనక్కు తగ్గేది లేదన్న తర్వాత కూడా చైనా స్టాక్ మార్కెట్లు మిగతా వాటితో పాటు గురువారం నాడు పెరిగాయి. ఈ పూర్వరంగంలో చైనా మీద ప్రతి సుంకాలు ఎందుకు ప్రభావం చూపలేదు ? పర్యవసానాలేమిటి? అసలు ట్రంప్ ఎందుకు వెనక్కు తగ్గాడనే చర్చ, విశ్లేషణలు ప్రారంభమయ్యాయి.

మూడు నెలల వాయిదాకు దోహదం చేసిన అంశాలేమిటి? తమ మంత్రిత్వశాఖలు, వాణిజ్య ప్రతినిధితో 75దేశాలు సంప్రదింపులు జరిపినట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. అలాంటి వారి మీద సభ్య సమాజం ఉచ్చరించటానికి సిగ్గుపడే పదజాలంతో వ్యాఖ్యానించాడు.వారంతా ఒప్పందం చేసుకోవటానికి చచ్చిపోతున్నారన్నాడు.రిపబ్లికన్ పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 'మనకు ఫోన్లు చేస్తున్న దేశాల వారు ప్లీజ్ ప్లీజ్ సర్ ఒప్పందం చేసుకోండి, నేను ఏదైనా చేస్తాను' అని చెబుతున్నారని, చివరకు తనను ముద్దు పెట్టుకుంటానన్నారని నోరుపారేసుకున్నాడు. ఇది నిజమా? అబద్దాలు, గొప్పలు చెప్పటంలో ఆరితేరిన ట్రంప్ గురించి తెలిసినప్పటికీ తెరవెనుక సిగ్గు ఎగ్గూలేని అలాంటి బాపతు ఉన్నా ఆశ్చర్యం లేదు. చైనా సరేసరి తగ్గేదేలే అని చెప్పింది. మిత్రపక్షంగా ఉన్న ఐరోపా సమాఖ్య 2300కోట్ల డాలర్ల మేరకు అమెరికా వస్తువుల మీద పన్ను విధించనున్నట్లు ప్రకటించింది, కెనడా కూడా అదే బాటలో ఉంది.మన దేశం మౌనభాషనే కొనసాగి స్తోంది. అటూ ఇటూ ఏదీ చెప్పకుండా గోడమీద పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తున్నాం. ఎక్కువ పన్నులు విధించిన దేశాల నుంచి సరుకులను మనదేశానికి దిగుమతి చేసుకొని వాటిని తిరిగి ఎగుమతి చేయవద్దని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ మన ఎగుమతిదార్లను హెచ్చరించారు. పిటిఐ వార్త మేరకు చైనా, ఇతర ఆసియన్ దేశాల సరుకులను మన దేశం నుంచి ఎగుమతి చేయవద్దని చెప్పారట. అలా జరుగుతోందని గతంలో ఎన్నడూ మన ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పుడు అలా మాట్లాడారంటే ఎవరి మెప్పు పొందేందుకో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ మరో సందేహం కూడా తలెత్తుతోంది. గతంలో అలా చేసిఉంటే అసలు నిజంగా మన ఎగుమతులు పెంచామని బీజేపీ పాలకులు కొట్టుకుంటున్న డబ్బా మీదనే అనుమానం వస్తోంది. మనది 'దలాల్' ప్రభుత్వమా?

ఎక్కువ పన్నులు విధించిన దేశాల నుంచి సరుకులను మనదేశానికి దిగుమతి చేసుకొని వాటిని తిరిగి ఎగుమతి చేయవద్దని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ మన ఎగుమతిదార్లను హెచ్చరించారు. పిటిఐ వార్త మేరకు చైనా, ఇతర ఆసియన్ దేశాల సరుకులను మన దేశం నుంచి ఎగుమతి చేయవద్దని చెప్పారట. అలా జరుగుతోందని గతంలో ఎన్నడూ మన ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పుడు అలా మాట్లాడారంటే ఎవరి మెప్పు పొందేందుకో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ మరో సందేహం కూడా తలెత్తుతోంది. గతంలో అలా చేసిఉంటే అసలు నిజంగా మన ఎగుమతులు పెంచామని బీజేపీ పాల కులు కొట్టుకుంటున్న డబ్బా మీదనే అనుమానం వస్తోంది. మనది 'దలాల్' ప్రభుత్వమా?

అసలు పన్నుల వాయిదా నిర్ణయానికి దారితీసిందేమిటి? మొదటి కారణంగా చెప్పుకోవాలంటే అమెరికాలో ఏప్రిల్ ఐదున 150 సంస్థల పిలుపు మేరకు 20లక్షల మంది జనం1400 ప్రదేశాల్లో నిరసనలు, ప్రదర్శనలు చేశారు. వెనక్కు తగ్గకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత మద్దతు ప్రకటించిన ద్రవ్య పెట్టుబడిదారులు, ఇతరులు కూడా పర్యవసానాలను చూసి వైఖరి మార్చుకుంటున్నారు. ఒక్కరంటే ఒక్క ఆర్థికవేత్త కూడా సానుకూలంగా మాట్లాడిన ఉదంతం లేదు. ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత భారీగా పెరుగుతుందని ఆశించిన ఎలన్ మస్క్ సంపద ఇప్పటి వరకు 13,500కోట్ల డాలర్లు హరించుకుపోయింది. చైనాతో సహా ఎవరి మీదా పన్నులు వేయవద్దని, పునరాలోచించాలని ట్రంప్‌ను మస్క్ గట్టిగా కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక రాసింది. చైనా వెనక్కు తగ్గకపోగా ఐరోపా సమాఖ్య కూడా ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. పన్నుల విధింపులో కీలక పాత్ర పోషించిన సలహాదారు పీటర్ నవారో, మరో కీలక సలహాదారు ఎలన్‌మస్క్ రోడ్డెక్కి దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఈ పరిణామాలతో గోడమీద పిల్లులు కూడా వ్యతిరేక శిబిరంలో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్వదేశంలో పెట్టుబడులు పెట్టి వస్తూత్పత్తి చేయాలన్న పిలుపుకు పెద్ద స్పందన కనిపించటం లేదు. మూడు నెలల కాలంలో లొంగుబాటును ప్రదర్శించే దేశాల మీద కొన్ని ఒప్పందాలను రుద్ది లబ్ది పొందే ఎత్తుగడ కూడా దీని వెనుక ఉండవచ్చు. ఈ వ్యవహారం కూడా త్వరంలోనే బట్టబయలు కానుంది. ఒకడుగు వెనక్కు వేసిన ట్రంప్‌ను దారికి తేవాలంటే అమెరికన్లు మరింతగా వీధుల్లోకి రావాలి, బాధిత దేశాలన్నీ సమైక్యం కావాల్సిన అవసరం ఉంది. భారీ విజయం పొందిన యాభై రోజుల్లో "పిచ్చివాడు" అని పిలిపించుకున్న చరిత్ర, అంత వ్యతిరేకత మూటగట్టుకున్నవాడు ట్రంపే!

చెట్టుంటేనే కదా ఓ పిట్ట వాలేది ,
పిట్టను చూసే కదా పది పక్షులు
పేరంటానికి వచ్చేది .
గోరువంకల గుసగుసలు,
కోకిల గానాలు, నెమలి నాట్యాలు,
పచ్చని భూతల్లి గుండెల
మీదనే గదా పల్లవించేది .
నీటి కుంటలు, పిల్ల కాలువలు ...
నగరానికెంత దూప తీరుస్తున్నాయో చూశావా..?
మీరోడ్డు మోటర్లు వదిలే పొగను పీల్చుకొని
మీ గుండెలకెన్ని టన్నుల ఆక్సిజన్‌ను
అందిస్తున్నాయో ...
ఎప్పుడైనా గమనించావా..?

అహాలనూ, అధికారాలనూ వదిలి,
ఒంటరి బాటసారివై ఓసారి
అడవిలో తిరిగిచూడు.
సైనికుల్లా బారులుగా సాగే ఎర్రచీమలు,
ఈత చెట్టుకు అల్లుకున్న

విధ్వంస రచన



దుసరి తీగల హొయలు,
కొలనుపక్క జువ్వి చెట్టుమీద
గుడ్డి కొంగల కాపురాలు,
మద్దిచెట్టు కొమ్మల మీద నెమలి క్రీంకారాలు,
గరక పాకిన మైదానం మీద లేడి పిల్లల దుంకులాట,
జిట్టరేగి పొదలో చుట్టుకున్న పాము,
కుందేలు సోపతి.
పరుపు బండలు, నిగిడిన గుండ్లు,
చినుకు పడితే అడవి వెదజల్లే సుగంధాలు,
ఓసారి గుండెనిండా కండ్లు చేసుకొని చూడు,
ఎన్ని ఇంద్రధనస్సులు,
మరెన్ని స్వర్గసీమలు కనిపిస్తాయో..?
ఎన్ని కరెన్సీ నోట్ల కట్టలు ఖర్చు చేసినా
ఓ అడవిని సృష్టించగలమా ?
భూమంటే రియల్ ఎస్టేటని, అడవంటే
ఆక్రమించునదని
రాజకీయ దళారుల వద్ద పాఠాలు నేర్చుకున్న
కలల బేహారులకేమి తెలుసు...
మనిషికీ, అడవికీ ఉన్న అనుబంధం.

అధికారమంటే .అమ్మకం, కొనుగోళ్లుగా
మారిన ప్రజాస్వామ్యంలో వన్యప్రాణుల
ఎలిజీలను బుద్ధిజీవులే గదా వినగలిగేది .
విద్యార్థి ప్రసూణాల నిరసనలను,
వన ప్రేమికుల ఆలోచనలను
అవలోకించండి
మీ బుల్డోజర్ ఆదేశాలను తగలేయండి.
అడవిని వన్యప్రాణులతో మననీయండి.

- పుప్పాల కృష్ణమూర్తి

సమస్యల వలయంలో సాగునీటి ప్రాజెక్టులు


సారంపల్లి మల్లారెడ్డి
9490098666

తెలంగాణలో దాదాపు అరవై శాతం జనానికి వ్యవసాయమే జీవనాధారం. అంతటి ప్రాధాన్యత గల ఈరంగం పట్ల పాలకుల చిత్తశుద్ధి కరువైంది. పేరుకు మాత్రం పెద్ద ప్రాజెక్టులు చేపట్టడం,వాటి నిర్మాణంలో నిర్లక్ష్యం వహించడం వెరసి దశాబ్దాలుగా పనులు నత్తనడకన సాగడం, రాష్ట్రంలోని ప్రాజెక్టుల పనితీరుకు పరాకాష్ట. సాగునీటి నిపుణులు ఎంత వారించినా గత సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నిధులన్నీ నీళ్లపాలు చేసింది. కొత్త ప్రభుత్వమైనా ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తిచేస్తుందా అంటే ఆ వైపు దృష్టే లేదనిపిస్తోంది.బడ్జెట్‌లో నిధులు కేటాయించడం వరకు బాగానే ఉన్నా వాటిలో సగం మాత్రమే ఖర్చు చేయడం మూలాన ఏడాదిలో పూర్తికావాల్సిన రిజర్వాయర్ కాస్తా ఏండ్లతరబడి కొనసాగుతున్నది. కేవలం రెండువేల కోట్ల రూపాయలతో ఏడాదిలో పూర్తయ్యే పదహారు ప్రాజె క్టులు ఉన్నా వాటిని పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది. అవి పూర్తయితే దాదాపు ఐదు లక్షల ఎకరాలకు సాగు నీరం దుతుంది. కమీషన్లకు కక్కుర్తి పడి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను ఏటీఎంలుగా మార్చుకుందనే అపవాదు ఉంది. దాన్ని తొలగించి పనిచేయాల్సిన కాంగ్రెస్ సర్కార్ కూడా అదే విధానంతో ముందుకు సాగుతున్నదనే విమర్శ మూటకట్టుకుంటోంది.

తెలంగాణ రాష్ట్రంలో 34 భారీ ప్రాజెక్టులు, 39 మధ్య తరహా ప్రాజెక్టులు, ఒకటి ఆధునీకీకరణ , వరద నివారణ ప్రాజె క్టుతో మొత్తం 75 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. 31 భారీ మధ్య తరహా (24 భారీ- 7 మధ్య తరహా) 52.95 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. చిన్నతరహా ఎత్తిపోతల పథకాల ద్వారా 4.76 లక్షల ఎకరాలు, చెరువుల ద్వారా 29.88 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. వీటికింద ఇంకా 1.09 లక్షల ఎకరాలు, రాష్ట్రంలో మొత్తంగా 73.57 లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించాలి. ఇంకా 54 లక్షల ఎకరాలకు నీరందించాలి. ప్రస్తుతం 2025-26లో 5.05 లక్షల ఎకరాలకు, 2026-27లో 5.10 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించాలనేది మన ప్రభుత్వ లక్ష్యం.2025-26 బడ్జెట్‌లో రూ.23.330.65 కోట్లు కేటాయించింది.ఇందులో భారీ మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.10,838.18 కోట్లు, చిన్నతరహా వనరులకు రూ.948.60 కోట్లు మొత్తం రూ. 11,786.78 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసింది. మిగిలిన నిధులు రుణాలకు, సిబ్బందికి వ్యయం చేస్తుంది. 2023-24లో రూ.15,488.11 కోట్లు కేటాయించి రూ.11,210.57 కోట్లు వ్యయం చేసింది. 2024-25లో రూ.11,210.57 కోట్లు కేటాయించి ఫిబ్రవరి 25వరకు రూ.6,946.66 కోట్లు మాత్రమే కేటాయించింది. నిధులు కేటాయించినప్పటికీ వాటిని ఖర్చుచేసి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నది.

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలను ప్రారంభంలో జూరాల ప్రాజెక్టునుండి రూ.38,500ల కోట్లతో 2004లో అప్పటి ప్రభుత్వం రూపొందించింది. దాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీ- డిజైన్‌చేసి జూరాల నుండి 250 కిలోమీటర్ల దిగువన గల శ్రీశైలం వెనుక నీటి నుండి ఎత్తి పోతలుగా 2016లో మార్చింది. రీ-డిజైన్ తర్వాత 3 ఫిబ్రవరి2025 నాటికి రూ.32,662 కోట్ల వ్యయం చేసింది. ఇంకా రూ.43వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టు కింద మహబూబ్ నగర్,(2,35,319 ఎకరాలు) నాగర్‌కర్నూల్ 1,03,389, నారాయణపేట్ 1,60,955, రంగారెడ్డి 3,59,046, వికారాబాద్ 3,41,952, నల్లగొండ 26,339 ఎకరాలు మొత్తం 12.30లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడంతోపాటు, 30టీఎంసీలు హైదరాబాద్‌కు తాగునీటికి సరఫరా చేయాలి. దిండి ఎత్తిపోతలను నార్లపూర్ నుండి నిర్మాణానికి మార్పుచేసింది. దిండి ఎత్తిపోతలకు రూ.6,190 కోట్ల పరిపాలన ఆమోదంతో ప్రారంభించింది. రూ.1800ల కోట్లతో ఐదు ప్యాకేజీలు 2026 సెప్టెంబర్ వరకు పూర్తి చేయాలి.పాలమూరు ఎత్తిపోతల ప్రధాన ప్రాజెక్టులు నార్లపూర్ రిజర్వాయర్, ఏదుల రిజర్వాయర్, వట్టెం రిజర్వాయర్, కరివెన రిజర్వాయర్, ఉదండాపూర్, ప్రాజెక్టులు పూర్తయ్యాయి. కానీ, కాల్వలు ప్రారంభించలేదు. ఈసారి బడ్జెట్‌లో రూ.1,714 కోట్లు మాత్రమే కేటాయించడంతో పనులు ఇంకెప్పుడు పూర్తయ్యేను అనే ప్రశ్న ప్రజల నుంచి వస్తున్నది.

కాళేశ్వరం ఎత్తిపోతల 2005లో ప్రాణహిత - చేవెళ్ల పథకం పేరుతో రూ.18,500ల కోట్లతో ప్రారంభించింది. ప్రాణహిత నుండి ఎల్లంపల్లికి లిఫ్టుద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 140 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ, చేవెళ్లకు నీటిని అందించాలి. దీన్ని రీ-డిజైన్ ద్వారా ప్రాణహితకు బదులు గోదావరి నదిపై ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం చేసింది. మేడిగడ్డ వెనకనీటితో అన్నారం, సుండిల్ల ద్వారా ఎల్లంపల్లికి పంపాలి. అక్కడి నుండి మిడ్‌మానేరు ద్వారా గత డిజైన్‌నే అమలు చేయాలి. రీ-డిజైన్ వల్ల ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1.25 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతవరకు రూ.1.10 లక్షల కోట్లు వ్యయం చేసింది. కానీ, ప్రాజెక్టు ప్రారంభించిన నెల రోజుల్లో 2023లో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది. అన్నారం సుందిల్లకు బుంగలు పడ్డాయి. ఈ విధంగా ఈ మూడు ప్రాజెక్టులు పనికిరాకుండా పోయాయి. కాళేశ్వరం ఏడో బ్లాక్‌లో కుంగిన పిల్లర్లపై విజిలెన్స్ విచారించి 22మార్చి 2025న నివేదిక ఇచ్చింది. 17 మంది ఇంజనీర్లపై క్రిమి నల్ కేసులు చేపట్టాలని, మరో 30 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నివేదిక ఇచ్చింది. నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టి పై కూడా చర్యలకు సిఫారసులు చేసింది. మేడిగడ్డతో పాటు అన్నారం- సుందిల్ల ప్రాజెక్టులపై కూడా విచారణ సాగింది. నిర్మాణ లోపాలతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఆపరేషన్, మెయింటేనెన్స్ విభాగాల్లో పనిచేసే వారిపై చర్యలు చేపట్టాలని ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లలో నీటిని నిల్వ పెట్టరాదని సలహా ఇచ్చింది. రానున్న కాలంలో ఈ మూడు ప్రాజెక్టులను వినియోగించరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ శాఖ కూడా సూచించింది. ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం చేయడానికి రూ.20 వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టు నిర్వాహణ ద్వారా ఎకరాకు ప్రభుత్వం రూ.40వేలు రాయితీగా భరించాలి. ఈ మూడు ప్రాజెక్టులను తొలగించి ప్రాణహితనుండి ఎల్లంపల్లికి నీరు తేవడం ద్వారా ఎల్లంపల్లినుండి దిగువ ప్రాజెక్టులు ఉపయోగపడతాయి. ప్రాణహిత- ఎల్లంపల్లి - గంధమల్ల రిజ ర్వాయర్ వరకు నీటిని ఉపయోగించినచో ప్రభుత్వంపై ఎకరాకు రూ.10వేలు మాత్రమే వ్యయం చేయాలి అందువల్ల ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



కాళేశ్వరం ఎత్తిపోతల 2005లో ప్రాణహిత - చేవెళ్ల పథకం పేరుతో రూ.18,500ల కోట్లతో ప్రారంభించింది. ప్రాణహిత నుండి ఎల్లంపల్లికి లిఫ్ట్‌ద్వారా రోజుకు 2 టీఎంసీల చొప్పున 140 టీఎంసీలు ఎత్తిపోయాలి. ఎల్లంపల్లి నుండి మిడ్‌మానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, చేవెళ్లకు నీటిని అందించాలి. దీన్ని రీ-డిజైన్ ద్వారా ప్రాణహితకు బదులు గోదావరి నదిపై ప్రాణహిత కలిసిన తర్వాత మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణం చేసింది. మేడిగడ్డ వెనకనీటితో అన్నారం, సుండిల్ల ద్వారా ఎల్లంపల్లికి పంపాలి. అక్కడి నుండి మిడ్‌మానేరు ద్వారా గత డిజైన్‌నే అమలు చేయాలి. రీ-డిజైన్ వల్ల ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1.25 లక్షల కోట్లకు పెరిగింది. ఇంతవరకు రూ.1.10 లక్షల కోట్లు వ్యయం చేసింది. కానీ, ప్రాజెక్టు ప్రారంభించిన నెల రోజుల్లో 2023లో మేడిగడ్డ ప్రాజెక్టు కుంగింది. అన్నారం సుందిల్లకు బుంగలు పడ్డాయి. ఈ విధంగా ఈ మూడు ప్రాజెక్టులు పనికిరాకుండా పోయాయి.

లక్ష్యం సరే, చిత్తశుద్ధే కావాలి..

గతంలో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేర్లతో ఖమ్మం జిల్లాలో 4 లక్షల ఎకరాలకు రూ.6వేల కోట్లతో ప్రభుత్వం పథకాలు చేపట్టింది. సీతారామ సాగర్ రీ-డిజైన్‌వల్ల ఆయకట్టు 6.5 లక్షల ఎకరాలకు పెంచుతూ రూ. 30వేల కోట్ల అంచనాలతో నిర్మాణం మొదలుపెట్టింది. 2025-26 బడ్జెట్‌లో రూ.709.35 కోట్లు కేటాయించింది. దీన్ని వచ్చే వానాకాలం వరకు పూర్తి చేయాలని లక్ష్యంతో పనులు సాగుతున్నాయి. సీతారామ సాగర్ నుండి ఏన్కూర్ వరకు అనుసంధాన కాల్వ నిర్మించాలి. చిన్న కాళేశ్వరం, మోడికుంట, లోయర్ పెనుగంగా, చనకా-కొరటా, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ సాగర్, కొయిల్‌సాగర్, రాజీవ్ భీమా, నెట్టంపాడు, కల్వకుర్తి, దిండి, ఎఎంఆర్ ప్రాజెక్టు, ఎస్‌ఎల్‌బిసి టన్నెల్, శ్రీరాంసాగర్ 2వ దశ, సదర్‌మాట్, నీల్‌వాయ్, పాలెంవాగులు 75 శాతం పూర్తయ్యాయి. వీటిని రానున్న సంవత్సరంలో పూర్తి చేయాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుండి ఎఐబిపి కింద మోడికుంట, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల, దిగువ పెనుగంగా, చనాక-కొరట ప్రాజెక్టులకు నిధులివ్వాలని కోరింది. అలాగే, కడెం ప్రాజెక్టు, లోయర్ మానేరు ప్రాజెక్టుకు పూడిక తీయడానికి డ్రెడ్జింగ్ చేయడానికి ప్రభుత్వ ఖర్చు లేకుండా "జాతీయ పూడికతీత - 2022"తో పనులు చేయించాలని కేంద్రాన్ని కోరింది. 450 చిన్న లిఫ్టులు రిపేర్లు చేయాలి. హుజూర్‌నగర్ కోదాడలో పనులు త్వరాగా ప్రారంభించాలి. ఇంత వరకు ప్రాజెక్టుల భూ సేకరణకు 5.04 లక్షల ఎకరాలు సేకరించాల్సి ఉండగా 3.89 లక్షల ఎకరాలు సేకరించింది.ఇంకా 1.147 లక్షల ఎకరాలు సేకరించాలి. నిర్వాసితులకు 30,870 గృహ నిర్మాణాలు, 48,183 ఇండ్ల పట్టాలిచ్చింది. డిసెంబర్ 2024 వరకు రూ.2,747 కోట్ల వ్యయంతో 46,904 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించింది.ఇంకా 14వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. నీటి పారుదల శాఖలో 675 ఏఇ పోస్టులను భర్తీ చేసింది. ఇంకా 500ల మందిని భర్తి చేయాల్సి ఉంది.

చిక్కువీడని అంతర్రాష్ట్ర సమస్యలు

ఆంధ్రా, తెలంగాణ మధ్య ఉన్న నీటి సమస్యను కేంద్రం తేల్చడం లేదు. రెండు రాష్ట్రాల మధ్య తగదా పెట్టి చోద్యం చూస్తున్నది. సమస్యను పరిష్కరించాలని ఇరు రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చినా బ్రిజేష్ ట్రిబ్యునల్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నది. ఈ మధ్యకాలంలో ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ విషయమై ఘర్షణా వాతావరణం తలెత్తగా దాన్ని సున్నితంగా పరిష్కరించాల్సింది పోయి ప్రాజెక్టులన్నింటినీ కేంద్ర జలవనరుల శాఖకే అప్పజెప్పాలని కేంద్రం అడుగుతున్నది. అంటే క్రిష్ణా మీద, జూరాల నుంచి, నాగార్జున సాగర్‌పై నిర్మించిన ప్రాజెక్టులన్నింటినీ కేంద్రం తమ ఆధీనంలో ఉంచుకుని ఎవరికి ఎంత నీటి వాటాను ఇవ్వాలో నిర్ణయిస్తుందన్నమాట! అంటే రాష్ట్రాలు తమ చెప్పుచేతల్లో ఉండాలనే వేస్తున్న ఎత్తుగడగా ఇది కనిపిస్తున్నది తప్ప సమస్యను పరిష్కరించే ఉద్దేశం అస్సలు కనపడటం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం క్రిష్ణా రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్‌కు ప్రాజెక్టులకు అప్పగించరాదని శాసనసభలో తీర్మానం చేసింది. కేఆర్‌బీఎం అధికార పరిధిపై సుప్రీంకోర్టులో కేసు వేసింది. అయితే ఏపీ నిర్మిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పింది. దీనివల్ల గోదావరి నీటిని తెలంగాణ ఉపయోగించుకోకుండా నష్టం వాటిల్లుతుంది.

వీటికి సంబంధించిన వివాదాలు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు నడుస్తున్నాయి. 2004లో వేసిన ట్రిబ్యునల్ నేటికీ మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య పరిష్కారం చేయడంలో విఫలమౌతున్నది. ప్రతియేటా నీటి వనరులకు కేటాయించిన నిధులు వ్యయం చేయడం లేదు. మైనర్ ఇరిగేష్ ఐడిసి లిఫ్ట్ పథకాలు, చెరువులు, మధ్య తరహా ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి. భారీ ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలి. ఇందుకు తగిన నిధులు కేటాయించాలి. అప్పుడు మాత్రమే ప్రాజెక్టుల సమస్య పరిష్కారమవుతుంది. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు దాటినా నీటి పంపిణీ వివాదాన్ని పరిష్కరించకుండా ఇరు రాష్ట్రాల మధ్య కేంద్రం ఘర్షణ పెట్టిన తీరు ప్రజలు గమనించాల్సిన అవసరం ఉన్నది. ■

హిందూ మతోన్మాదానికి అంబేద్కర్ ఓ సవాల్


నాదెండ్ల శ్రీనివాస్
9676407140

స్వాతంత్ర్య భారతదేశం అంబేద్కర్ 134వ జయంతి జరుపుకోవటానికి సిద్ధమవుతున్న సందర్భంలో ఒక పక్కపార్లమెంట్ సాక్షిగా జరిగిన ఘోర అవమానం.మరోపక్క ఆయన ఎన్నడూ లేనంత ఎత్తుకు ఎదిగినట్లు కనిపిస్తున్నది.అనేకముఖ్య ఘట్టాల్లో, ఉద్యమాల్లో నవభారత నిర్మాణం, ప్రజాస్వామ్యం, సామాజిక రుగ్మతలు లేని దేశం కోసం అంబేద్కర్ కృషి చేశారు. ఆయన జీవితానుభవంలో గుర్తించిన సామాజిక సమస్యలు, ఉద్యమాలు, అధ్యయనం, ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలి. భారత సమాజం గురించి ఆయన లోతుగా పరిశీలన చేసి లేవనెత్తిన అనేక ప్రశ్నలు నేటికీ సజీవంగా నిలిచి ఉండటం,ఆయన కృషిని,ప్రాధాన్యతని నేటికీ గుర్తు చేస్తున్నాయి.1871 ఏప్రిల్ 14వ తేదీన మధ్య భారతదేశంలో మౌ అనే ప్రాంతంలో, మత భావాలను విశ్వసించే,పేద మెహర్ కుటుంబంలో భీమ్ రావ్ అంబేద్కర్ జన్మించారు.పాఠశాల విద్యాభ్యాసం సతారాలోను, కళాశాల విద్యాభ్యాసం ముంబైలోను పూర్తిచేసిన అంబేద్కర్ 1913-17లో కొద్దికాలం పాటు బరోడా మహారాజు దగ్గర సేవలందించారు.లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కొలంబియా విశ్వవిద్యాలయంలో, గ్రేస్ ఇన్ బాక్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్య నభ్యసించిన ఈ నవయువకుడు ఆనాటి సమకాలీన రాజకీయ నాయకుల్లో చాలా మందికి లేనటువంటి, అమోఘమైన పాండిత్యాన్ని సంపాదించారు. సామాజిక అడ్డంకులు ముఖ్యంగా పక్షపాత వైఖరి, సామాజిక అణచివేతలు, కులపీడనలు వంటివి ఎదుర్కొని ఈ ఘనత సాధించారు.

1920లలో తొలినాళ్లకే అంబేద్కర్ ఎం.ఎ, పిహెచ్‌డి అర్థశాస్త్రంలో ఎమ్మెస్సీ,డి.ఎస్.సి, బారిస్టర్ ఎట్ లా పూర్తి చేశారు.తనకి ముప్పై ఏండ్లొచ్చేసరికే ప్రముఖ విద్యావేత్తలు, అధ్యయనకారులు తమ జీవితకాలంలో సాధించలేనన్ని నిజ జీవితఅనుభవాలను అంబేద్కర్ గడించారు. నాలుగు దశాబ్దాల తన ప్రజాజీవితంలో అనేక వివాదాస్పద అంశాలలోనూ, అధిగమించటానికి వీలు లేనటువంటి సామాజిక అంధకారంలో నుంచి వెలుతురులా ఉద్భవించారు. అలెగ్జాండర్ గోల్డెన్‌వైజర్ 1916మే నెలలో సామాజిక శాస్త్రాలపై సెమినార్ జరిపినప్పుడు, మొట్టమొదటి సారిగా అంబేద్కర్ భారతదేశంలో కులాల తీరు తెన్నులు, పుట్టుక, అభివృద్ధి అనే అంశంపై చాలా అద్భుతమైన పత్రాన్ని అందించారు. పారదర్శకత, నిజాయితీ, పట్టుదల వంటి అపూర్వగుణాలు కలిగిన ఉదారవాది డా.అంబేద్కర్. తాత్వికంగా మొదట ఆదర్శవాదం వైపు మొగ్గినప్పటికీ, అంతిమంగా బుద్ధుని సిద్ధాంతం వైపు ఆకర్షితుడయ్యారు. మార్క్సిజం పుస్తకాలను కూడా చాలా లోతుగా అధ్యయనం చేశారు. 1950లో ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉండి హిందూ కోడ్ బిల్లు తెచ్చినప్పుడు, అదే జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా అంబేద్కర్‌ను దెబ్బతీశారు. అంబేద్కర్ జీవించినంత కాలం, ఆయన ప్రత్యర్థులు, విమర్శకులు మరీ ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ఆయన్ను ఆ యుగంలోని వ్యూహాత్మక లక్ష్యాన్ని గుర్తించలేని వ్యక్తిగా పదేపదే అభివర్ణించేవారు.ఆ ప్రచారం బాగా ప్రాచుర్యం పొంది, ఆఖరికి మీడియా కూడా ఆయన్ను ఒక రెండో తరగతి దేశనాయకుడిగా,షెడ్యూల్డ్ కులాలకే పరిమితమైన నాయకుడిగా చిత్రీకరించింది. వస్తుగతంగా చూస్తే ఆయనంత ఉన్నత వ్యక్తి, సాహసోపేతమైన దేశ నాయకులు చాలా తక్కువమంది ఉన్నారన్నది సుస్పష్టం.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచిన స్వాతంత్ర్య పోరాటంలో దీనికి తగినంత ప్రాధాన్యత ఇవ్వబడలేదు. దేశ రాజకీయ దృక్పథంలో ఎప్పుడూ నికరంగా కేంద్ర స్థానం వహిస్తూ, తీవ్రవాద శైలితో, సామాజిక అంశాల్లో ఎటువంటి సర్దుబాటు ధోరణి ప్రదర్శించకుండా ఎన్నో ఉద్య మాలకు నాయకత్వం వహించారు అంబేద్కర్. సమాజంలోని అసమానతలు, మతాల్లో ఇమిడి ఉన్న అణచివేత ధోరణులు, సాంప్రదాయ వారసత్వాలు, మెజారిటీ సమాజం రుద్దిన విలువలను గమనించారు. అంబేద్కర్ రాజ్యాంగసభలో,రాజ్యాంగ ముసాయిదా రూపకల్పన కమిటీకి అధ్యక్షత వహించి,ప్రధాని నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్‌లో కొంతకాలం ఉన్నప్పటికీ, భారత రాజకీయాల్లో కాంగ్రెసేతర, కాంగ్రెస్ వ్యతిరేక భావధారకు ఆయన్నే మనం



ఆద్యుడిగా పరిగణించాలి.కానీ వాటికి భిన్నంగా హిందూ మితవాదం బాగా పైచేయి సాధించి,మెజారిటీ మతమౌఢ్యం, సామాజిక అభివృద్ధి నిరోధకత్వాలు సాగిస్తున్న రాజకీయ,సిద్ధాంత ఎదురుదాడి ప్రస్తుత దేశపరిస్థితికి అద్దం పడుతున్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి హిందూత్వవాదులు చరిత్రసారాన్ని వక్రీకరించి మరీ ప్రయత్నాలు సాగిస్తున్నారు.ఇటువంటి పరిస్థితుల్లో కులవ్యవస్థపైనా,చాతుర్వర్ణ, సనాతన ధర్మాల పైనా ప్రతిఒక్కరూ పోరాడాలి. అంటరానితనాన్ని మార్పు లేకుండా యథాతథంగా నిలిపి ఉంచే సామాజిక దొంతరలపైనా హిందూ ధర్మశాస్త్రాల ఆధిపత్యం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై నేడు ఉద్యమించాలి. ప్లాటో రిపబ్లిక్ ఏ కారణం వల్ల వైఫల్యాన్ని ఎదుర్కొందో,సరిగ్గా అదే కారణం మూలంగానే చాతుర్వర్ణ వ్యవస్థ కూడా తప్పని సామాజిక తిరుగుబాటుదారుడైన,ఈ పీడిత వర్గ మేధావి హెచ్చరించారు.

ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువుల్లో దిగువ వర్ణాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని అంబేద్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహాయులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక, ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు.ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ మతానికి ఓసవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు.అందువల్లనే హిందూత్వ వాదులు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమికి చెందిన కొన్ని శక్తులు నేడు ఆయనను నిర్లక్ష్యం చేయలేని స్థితిలో ఉన్నాయి. సామాజిక పురోగతిని నిరోధించటానికి పూనుకున్న వారిని వ్యతిరేకిస్తూ, సామాజిక ఛాందసవాదం, అవకాశవాద రాజకీయాలపై యుద్ధాలు సాగిస్తూ 1940 దశకం చివరిలో, 1950 దశకం తొలిలో హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలకు నాయకత్వం వహించారు.కానీ ఛాందసవాద శక్తులు ఆయన ప్రయత్నానికి వెన్నుపోటు పొడిచాయి.

వారసత్వం, వంశపారంపర్య పాలననూ,ఏక పార్టీ వ్యవస్థను ఆయన ద్వేషించారు.ఒకే పార్టీ ప్రజామోదమైన ప్రభుత్వాన్ని నడపటం అంటే,నిరంకుశత్వం తెరవెనుక నుండి పాలన సాగించే ఒక రూపంగా ప్రజాస్వామ్యం తయారవ్వడాన్ని అనుమతించడమే అనేది అంబేద్కర్ ప్రముఖ సూత్రీకరణల్లో ఒకటి.నిరంకుశత్వం ఎన్నికయినదయినప్పటికీ, అది నిరంకుశత్వం కాకమానదు. నిరంకుశత్వం కూలదోయబడే అవకాశం ఉండటం,దాన్ని తోక ముడిచేటట్లు చేయగల అవకాశం ఉండటం,దాని ప్రత్యర్థి పార్టీ దాని స్థానంలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉండటమే నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నిజమైన గ్యారంటీ అని అంబేద్కర్ హెచ్చరించారు. ఏకపార్టీ పాలన ప్రాతిపదికన గానీ,లేదా నిద్రపోయే హక్కులని నిద్రపోనీ అనే సామాజికతత్వ ప్రాతిపదికతో ఉండే రాజకీయ సుస్థిరత గానీ అంబేద్కర్‌కు గిట్టని విషయాలు. అంబేద్కర్ దూరదృష్టితో వెలిబుచ్చిన రాజకీయ భావాల్లో రెండు నేటి కాలానికి కూడా వర్తిస్తాయి.వాటిలో మొదటిది రాజకీయ స్వేచ్ఛలను ఒక గొప్ప వ్యక్తి పాదాల కింద ఉండనివ్వకండని,రెండోది రాజకీయాలలో భక్తి లేదా వీరారాధన ఉంటే అది అధోపతనానికి దారి అని చెప్పారు.అందుకే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్ది,వైరుధ్యాలను పరిష్కరించాలని లేకపోతే అవి ప్రజాస్వామ్య పునాదుల్ని నాశనం చేస్తాయని అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు.కాబట్టి నేడు ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాలను అధిగమించేందుకు పోరాడటమే ఆయనకు నేడు మనమిచ్చే నిజమైన నివాళి.

(ఏప్రిల్ 14 డాక్టర్ అంబేద్కర్ జయంతి) ■

ఈ దుర్మార్గ వ్యవస్థ మూలంగా హిందువుల్లో దిగువ వర్ణాలు ప్రత్యక్షంగా కార్యాచరణలోకి దిగకుండా పూర్తిగా నిస్సహాయులుగా చేయబడ్డారని అంబేద్కర్ వేలెత్తి చూపి ఇంతకంటే నీచమైన సామాజిక వ్యవస్థ మరొకటి రాబోదని హెచ్చరించారు.ఈ వ్యవస్థ ప్రజలను పరస్పర సహాయ కార్యకలాపాలు చేయనివ్వకుండా కుంటుపరిచి,వారిని నిస్సహాయులుగా,చచ్చుబడిన వారిలా చేస్తుందని తెలిపారు.ఆయన సామాజిక, ఆర్థిక,ప్రజాస్వామ్యం కోసం ఉద్యమిస్తూనే ఈ వ్యవస్థ రాజకీయ రంగంలో కలగజేసే ప్రభావాలపై దృష్టి సారించి అవిరళమైన కృషి చేశారు. ధర్మశాస్త్రాలపై ఉన్న విశ్వాసాన్ని సర్వనాశనం చేయడం,వాటి పునాదిగా గల కులపరమైన నిరంకుశత్వాన్ని నాశనం చేయడమే దీనికి వాస్తవ పరిష్కారమని అంబేద్కర్ భావించారు.ఇటువంటి విషయాల్లో గాంధీ అర్ధ శతాబ్దానికి ముందే 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హిందూ మతానికి ఓసవాల్' అని ప్రకటించాడంటే అందులో ఆశ్చర్యమేమీలేదు. నిజంగానే ఆయన ఈనాటికీ ఒక సవాల్ గానే నిలిచి ఉన్నారు.

సన్నబియ్యం పంపిణీ దేశానికే రోల్ మోడల్

స్పందన తట్టుకోలేక బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం

పేదోడి కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ కర్తవ్యం

హైదరాబాద్‌లో మే 1 నుంచి సన్నబియ్యం పంపిణీ

రబీ పంటకు సరిపడా కొనుగోలు కేంద్రాలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విప్లవాత్మక మార్పునకు భారీ స్పందన





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సన్నబియ్యం పంపిణీ యావత్ భారతదేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బియ్యం పంపిణీలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పునకు ప్రజల నుంచి భారీ స్పందన రావడం స్వాగతిస్తున్నామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి ప్రజలు నీరాజనాలు పలుకుతుండడంతో తట్టుకోలేక బీజేపీ, బీఆర్ఎస్‌లు తమ అక్కసు వెళ్లగక్కుతున్నాయని ఆయన విరుచుకుపడ్డారు. దేశంలో ముందెన్నడూ లేని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో కలసి పీసీసీ కార్యవర్గంతో పాటు డీసీసీ, ఎంసీసీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులతో గాంధీభవన్ నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఆహార భద్రత కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఆశయం నెరవేర్చినట్టైం దన్నారు. నిరుపేదల కడుపు నింపడంతో పాటు వారి కళ్లలో వెలుగులు నింపాలన్న సంకల్పంతోటే ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి అంకురార్పణ చుట్టింద న్నారు. శాసనమండలికి ఎన్నికలు జరుగుతు న్నందున హైదరాబాద్‌లో మే 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేపడతామని ఆయన వెల్లడించారు. రబీ సీజన్‌లో పండిన పంటను కొనుగోలు చేసేందుకు సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అవసరం అనుకున్న చోట కొత్తగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి ఆయా జిల్లాల కలెక్టర్లకు బాధ్యత అప్పగించినట్టు ఆయన తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించు కుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కానీ, పదేండ్లుగా తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కానీ సన్నబియ్యం పంపిణీ ఆలోచననే చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో 2.8 కోట్ల మందికి పంపిణీ చేసిన దొడ్డు బియ్యానికి రూ.10 వేల కోట్లు ఖర్చు అయ్యేదని ఆయన వివరించారు. ప్రస్తుతం ఆ సంఖ్య 3.10 కోట్లకు పెరుగుతుందని అందుకు అయ్యే వ్యయం కూడా రూ.13 వేల కోట్లకు చేరుకుంటుందని ఆయన చెప్పారు. సన్న బియ్యం పంపిణీకీ అయ్యే ఖర్చు ముఖ్యం కాదని పేదల ఆత్మగౌరవం పెంచేందుకే నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. అటువంటి బృహత్తరమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మారుముల ప్రాంతాలకు తీసుకెళ్ళడంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కంకణబద్ధుడై పని చేయాలని సూచించారు. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త తమ తమ భుజ స్కంధాలపై వేసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సన్నబియ్యం సాగుకు ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగు విస్తీర్ణం ఒక్కసారిగా 25 లక్షల నుంచి 40 లక్షల ఎకరాలకు చేరడమే ప్రజలలో కాంగ్రెస్ పాలనపై గూడు కట్టుకున్న విశ్వాసానికి అద్దం పడుతోందని వివరించారు.



హైదరాబాద్‌లో కొత్త బడులు తెరవాలి

టీపీఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు నర్సిరెడ్డి డిమాండ్

ప్రచార జాతా ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో కొత్త బడులను తెరవాలని తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులు నిలబడాలి–చదువుల్లో అంతరాలు పోవాలని గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ టీపీఎస్వీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నర్సిరెడ్డి నాయకత్వంలో శుక్రవారం ప్రచార జాతా ప్రారంభమైంది. హైదరాబాద్ లోని అంబర్‌నగర్, వారాసిగూడ, నామాలగుండు, సీతాఫల్‌మండి, మైలారిగడ్డ, చిలకలగూడ, పద్మారావునగర్, బాలాజీనగర్, పార్శిగుట్ట, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ (వడ్డెర బస్తీ), మాణికేశ్వర్‌నగర్ ప్రాంతాలను పర్యటించారు. ప్రజలను ప్రత్యక్షంగా కలిశారు.

ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను జూన్‌లోనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తరగతికొక గది, టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్తగా ఏర్పడిన నివాస ప్రాంతాల్లో కొత్తగా ప్రభుత్వ బడులు తెరవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా బడుల్లోనే ఏజెన్సీల ద్వారా వంట చేయించి పెట్టాలని అన్నారు. విద్యా పరిపాలన వ్యవస్థలో బడుల సంఖ్య, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఈవో, డిప్యూటీ ఈవో పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రీప్రైమరీ తరగతుల ఏర్పాటుకు కేంద్రం రూ.ఐదు వేల కోట్ల గ్రాంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అప్పుడే అంతరాలు లేని తరగతి గది మాత్రమే సమాజంలోని ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగిస్తుందని వివరించారు. లేకుంటే అంతరాలతో కూడిన తరగతి గది సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలను పెంచుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులున్నందున పిల్లలను వాటిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక భారాలకు గురై అప్పులపాలు కావొద్దని కోరారు. అవసరమైన కొత్త బడులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఈ జాతాకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీపీఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం మంగ, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావు, సమ్మద్, రామకృష్ణ, ధనమూరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణ

- వాటి సమర్పణకు తుది గడువు 30
- జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పూర్తిస్థాయి నోటిఫికేషన్, సమాచార బులెటిన్‌ను ఈనెల 15న అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. వాటి సమర్పణకు తుది గడువు ఈనెల 30 వరకు ఉందని పేర్కొన్నారు. జూన్ తొమ్మిది నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని తెలిపారు. అదేనెల 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని వివరించారు. పరీక్షలు ప్రతిరోజూ రెండు విడతల్లో నిర్వహిస్తామనీ, మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుపుతామని తెలిపారు. జులై 22న టెట్ ఫలితాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో ఏటా రెండుసార్లు (జూన్, డిసెంబర్)లో టెట్ పరీక్షలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో పరీక్షలను నిర్వహించింది. జనవరిలో జరిగిన టెట్‌కు 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 2,05,278 మంది రాతపరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష రాసిన వారిలో 83,711 (30.36 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

సామాజిక విప్లవ స్ఫూర్తి శిఖరం జ్యోతిబా ఫూలే

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- సీఐటీయూ ఆఫీసులో పూలే జయంతి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

కులం, మతం, లింగం పేరుతో మనుషుల పట్ల వివక్ష చూపే ధోరణి పోవాలనీ, మనుషులను మనుషులుగా చూసే సమసమాజం రావాలని 175 ఏండ్ల కిందటనే పోరాడిన సామాజిక విప్లవ స్ఫూర్తి శిఖరం జ్యోతిబా పూలే అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, చుక్కరాములు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. అంటరానితనం, వివక్ష, అణచివేత, దోపిడీ రూపాలతో శూద్రులకు అక్షర జ్ఞానాన్ని లేకుండా చేసే మనువాదంపై పూలే మహత్తర పోరాటాన్ని నిర్వహించి అణగారిన వర్గాల్లో విప్లవ చైతన్యాన్ని నింపారని కొనియాడారు. శూద్రులకు చదువు అవసరం లేదనే మనువాదుల కుట్రలను తిప్పికొడుతూ..అందరికీ చదువు అందడం ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని పోరాడిన మహనీయుడని గుర్తుచేశారు. శ్రమ చేయకుండనే సకల సంపదలను ఆరగించే అధర్మ నీతి అయిన మనుధర్మ శాస్త్రం ఎందుకు? శ్రమ చేసే మెజారిటీ ప్రజలకు ఉత్పత్తిలో సమానమైన భాగం ఎందుకు దక్కడం లేదని నిగ్గదీసిన సామాజిక విప్లవ శక్తి అని కొనియాడారు. భర్త చనిపోతే మహిళ విదవరాలు బతకడమేంటి అంటూ ఆనాటి సామాజిక రుగ్మతకు వ్యతిరేకంగా పోరాడి వితంతు వివాహాలను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి అన్నారు. మహిళా విద్యను ప్రోత్సహించడం కోసం తన భార్య సావిత్రీబాయి పూలేకు చదువు చెప్పి ముందుండి నడిపించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రాణాలు తీసుకోవద్దంటూ బ్రాహ్మణ వితంతువుల కోసం శరణాలయాలు స్థాపించారని చెప్పారు. స్త్రీలు, కార్మికులు, రైతులు, శూద్రులు, అతిశూద్రుల సమస్యలపై కూడా పోరాటం చేశారన్నారు. సర్వ మానవ సమతా భావం మానవాళికి మార్గం అని చెప్పిన మహనీయుడన్నారు. సత్యశోధక్ ద్వారా సమాజంలో మత సామరస్యం, మనుషుల మధ్య సోదర భావాలను పెంపొందించడం వంటి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. కేంద్రంలోని నేటి బీజేపీ పాలకులు ఆయన ఆశయాలను సమాధి చేస్తున్న తీరును ఎండగట్టారు. అందరికీ విద్య కోసం ఆయన తుదిశ్వాస వరకు కృషి చేస్తే కాసులున్న కొందరికే విద్యను అందించాలని అంగట్లో సరుకు మాదిరిలా విద్యను నేటి పాలకులు అమ్ముతున్నారని విమర్శించారు. దళితులపైనా, మహిళలపైనా, మైనార్టీలపైనా ఉద్దేశపూర్వక దాడులు చేస్తూ భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్న తీరును ఉదహరణలతో వివరించారు. మనువాదంపై మహోద్యమం చేపట్టాలనీ, దేశంలో పెరుగుతున్న విద్వేషాలను ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, భూపాల్, ఎస్వీ. రమ, వీఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శులు కె. ఈశ్వర్‌రావు, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. కోటంరాజు, పి. సుధాకర్, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

బీసీపట్ల కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు

- పూలే జయంతిలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ మొసలి కన్నీరు కారుస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పూలే జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి లక్ష్మణ్ పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతం రావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..ఎస్సీ,ఎస్టీ, బీసీలతో పాటు అగ్రవర్ణ పేదలకు కూడా న్యాయంగా రిజర్వేషన్లను మోడీ సర్కారు కల్పించిందని కొనియాడారు. రాజ్యాంగ పరిరక్షణ, ఓబీసీ రిజర్వేషన్ల పేరుతో కులగణన అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇంటి, హైకమాండ్ పోరు తట్టుకోలేక విధిలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టారన్నారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ల కోసం బీసీల వాటాను 51 శాతం నుంచి 46 శాతానికి కాంగ్రెస్ సర్కారు గతంలో కుదించిందనీ, ఇప్పుడు అదే ప్రభుత్వం 42 శాతానికి కుదించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేసేందుకు ఆర్టికల్ 243(డి)ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నప్పటికీ తొమ్మిదో షెడ్యూల్‌ను తీసుకొచ్చి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర మంత్రిమండలిలో మొదటిసారిగా 27 మంది ఓబీసీలకు మంత్రి పదవులు ఇచ్చి, కేంద్ర విద్యాసంస్థల్లోనూ, నీట్‌లోనూ 27 శాతం రిజర్వేషన్లను మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నదని వివరించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ మంత్రులు ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే పోరాటం చేస్తామన్నారు.

పూలే బాట నేటికీ అనుసరణీయం

- బీసీ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి బడుగు సైదులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

మహాత్మా జ్యోతి బా పూలే చూపిన బాట నేటికీ అనుసరణీయమని బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో జ్యోతిరావు బా పూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ప్రగతి సాధ్యమని పూలే భావించారనీ, అందుకే బడుగు, బలహీన వర్గాల విద్యకు ఆయన ఎంతో ప్రాధ్యానత ఇచ్చారని తెలిపారు.

కార్యక్రమంలో బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ జాయింట్ సెక్రటరీ జి. తిరుపతి, డిప్యూటీ సెక్రటరీ చక్రవర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజేంద్రనగర్ బాలికల గురుకుల పాఠశాలలోనూ నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఫూలే ఆశయం ఆదర్శం

- ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఫూలే ఆశయం ఆదర్శమని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే 198వ జయంతి వేడుకలు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో బీసీ జన సమితి అధ్యక్షులు జస్వంత్ కుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కోదండరాం ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, "అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి ఫూలే. విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని గ్రహించి, తన సతీమణికి విద్యాభ్యాసం కల్పించి మొట్టమొదటి మహిళా టీచర్‌గా నిలబెట్టి, సమాజానికి మార్గం చూపారు," అని కొనియాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం టీజేఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందనీ, దాని అమలు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం. నరసయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గోపగాని శంకర్రావు, పల్లె వినయ్, రమేష్ ముదిరాజ్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, మహిళా జన సమితి నాయకురాలు పుష్పలీల, జన సమితి నాయకులు రమేష్, సురేష్, ఇస్మాయిల్, లక్ష్మణ్, మాణిక్యం, జహురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికోత్పత్తి ఢమాల్

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రజల ఆదాయాలు సన్నగిల్లడంతో డిమాండ్ దెబ్బతింటోంది. ఫలితంగా పారిశ్రామికోత్పత్తి పడిపోతోంది. ముఖ్యంగా తయారీ, విద్యుత్, మైనింగ్ రంగాలు పడకేయడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి 2.9 శాతానికి పతనమయ్యింది. ఇది ఏడు నెలల కనిష్ట స్థాయి కావడం ఆందోళనకరం. 2024 ఫిబ్రవరి నెలలో ఐఐపి వృద్ధి 5.6 శాతంగా నమోదైంది. శుక్రవారం కేంద్ర గణంకాల శాఖ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన అధికారిక గణంకాల ప్రకారం.. ఇంతక్రితం 2024 ఆగస్టులో ఐఐపీ అత్యల్పంగా సున్నా శాతంగా నమోదయ్యింది. ఆ తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలోనే అత్యధికంగా పడిపోయింది. ఇందుకు తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పనితీరు అత్యంత పేలవంగా ఉండటమే ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ గణంకాలు స్పష్టం చేస్తోన్నాయి. ఎన్ఎస్ఓ రిపోర్ట్ ప్రకారం.. 2025 ఫిబ్రవరిలో తయారీ రంగం ఉత్పత్తి వృద్ధి ఏకంగా 2.9 శాతానికి మందగించింది. గతేడాది ఇదే నెలలో 4.9 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఇదే నెలలో గనుల రంగం ఉత్పత్తి 8.1 శాతంగా చోటు చేసుకోగా.. గడిచిన ఫిబ్రవరిలో ఏకంగా 1.6 శాతానికి క్షీణించింది. విద్యుత్ ఉత్పత్తి 3.6 శాతానికి తగ్గిపోయింది. 2024 ఫిబ్రవరిలో విద్యుత్ రంగం 7.6 శాతం వృద్ధిని కనబర్చింది. 2025 ఫిబ్రవరిలో మిషనరీ, వాహనాలు, ఫ్యాక్టరీ, ముడి సరుకులు తదితర మూలధన వస్తువుల విభాగం వృద్ధి మాత్రం 8.2 శాతానికి పెరిగింది. ఇది ఇంతక్రితం ఏడాది ఇదే నెలలో 1.7 శాతంగా ఉంది.

గడిచిన నెలలో కాస్మోటిక్స్, ఆహారం, పానియాలు, ఇంధనం, వస్త్రాలు, పాదరక్షలు తదితర కన్స్యూమర్ నాన్ డ్యూరెబుల్ గూడ్స్ ఉత్పత్తి 2.1 శాతానికి పడిపోయింది. ఇలాంటి సాధారణ అవసరాలకు ఉపయోగించే వస్తువులను కూడా ప్రజలు కొనలేని స్థితికి తగ్గిపోతున్నారని స్పష్టం అవుతోంది. 2024 ఇదే నెలలో కన్స్యూమర్ నాన్ డ్యూరెబుల్స్ ఉత్పత్తి వృద్ధి 3.2 శాతంగా ఉంది. ఇదే నెలలో మౌలిక వసతులు, నిర్మాణ రంగం ఉత్పత్తుల వృద్ధి 8.3 శాతంగా ఉండగా.. 2025 ఫిబ్రవరిలో 6.6 శాతానికి పడిపోయింది.

గడిచిన ఫిబ్రవరిలో ముడి చమురు, బొగ్గు, ఇనుము, వ్యవసాయ ఉత్పత్తులు తదితర వాటికి సంబంధించిన ప్రాథమిక వస్తువుల ఉత్పత్తి వృద్ధి 2.8 శాతానికి పడిపోయింది. ఇది అంతకుముందు ఏడాది ఫిబ్రవరిలో 5.9 శాతంగా నమోదయ్యింది. ఇదే సమయంలో కలప, స్టీల్, గ్లాస్, విలువైన లోహాలతో చేసిన తుది వస్తువులకు సంబంధించిన ఇంటర్మీడియట్ గూడ్స్ ఉత్పత్తి వృద్ధి 1.5 శాతానికి పడిపోయింది. ఈ విభాగం 2024 ఇదే నెలలో 8.6 శాతం పెరుగుదలను సాధించింది. స్థూలంగా గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో ఐఐపీ వృద్ధి 4.1 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం 2023-24 అదే 11 మాసాల కాలంలో 6 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి గీటురాయిగా భావించే పారిశ్రామికోత్పత్తి సూచీ పడిపోవడం.. మరోవైపు అమెరికా వాణిజ్య యుద్ధం ప్రతికూల పరిణామాలు ఉపాధి, ఆదాయాలను దెబ్బతీయనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బెదిరిస్తే బెదరం

(మొదటిపేజీ తరువాయి)

కూడా అదే స్థాయిలో స్పందిస్తోంది. తాజాగా చైనాపై యూఎస్ సుంకాలను 145 శాతానికి చేర్చగా.. చైనా సైతం ఏమాత్రం తగ్గకుండా అమెరికాపై టారిఫ్‌లను 125 శాతానికి చేర్చింది. డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు చైనా ఏమాత్రం బెదరడం లేదు. యూఎస్ చర్యలకు ప్రతి సవాళ్లను విసురుతోంది. గతంలో అమెరికా దిగుమతులపై సుంకాలను 84 శాతానికి పెంచగా.. తాజాగా దీన్ని 125 శాతానికి చేర్చింది. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల ట్రంప్ పలు దపాలుగా సుంకాలను క్రమంగా పెంచుతూ 145 శాతానికి చేర్చారు. మొత్తానికి ఈ పరస్పర సుంకాలతో ఇరు దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమైంది.

యూరప్ కలిసి రావాలి : జిన్‌పింగ్

అమెరికాపై చర్యలపై ఇటీవలే భారత్‌కు స్నేహహస్తం అందించిన చైనా.. తాజాగా యూరప్ దేశాలు తమతో కలిసి రావాలిన కోరింది. అమెరికా టారిఫ్ విధానలపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందిస్తూ.. తమపై అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా ఉన్నాయని అన్నారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి యూరోపియన్ యూనియన్ తమతో కలిసిరావాలని కోరారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ.. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చన్నారు.

తుది వరకు పోరాటం

అమెరికా సుంకాల యుద్ధమే చేయాలని భావిస్తే తాము తుది వరకు పోరాడతామని చైనా స్పష్టం చేసింది. అమెరికా చర్చలకు రావాలంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొంది. తాము ఘర్షణకు ప్రయత్నించబోమని, ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కోవడానికైనా వెనుకాడబోమని తెలిపింది. 'చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంది. కవ్వింపు చర్యలకు భయపడం. అమెరికా మాట్లాడాలనుకుంటే.. మా తలుపులు తెరిచే ఉంటాయి. కానీ పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా చర్చలు జరగాలి. చైనాతో ఒప్పందం చేసుకోవాలంటే ఒత్తిడి, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటివి పనిచేయవు' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి హి యోంగ్కియాన్ అన్నారు.

మే 20న జాతీయ సమ్మెలో పాల్గొందాం

లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే...

జూన్ 21, 22 తేదీల్లో ఖమ్మంలో రాష్ట్ర మహాసభలు

ఈనెల 13వరకు సంఘీభావ నిధి వసూలు

టీజీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ విస్తృతస్థాయి సమావేశం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు భాగస్వాములు కావాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) పిలుపునిచ్చింది. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన గురువారం నాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. దేశంలో కార్మికవర్గ త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌ల రూపంలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదనీ, దీన్ని యావత్ కార్మిక లోకం తిప్పికొట్టాలని సమావేశం తీర్మానం చేసింది. దీనికోసం మే 3వ తేదీలోపు సమ్మెనోటీసు ఇవ్వాలని నిర్ణయించారు. ఆర్టీసీలోని ఇతర సంఘాలను కూడా సంప్రదించి, ఐక్యంగా సమ్మెలో పాల్గొనేలా చూడాలని మరో తీర్మానం చేశారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో ఆర్టీసీకి రూ.759 కోట్లు లాభం వచ్చిందని ప్రభుత్వం అసెంబ్లీలో గొప్పగా ప్రకటించిందనీ, అలాంటప్పుడు కార్మికులకు ఇప్పటి వరకు జీతాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వాలనీ, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను తక్షణం చెల్లించాలని పేర్కొంటూ మరో తీర్మానం చేశారు. ఏప్రిల్ 11 నుంచి 13వ తేదీ వరకు ఆర్టీసీ కార్మికుల నుంచి "సామాజిక సంఘీభావ నిధి" వసూలు చేయాలనీ, ఏప్రిల్ 14న అన్ని యూనిట్లలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే ఫెడరేషన్ 4వ రాష్ట్ర మహాసభను జూన్ 21, 22 తేదీల్లో ఖమ్మం రీజియన్‌లో జరపాలనీ, ఏప్రిల్‌లో అన్ని డిపోల మహాసభలు, మే 15వ తేదీలోపు రీజియన్ మహాసభలు జరపాలని నిర్ణయించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఈశ్వర్‌రావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఏవీ రావు, జీఆర్ రెడ్డి, సీహెచ్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

ఎస్ఆర్‌బీఎస్ రద్దు అబద్ధం

ఉద్యోగులను రెచ్చగొట్టేందుకే

కొందరు నేతల అసత్య ప్రచారం

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం...

టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తరపున

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ప్రకటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యూనియన్ల పేరుతో కొందరు నాయకులు చేస్తున్న దుష్ప్రచారం, అసత్య ఆరోపణలను విశ్వసించవద్దని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన ఎస్‌ఆర్‌బీఎస్‌ను రద్దు చేస్తున్నారనే ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ సంస్థ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ పేరుతో శుక్రవారంనాడొక సుదీర్ఘ పత్రికా ప్రకటన విడుదల చేశారు. యూనియన్ల పేరుతో కొందరు తమ మనుగడ కోసం ఇష్టారీతిన మాట్లాడుతూ, ప్రకటనలు జారీ చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తున్నారని తెలిపారు. తాజాగా ఎస్‌ఆర్‌బీఎస్‌ను సంస్థ రద్దు చేస్తోందంటూ ఉద్యోగులను తప్పుదారి పట్టించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారనీ, సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. యూనియన్ లీడర్లమంటూ కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని, పుకార్లని నమ్మి ఆందోళనకు గురికావొద్దని ఉద్యోగులకు యాజమాన్యం విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీకి ఉద్యోగులే వెన్నుముక అనీ, వారి నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ వల్లే మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో యాజమాన్యం ఏమాత్రం రాజీపడట్లేదని స్పష్టం చేశారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని 21 శాతం ఫిట్‌మెంట్‌తో 2024 మే నెలలో అందించామనీ, పెండింగ్‌లో ఉన్న 11 డీఏలను 2019 నుంచి దశలవారీగా ఉద్యోగులకు విడుదల చేశామని వివరించారు. ఆర్పీఎస్-2013 బాండ్లకు సంబంధించి రూ.280 కోట్లను ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాల్లో సంస్థ జమచేసిందని తెలిపారు. ప్రమాదవశాత్తు అకాల మరణం చెందిన, శాశ్వతంగా దివ్యాంగులైన సిబ్బందికి రూ.1.20 కోట్ల ప్రమాద బీమాను సంస్థ అందిస్తున్నదని పేర్కొన్నారు. గత మూడున్నరేండ్లలో ప్రావిడెంట్ ఫండ్‌కు రూ.2,348.35 కోట్లు, సీసీఎస్‌కు రూ.1,300.73 కోట్లను యాజమాన్యం చెల్లించిందని తెలిపారు. 2021-22 నాటికి పీఎఫ్ బకాయిలు రూ.1,352.82 కోట్లు ఉన్నాయనీ, వాటితో పాటు రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమం తప్పకుండా చెల్లిస్తూ ప్రస్తుతం బకాయిలను రూ.580.37 కోట్లకు తగ్గించామని వివరించారు.



సీసీఎస్ బకాయిలు 2021-22 నాటికి రూ.887.48 కోట్లు ఉండగా, రికవరీ మొత్తాలను ప్రతి నెల క్రమం తప్పకుండా చెల్లిస్తూ, బకాయిలను రూ.451.09 కోట్లకు తగ్గించినట్టు తెలిపారు. సంస్థలో పీఎఫ్, సీసీఎస్ బకాయిలు 2012 నుంచే ఉన్నాయనీ, ఆ సొమ్మును ఇప్పుడే యాజమాన్యం వినియోగించుకున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. పెండింగ్ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి యాజమాన్యం తీసుకెళ్లిందనీ, వాటి పరిష్కార విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని వివరణ ఇచ్చారు.

2021కి ముందు సంస్థ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండేదనీ, ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ సంస్థకు డిఫాల్ట్ రేటింగ్ ఇవ్వడంతో ఏ బ్యాంక్ కూడా రుణాలిచ్చేందుకు ముందుకు రాలేదని తెలిపారు. ఉద్యోగుల సహకారంతో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచి డిఫాల్ట్ నుంచి దీదీం రేటింగ్‌కు తీసుకువచ్చామని వివరించారు. దీనితో బ్యాంకుల ఉన్నతాధికారులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారనీ, ఆ సొమ్ముతోనే మూడేండ్లలో మూడువేల కొత్త బస్సులను సంస్థ సమకూర్చుకున్నదని తెలిపారు. కొత్త బస్సులకు అనుగుణంగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు 3038 పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చిందనీ, వాటి నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని పేర్కొన్నారు. పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కూడా కొందరు ఉద్దేశ్యపూర్వకంగానే డిపోల ప్రయివేటీకరణ అంటూ లేనిపోని అపోహలను ఉద్యోగుల్లో సృష్టిస్తున్నారని ఆక్షేపించారు. ఎలక్ట్రిక్ బస్సులతో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు.

ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనీ, ఆర్థిక సంవత్సర ముగింపు కారణంగా బ్యాంక్ రుణాల సర్దుబాటు నేపథ్యంలో మార్చి నెల వేతనాల్లో కొంత జాప్యం జరిగిందని వివరణ ఇచ్చారు. మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన 2,511 మంది ఉద్యోగుల పిల్లలు, జీవిత భాగస్వాములకు కారుణ్య నియమాకాల ద్వారా ఉద్యోగాలను సంస్థ కల్పించిందని తెలిపారు. సిబ్బంది, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నామనీ, హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దామన్నారు. దానితో పాటే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని 15 డిస్పెన్సరీలను విస్తరించమనీ,కొత్తగా నాగర్‌కర్నూల్, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లా కేంద్రాల్లో డిస్పెన్సరీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉద్యోగులకు అందించే మెడిసిన్‌కు ఏటా సగటును రూ.15 కోట్లను సంస్థ ఖర్చు చేస్తున్నదనీ, రిఫరల్ ఆస్పత్రులకు రూ.22 కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు యాజమాన్యం ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. గతంలో రోడ్డు ప్రమాద కేసుల్లో కారణాలతో నిమిత్తం లేకుండా డ్రైవర్లు ఉద్యోగాలు కోల్పోయేవారనీ, మూడేండ్లుగా అలాంటి పరిస్థితి లేదని వివరణ ఇచ్చారు.

సంస్థలో ఉద్యోగుల సంక్షేమాన్ని యాజమాన్యం విస్మరిస్తున్నదని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. మూడున్నరేండ్లలో ఎలాంటి సంక్షేమ సంస్కరణలను తెచ్చామో ఉద్యోగులకు తెలుసుననీ, కానీ యూనియన్ లీడర్లు అవేం పట్టించుకోకుండా రోజుకో ప్రకటన జారీ చేస్తూ తప్పుదారి పట్టించేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సుదీర్ఘకాలం సంస్థపై ఆధారపడి జీవించి, ఉద్యోగ విరమణ చేశాక, బయటకు వెళ్లి టీజీఎస్‌ఆర్టీసీ ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. కేవలం కొందరు వ్యక్తులు తమ మనుగడ కోసం ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్న ఆరోపణలను నమ్మి ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని యాజమాన్యం తమ ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. ఎస్‌ఆర్‌బీఎస్ మూసివేత అంశం ప్రతిపాదనే యాజమాన్యం చేయలేదనీ, ఉద్యోగులను రెచ్చగొట్టేందుకే కొందరు ఈ అంశాన్ని ఇప్పుడు తెరపైకి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు లబ్ది చేకూర్చే అన్ని అవకాశాలను సంస్థ పరిశీలిస్తున్నదని ఆ ప్రకటనలో వెల్లడించారు.

మూడున్నరేండ్లుగా కొందరు యూనియన్ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అనేకసార్లు ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారనీ, వాటిని ఉద్యోగులు తిప్పికొడుతూ ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి మద్దతు తెలుపుతున్నారని అభిప్రాయపడ్డారు.

14 నుంచి భూ భారతి



విలేకర్ల సమావేశంలో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ - మణుగూరు, నవతెలంగాణ బ్యూరో

భూ భారతిని ఈనెల 14న ప్రారంభిస్తామని, దొరల ప్రభుత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే భవనంగా మార్చామని రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రూ.20 కోట్లతో పినపాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని, పులుసు బొంత ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం రూ.1.57 కోట్ల ఎకరాల భూమిని తాకట్టు పెట్టారని అన్నారు. ధరణి కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దాన్ని బంగాళాఖాతంలో పడేసి అనేక సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా శిల్పారామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రభుత్వ అధికారులతో భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. 2025 భూ భారత చట్టం.. పేదరైతు నుంచి ఆసా ముల వరకు అందరికీ ఆమోదయోగ్యం గా ఉంటుందన్నారు. గత ఐదేండ్లలో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొ న్నారని తెలిపారు. అప్పుల భారంతో కూరుకుపోయిన రాష్ట్రా న్ని ప్రతి సమస్య పరిష్కరించుకుంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే పులుసు బొంత ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూనవరం గ్రామ పంచా యతీలోని వంక ముఖేందర్ గృహంలో సన్న బియ్యం భోజనం చేశారు. మండ లంలో పర్యటించి పలు అభివృద్ధి పను లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్ర మంలో మహబూబా బాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

పోర్టల్‌ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఈ నెల 14న తెలంగాణ భూ భారతి(రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్స్) యాక్ట్, 2025ను ఆవిష్కరిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి రోజున రైతులకు మేలైన సేవలందించేందుకు ఈ కొత్త చట్టాన్ని అందుబాటులోకి తేనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) మెంబర్ కమిషనర్ నవీన్ మిట్టల్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు.





విద్యార్థుల సస్పెన్షన్ రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్ష

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ముగ్గురు విద్యార్థులపై సస్పెన్షన్ రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ యూనివర్శిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. విద్యార్థి సంఘ నాయకురాలు శరణ్య, ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శి షెఫాలి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సస్పెండ్ అయిన నాడియా, అనన్, హర్ష్ వంటి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందని వారు తెలిపారు. ఇది దళిత, ముస్లిం విద్యార్థులపై తీసుకున్న చర్య అని విమర్శించారు. బాధిత విద్యార్థులు ఈ విషయాన్ని ఢిల్లీ హైకోర్టుకు తీసుకెళ్లారన్నారు. కానీ విశ్వవిద్యాలయం విచారణను రెండుసార్లు ఆలస్యం చేసి ముగ్గురు విద్యార్థుల భవిష్యత్‌ను పణంగా పెట్టిందని ఎస్ఎఫ్ఐ నేతలు విమర్శించారు.

విరమణ ఉద్యోగానికే.. ప్రజా ఉద్యమానికి కాదు



- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య
- ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో కే.రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ సభ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజా ఉద్యమంలోనే కొనసాగాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య అన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిలో ఆఫీస్ సూపరిండెంట్‌గా పని చేస్తూ రిటైర్ అయిన, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డి అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1988లో హైదరాబాద్ కేంద్రానికి వచ్చినప్పుడు మెహిదీపట్నం డిపోలోని సీనియర్స్‌తో పాటు రవీందర్‌రెడ్డి పరిచయం అయ్యారని, ఆయనతో 36 ఏండ్ల అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. పాలకుల విధానాలు ప్రజల్ని, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న తరుణంలో రవీందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేస్తున్నారనీ, భవిష్యత్‌లో మరింత విస్తృతంగా ప్రజా ఉద్యమంలో ఉండాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అభినందనలు తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్, సీఐటీయూ కార్యాలయాల నుంచి రవీందర్‌రెడ్డి కార్మికోద్యమంలో పనిచేయాలని, దానికి ఆయన సతీమణి, కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ఆంధ్రప్రదేశ్ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎమ్ అయ్యపురెడ్డి, మాజీ ఉప ప్రధాన కార్యదర్శి పిఎస్ మూర్తి, మాజీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ప్రభుత్వంలో డిప్యూటీ డైరెక్టర్ టీవీ రావు, మహిళా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ జే పద్మావతితో పాటు ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, కరీంనగర్, గ్రేటర్ హైదరాబాద్ రీజియన్ల నుంచి ప్రతినిధులు రవీందర్‌రెడ్డిని అభినందిస్తూ మాట్లాడారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యం, మల్లయ్య, మోహన్ రెడ్డి, బీజేఎమ్ రెడ్డి, దానయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీ రవీందర్ రెడ్డి, పద్మజ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆర్టీసీతో పాటు కార్మికవర్గం పోరాటాల్లో భాగస్వామిని అవుతానని తెలిపారు. అంతకుముందు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బీ సుధాకర్ స్వాగతోపన్యాసం చేశారు. ఉపాధ్యక్షులు ఏవీ రావు వందన సమర్పణ చేశారు.

జమ్ముకాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

ఉగ్రవాది మృతి

శ్రీనగర్ : చీనాబ్‌లోయలోని కిష్త్వార్‌జిల్లాలో గుర్తుతెలియని ఉగ్రవాది మరణించినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ మూడవ రోజుకి చేరుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఒక ఉగ్రవాది మరణించారని, ప్రతికూల భూభాగం, వాతావరణం ఉన్నప్పటికీ భద్రతాదళాలు ఆపరేషన్ చేపడుతున్నారని లోయ ఇన్‌చార్జ్, ఆర్మీ వైట్ కార్ప్స్ ప్రతినిధి తెలిపారు. ఏప్రిల్ 9న కిష్త్వార్‌లోని ఛత్రు ఎగువ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో పోలీసులతో కలిసి సంయుక్తంగా గాలిస్తుండగా, కాల్పులు ప్రారంభమయ్యాయని అన్నారు. జమ్ములోని ఉధంపూర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగిందని సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఏడాది జమ్మూలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయని అన్నారు. మార్చిలో ఎన్‌కౌంటర్‌లో నలుగురు పోలీసులు, ఇద్దరు ఉగ్రవాదులు మరణించారని అన్నారు.

కేసీఆర్ భూదోపిడీపై విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

అక్కసుతోనే కేటీఆర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏ ప్రభుత్వమైనా ఒక సంస్థ ద్వారానే రుణాలు సేకరిస్తున్నదన్నారు. కోకాపేటలో వేల ఎకరాలను రూ.100 కోట్లకు ఎకరం చొప్పున అమ్ముకోలేదా? అని ప్రశ్నించారు. టీజీఐఐసీ ద్వారా తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలతో రైతులకు రుణమాఫీ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరా లను అమ్ముకున్నప్పుడు పర్యావరణం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. పదేండ్లలో లక్ష ఎకరాలను డీఫారెస్ట్ చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. 400 ఎకరాల భూముల్లో కంపెనీలు నిర్మిస్తే, రాష్ట్ర ప్రజలకు లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని విమర్శించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనన్నారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారనీ, ఆ మాటలను నమ్మొద్దంటూ ప్రజలను కోరారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడీ చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సగంసగం తెలు సుకుని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లా డుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కులగణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందని చెప్పారు. రైతులు బాగుపడు తుంటే కేటీఆర్ కి కడుపునొప్పి వస్తోందని ఎద్దేవాచేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు రాకూడదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ దోపిడీని భరించలేకనే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు.

ఇంటర్‌నెట్‌తో భారత ఈవీఎంలను అనుసంధానించలేం

తులసి గబ్బార్డ్ వ్యాఖ్యలపై స్పందించిన ఈసీ

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు హ్యాక్ చేయడానికి అనువుగా వుంటాయని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ శుక్రవారం దానిపై స్పందించింది. సులభంగా, సక్రమంగా, కచ్చితమైన కాలిక్యులేటర్ల మాదిరిగా పనిచేసే ఈవీఎంలను భారత్ ఉపయోగిస్తోందని, వాటిని ఇంటర్‌నెట్‌కు, వైఫైకు లేదా ఇన్‌ఫ్రారెడ్‌కు అనుసంధానించలేమని స్పష్టం చేసింది. కొన్ని దేశాలు ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థలు అనేక వ్యవస్థల మిళితంగా వుంటాయని ఈసీ వర్గాలు తెలిపాయి. ఇంటర్‌నెట్ వంటి వివిధ ప్రయివేటు నెట్‌వర్క్‌లతో సహా పలు యంత్రాలు, ప్రాసెస్‌ల సమాహారంగా అవి వుంటాయన్నారు. భారత్‌లో ఈ ఈవీఎంలు సుప్రీంకోర్టు నిర్వహించిన న్యాయబద్ధమైన పరిశీలనకు నిలబడ్డాయన్నారు. పోలింగ్ ప్రారంభం కావడానికి ముందుగా నమూనా ఎన్నికల నిర్వహణకు ఉపయోగించడంతో సహా వివిధ దశల్లో రాజకీయ పార్టీలు కూడా వీటిని తనిఖీ చేశాయని ఆ వర్గాలు తెలిపాయి. ఐదు కోట్లకు పైగా కాగితపు బ్యాలెట్లతో పరిశీలించి, పోల్చి నిర్ధారించామని, ఇదంతా కూడా రాజకీయ పార్టీల సమక్షంలోనే జరిగిందని ఈసీ వర్గాలు తెలిపాయి.





దీర్ఘకాలంగా ఈ ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థలు ఎలా హ్యాకింగ్‌కు అనువుగా వున్నాయో తెలియచేసే సాక్ష్యాధారాలు అమెరికా క్యాబినెట్‌కు దొరికాయని తులసి గబ్బార్డ్ గురువారం తెలిపారు. ఓట్లు వేసినపుడు ఫలితాలను మార్చివేసేందుకు వీటితో అవకాశం వుంటుందని అన్నారు. ఈ నిర్ధారణలతోనే దేశవ్యాప్తంగా కాగితపు బ్యాలెట్లు ఉపయోగించాలని ఆదేశాలు జారీ అయ్యాయని చెప్పారు. తద్వారా అమెరికా ఎన్నికల సమగ్రత పట్ల ప్రజలకు నమ్మకం వుంటుందన్నారు.

మానవులు లేదా కృత్రిమ మేథ ఈ యంత్రాలను హ్యాక్ చేసేందుకు ముప్పు పొంచి వుందంటూ గతేడాది ఎలన్ మస్క్ హెచ్చరిస్తూ, ఈవీఎంలను తొలగించాలని కోరారు.

బాలోత్సవం సమ్మర్ క్యాంప్ వచ్చేసిందోచ్

మే 5 నుంచి 22 వరకు ఎస్వీకేలో నిర్వహణ

- విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక విభాగాల్లో ఉచితంగా శిక్షణ
- క్లాసులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- దరఖాస్తులకు తుది గడువు మే ఒకటో తేదీ
- వివరాలు వెల్లడించిన బాలోత్సవం నిర్వాహకులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆటా, పాటా, సాంస్కృతిక, వైజ్ఞానిక దృక్పథం ద్వారా పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించే తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ వచ్చేసింది. వచ్చే నెల ఐదో తేదీ నుంచి 22 వరకు జరుగనున్నది. శుక్రవారం ఎస్వీకేలో జరిగిన విలేకర్ల సమావేశంలో పిల్లలకు ఏయే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారనే అంశాలపైనా, విధివిధానాలపైనా వివరాలను తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్. సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, సంయుక్త కార్యదర్శి రూపారుక్మిణి, కమిటీ సభ్యులు బ్రహ్మణి వెల్లడించారు. సమ్మర్ క్యాంపు ద్వారా పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిస్తామనీ, విజ్ఞానం, వినోదం, వైజ్ఞానిక దృక్పథం ద్వారా పిల్లల్లో యూనిటీ పెంచడం వంటివాటిపై దృష్టి సారిస్తామని చెప్పారు. చిన్నచిన్న పదాల ద్వారా ఇంగ్లీష్, తెలుగు భాషల్లో పిల్లలు అనర్గళంగా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తామన్నారు. సెల్‌ఫోన్‌లలో రీల్స్, గేమ్స్‌కు అలవాటు పడటంతో పిల్లలు మానసిక రుగ్మతలకు గురికావడం తీవ్రమవుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీని ద్వారా పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతింటున్నదనీ, పిల్లల మానసిక ఎదుగుదలపైనా ప్రభావం చూపి దురలవాట్ల వైపు మరలుతున్నారని వాపోయారు. ఎదిగే పిల్లలు ఇలా తయారవ్వటం సమాజాభివృద్ధికి శ్రేయస్కరం కాదన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జంక్‌ఫుడ్, బయటి పదార్థాలు తినడం, నిరంతరాయంగా సెల్‌ఫోన్ చూడటం వల్ల జరిగే అనర్థాల గురించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో చెప్పి ఆ అలవాట్లను పిల్లలతో వీలైనంత మేరకు మాన్పించి వారు ఆరోగ్యంగా ఉండేలా చూడటం కూడా శిక్షణలో భాగమని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా సమ్మర్ క్యాంపులు పెట్టి నెలకు ఐదారు వేల రూపాయలు వసూలు చేయడం, పిల్లలను భట్టీ చదువులకు పరిమితం చేయడం తమ విధానం కాదని స్పష్టం చేశారు. పిల్లల్లో సాంస్కృతిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథాలను పెంపొందించడం తమ సమ్మర్ క్యాంపు ఉద్దేశమని నొక్కి చెప్పారు. తాము ఫీజు వసూలు చేయబోవట్లేదన్నారు. మూడేండ్ల నుంచి ఉచితంగా నిర్వహించిన సమ్మర్ క్యాంపుల ద్వారా తమ పిల్లల ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చిందని తల్లిదండ్రులు వచ్చి చెప్పడం, అభినందించడం తమకు సంతోషం కలిగిస్తున్నదన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.

ఆక్టివిటీస్ : డ్రాయింగ్, క్లాసికల్ డ్యాన్స్, క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్, వైజ్ఞానిక అవగాహన క్లాసులు

అర్హులు : మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు

దరఖాస్తు తుదిగడువు : మే 1

రిజిస్ట్రేషన్ ఫీజు : రూ.100

క్లాసులు : మే 5 వతేదీన ప్రారంభం...మే 22న ముగింపు సభ

సమయం : ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ప్లేస్ : సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు : 94900 94676, 94900 98343

మెయిల్ ఐడీ : telanganabalotsav@gmail.com



రైతులు అధైర్యపడొద్దు

- సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం
- పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందజేస్తాం : మంత్రులు తుమ్మల, పొన్నం, శ్రీధర్‌బాబు
- సిద్దిపేట జిల్లా చిన్న కోడూరులో నష్టపోయిన పంటల పరిశీలన

నవతెలంగాణ-చిన్నకోడూరు

పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, నష్టపోయిన పంట వివరాలను సేకరించి ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలో గురువారం ఉదయం కురిసిన వడగండ్ల వానలకు నష్టపోయిన పంటలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, వ్యవసాయ అధికారులతో కలిసి మంత్రులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తం గా 24వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని, అందులో సిద్దిపేట డివిజన్‌లో పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగిందని అన్నారు. రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ప్రతి రైతును ఆదుకుంటామని భరోసా కల్పించారు. వ్యవసాయ అధికారులు రైతుల వెంటే ఉండి నష్టపోయిన వరి, మిర్చి, మామిడి పంటల వివరాలను సేకరించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. అధికారులు సర్వే నివేదికను అందించిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందించేలా చర్యలు చేపడుతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల, బడుగు బలహీన వర్గాలకు, రైతులకు సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ రాధిక, ఏడీఏ పద్మ, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ప్రతిఘటిద్దాం


- ఏఐకేఎస్ ఆవిర్భావ సభలో బి.వెంకట్, సాగర్ పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలను ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా జెండాలు ఎగురవేయాలనే పిలుపులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోపిడీ, వలస, భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న పోరాటాల నేపథ్యంలో 1936 ఏప్రిల్ 11న లక్నోలో ఏఐకేఎస్ ఆవిర్భవించిందని తెలిపారు. భూమి హక్కు కోసం, వలస బానిసత్వం నుంచి విముక్తి కోసం ఎన్నో ఐక్య ఉద్యమాలను నడిపిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, పున్నప్ర-వాయిలర్, వర్లీ ఆదివాసుల పోరాటం, సర్మావ్యాలీ, తెభాగ, గణముక్తి పోరాటాలకు నాయకత్వం వహించిందని తెలిపారు. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, భూమిలేని పేదలు, గ్రామీణ కార్మిక వర్గానికి భూమి, జీవనోపాధి, ప్రాథమిక మానవ హక్కుల సాధన కోసం రైతాంగాన్ని సమీకరించిందని గుర్తు చేశారు. 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 1,46,88,354 సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద రైతు సంఘంగా ఆవిర్భవించిందని తెలిపారు. బడా పెట్టుబడిదారీ,భూస్వామ్య బంధం ఆధిపత్యం చెలాయించే ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ఏఐకేఎస్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధరల చట్టం, కనీస వేతనం, ఉపాధి, రుణాల నుంచి రైతు విముక్తి కోసం ఉద్యమాలు నిర్వహిస్తోందని చెప్పారు. 'ప్రత్యామ్నాయం కోసం పోరాడుదాం..సంఘటితంగా ముందుకు సాగుదాం' అనే నినాదాలతో మహిళా రైతులు, యువ రైతుల రైతాంగ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

'డంపింగ్ యార్డుకు' ధారావి నివాసితులు



(మొదటిపేజీ తరువాయి)

గృహాలు, సౌకర్యాలతో ఆధునిక పట్టణ కేంద్రంగా మార్చటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నది. అక్కడ నివసించేవారికి ఇన్-సిటు, ఎక్స్-సిటు పునరావాసం కల్పించాలని ఇది ప్రతిపాదిస్తుంది. సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్వీఆర్ శ్రీనివాస్ ఈ ప్రాజెక్ట్ సీఈఓగా ఉన్నారు.

ఈ పునరాభివృద్ధి ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రయివేట్ లిమిటెడ్ (డీఆర్‌పీపీఎల్)ను ప్రస్తుతం నవభారత్ మెగా డెవలపర్స్ ప్రయివేట్ లిమిటెడ్ (ఎన్ఎండీపీఎల్) అని పిలుస్తారు. ఇది ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ). దీనిలో అదానీ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్ (ఏపీపీఎల్) 80 శాతం ఈక్విటీని, రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు చెందిన మురికివాడ పునరావాస అథారిటీ (ఎస్ఆర్ఏ) 20 శాతం వాటాను కలిగి ఉన్నది. ఎన్ఎండీపీఎల్ చైర్మెన్‌గా కూడా శ్రీనివాసే ఉన్నారు. కంపెనీల రిజిస్ట్రార్ వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. ఎన్ఎండీపీఎల్ చెల్లించిన మూలధనం రూ.400 కోట్లు. బీఎంసీ కమిషనర్ భూషణ్ గగ్రాని కూడా ఈ ఎస్పీవీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఎన్ఎండీపీఎల్ బోర్డులో తొమ్మిది మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ బోర్డులో డైరెక్టర్‌గా ఉన్న ప్రణవ్ అదానీ కూడా ఒకరు. మిగిలిన ఎనిమిది మంది కూడా అదానీ గ్రూపులోని వివిధ కంపెనీల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు.

అర్హతలేని లబ్దిదారుల పేరుతో తరలింపు

ధారావి పునరావాస ప్రాజెక్టు నిర్మాణ పనులు ఈ ఏడాది ద్వితీయార్థం నాటికి ప్రారంభమవుతాయని శ్రీనివాస్ చెప్పారు. నివాసితులకు పునరావాసం కల్పించటానికి ఎన్ఎండీపీఎల్ ఏండేండ్ల గడువును కలిగి ఉన్నదని తెలిపారు. ధారావి ప్రాజెక్టు కింద లబ్దిదారులను రెండు వర్గాలుగా విభజించారు. ఇందులో ఒకరిని అర్హులుగా, మరొకరిని అనర్హులుగా వర్గీకరించారు. అర్హులు అంటే.. 2000, జనవరి 1 లేదా అంతకముందు గృహ నిర్మాణాలను కలిగి ఉన్నవారు. దాదాపు 1.5 లక్షల మంది 'అర్హులకు' ధారావిలోనే 'ఇన్ సిటు' పునరావాసం లభిస్తుంది. ఇక అర్హతలేని లబ్దిదారుల్లో దాదాపు 50వేల నుంచి 1 లక్ష మందికి డియోనార్ డంప్ వద్ద 'నామమాత్రపు' ధరలకు అద్దె యూనిట్లు అందుతాయని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలినవారికి ప్రభుత్వం కుర్లా డెయిరీ, వాడాలా, కంజుర్‌మార్గ్, ములుంద్ మధ్య భూమిని కేటాయించింది. గతేడాది సెప్టెంబర్‌లో బీఎంసీ 311 ఎకరాల పెద్ద డియోనార్ ల్యాండ్‌ఫిల్‌లోని 124 ఎకరాలను పునరావాస ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. లబ్దిదారుల సర్వే పూర్తయిన తర్వాత ఈ భూమిని ఎన్ఎండీపీఎల్‌కు అప్పగిస్తామని గృహ నిర్మాణశాఖాధికారులు తెలిపారు. ఎన్ఎండీపీఎల్‌కు కేటాయించిన 124 ఎకరాల భూమిలో ప్రస్తుతం డంప్ వద్ద ఉన్న మొత్తం ఘన వ్యర్థాలలో 40 శాతం (దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నులు) ఉన్నాయి. ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్ట్ కోసం మాకు సుమారు 200-300 ఎకరాల భూమి అవసరం. దీంతో మేము డియోనార్ ప్రాంతాన్ని ఎంచుకున్నాం అని డీఆర్‌పీ సీఈఓ శ్రీనివాస్ అన్నారు.

మద్దతు ధర లేక ధాన్యానికి నిప్పు

కౌలుకు తీసుకున్న ఐదెకరాలు... ఆరునెలల శ్రమ బూడిద

- బస్తాకు రూ.1600 మాత్రమే ధర పలకడంపై ఓ రైతు ఆవేదన
- ధరల విషయంలో ఖరీదు దారులు, కమీషన్ దారుల మాయాజాలం
- మార్కెట్ అధికారుల మౌన సమ్మతితో దోపిడీ
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



నవతెలంగాణ-సూర్యాపేట

కౌలుకు భూములు తీసుకుని ఆరునెలలు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడం లేదనే నిస్సహాయతతో రైతులు ధాన్యానికి నిప్పంటించే స్థితికి చేరుతున్నారు. మార్కెట్‌లో నడిచే కుమ్మక్కు వ్యూహాలు, కమీషన్ దారులు, ఖరీదు దారులు, మార్కెట్ అధికారులు చేతులు కలిపి ధాన్యానికి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఈ వైనం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన రైతు బత్తుల లింగరాజు ధాన్యానికి తగిన ధర రాకపోవడంతో ధాన్యానికి నిప్పుపెట్టాడు. ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, ఆరు నెలల పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులున్నా, ఖర్చులు లెక్కచేయకుండా ధాన్యం పండించాడు. చివరికి మార్కెట్‌కు 70 బస్తాల ధాన్యాన్ని తీసుకురాగా, మద్దతు ధర రూ.2,320-2,300 ఉండగా ఒక్క బస్తాకు కేవలం రూ.1600 మాత్రమే ధర పలికింది. పెట్టుబడి కూడా రాని స్థితిలో ఆ రైతు ధాన్యానికి నిప్పంటించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ఎంతో కష్టపడి ఐదు ఎకరాలు కౌలుకు చేశానని, ధర ఎక్కువ వస్తుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కి ధాన్యం తీసుకొస్తే ఖరీదు దారులు, కమీషన్ దారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు రోజులుగా అన్నం తినకుండా ధాన్యం రాశి వద్ద పడుకున్నానని బోరున విలపించాడు. కనీసం మద్దతు ధర కూడా రానీ ఈ ధాన్యం తనకు వద్దని నిప్పంటించినట్టు తెలిపాడు. విషయం తెలుసుకున్న మార్కెట్ సిబ్బంది హుటాహుటిన వచ్చి రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని నిప్పంటుకున్న ధాన్యాన్ని ఆర్పారు. ఈ ఘటన వ్యవసాయ వ్యవస్థలో ఉన్న లోపాలను మరోసారి చాటి చెబుతోంది. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ, అది మార్కెట్ స్థాయిలో అమలు కాకపోవడం దారుణం. మధ్యవర్తుల పాత్ర, అధికారుల నిర్లక్ష్యం వల్ల అసలు రైతుకే నష్టం వాటిల్లుతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతుకు గిట్టుబాటు ధర కచ్చితంగా లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కులం జులుంపై గళమెత్తిన మహనీయుడు పూలే

పూలే జయంతి వేడుకల్లో.. టీపీఎస్‌కే గౌరవ అధ్యక్షులు జి.రాములు, అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - ముషీరాబాద్

కులం జులుంపై గళమెత్తిన మహనీయుడు జ్యోతిబా పూలే అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) గౌరవ అధ్యక్షులు జి. రాములు, అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా టీపీఎస్‌కే ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో వారు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం జి.రాములు మాట్లాడుతూ.. కులోన్మాదాన్ని కూకటివేళ్లతో పెకిలించి, కర్మ సిద్ధాంతం కాదు.. బతుకు సిద్ధాంతం కావాలని, తలరాతలు కాదు.. బతుకు రాతలు మారాలని మార్చిన మహనీయుడు పూలే అని అన్నారు. ఆయన జ్ఞానమే నేడు మనకు పునాది అని తెలిపారు. దేశం అనే దేహానికి శూద్రులే ప్రాణం, రక్తనాళాలు అని ప్రకటించిన సామాజిక విప్లవ ప్రవక్త పూలే అని కొనియాడారు. బ్రాహ్మణుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని, రైతులు, ఇతర తక్కువ కులాల హక్కుల కోసం పోరాడారని చెప్పారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాలికల విద్య కోసం పోరాడటమే కాకుండా అభాగ్యులైన పిల్లల కోసం అనాథ ఆశ్రమాన్ని ప్రారంభించిన మొదటి సంస్కర్తగా పూలేను విశ్వసిస్తారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని, అలాంటప్పుడే ఆయనకు ఘనమైన నివాళులర్పించిన వారవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.నరేష్, కవి, రచయిత పొన్నం రాజయ్య, సీహెచ్ ఇందిర, వి.శారద, పి.సందీప్, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

మీకు ప్రాథమిక హక్కులుంటే..

(మొదటిపేజీ తరువాయి)

బదిలీ చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. వ్యక్తుల కోసం ఉద్దేశించిన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌ను మీరెలా దాఖలు చేస్తారంటూ ఈడీని జస్టిస్ అభయ్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన బెంచ్ ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ రాజ్యాంగ పరిష్కారాల హక్కుకు హామీ కల్పిస్తుంది. తమ ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినట్లైతే సుప్రీం కోర్టును పరిష్కారం కోరడానికి వ్యక్తులకు సాధికారత కల్పిస్తోంది. తమ హక్కుల అమలు కోసం నేరుగా సుప్రీంను ఆశ్రయించేందుకు వారిని అనుమతిస్తోంది. సుప్రీం బెంచ్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు అనుమతి కోరారు. ఈడీకి కూడా ప్రాథమిక హక్కులు వున్నాయని వ్యాఖ్యానించారు. ఈడీకి ప్రాథమిక హక్కులు వుంటే అది ప్రజల ప్రాథమిక హక్కులు గురించి కూడా ఆలోచించాలని బెంచ్ వ్యాఖ్యానించింది. ఆ తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి రాజును కోర్టు అనుమతించింది. ఛత్తీస్‌గఢ్‌లోని కేసులో మాజీ ఐఏఎస్ అధికారి అనిల్ తుటేజ తనకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను దుర్వినియోగం చేశారని ఈడీ గతేడాది పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని రాజ్యాంగ శక్తులు హైకోర్టున్యాయమూర్తితో టచ్‌లో వుంటూ మనీ లాండరింగ్ కేసులోని నిందితులకు న్యాయపరమైన ఉపశమన కలిగేలా చూస్తున్నారంటూ ఈడీ ఇటీవల దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. ఈనేపథ్యంలో ఆ కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని కోరింది.

జాబ్‌మేళాలో తోపులాట

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారు. దాంతో నిరుద్యోగులు ఒక్కసారిగా గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగి పలువురు గాయపడ్డారు. అనంతరం మెగా జాబ్‌మేళాను మంత్రులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేళాకు 23,238 మంది నిరుద్యోగులు హాజరు కాగా 5,631 మందికి మంత్రి సురేఖ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు ధనసరి సీతక్క (అనసూయ), కొండా సురేఖ మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని, ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో మరో ఉద్యోగావకాశం కోసం ప్రయత్నించాలని అన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యను పారదోలడానికి ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ జాబ్ మేళాకు ఊహించిన దాని కంటే భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరవడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. జాబ్‌మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సొంత ఊరు దాటితేనే భవిష్యత్ బంగారం అవుతుందన్నారు. ఉద్యోగాలు పొందిన వారు అంకితభావంతో పనిచేయాలన్నారు. కేసీఆర్ 10 ఏండ్ల పాలనలో పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 60 వేల ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ఇలాంటి జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని, అవకాశాలు వస్తే వాటిని వదులు కోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని నానాజీ వాకాడే, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబానీ, ఖుస్రు పాషా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పోరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వాలి : టీఎంఎస్టీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జనవరి నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షులు భూతం యాకమల్లు తెలిపారు. వారికి వెంటనే జీతాలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 194 మోడల్ స్కూళ్లలో సుమారు 776 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు. వారంతా చిన్న ఉద్యోగులనీ, వారికిచ్చే వేతనం అతి తక్కువ అని తెలిపారు. మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ ఖర్చుల కోసం అప్పులు చేస్తున్నామంటూ ఆందోళన చెందుతున్నారని వివరించారు. వారి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రెగ్యులర్ టీచర్స్‌కు రావాల్సిన డీఏ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తునికి పండ్ల తళుకులు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తునికి ఆకే కాదు.. పండ్లు కూడా అడవి బిడ్డలకు ఆసరా అవుతున్నాయి. వేసవి ఉపాధి మార్గంగా.. ఆదాయ వనరులుగా ఆదుకుంటున్నాయి. మండు వేసవిలో ఆకుతో లబ్ధి పొందుతున్న గిరిజనులు.. నెల రోజులుగా ఈ పండ్లూ అమ్ముకొని జీవిస్తున్నారు. అడవిలో చెట్లపై పక్వానికి వచ్చిన కాయలను గడ్డిలో మాగబెట్టి పండ్లయ్యాక తీసుకొచ్చి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. ఒక్కో గిరిజనుడు 20 నుంచి 30 కేజీల పండ్లను అమ్ముతున్నాడు. కొందరు రోడ్ల వెంబడి విక్రయిస్తు న్నారు. కిలో రూ.100 చొప్పున లభిస్తున్నాయి. రసాయనాలు వినియోగించని అత్యంత పోషక విలువలున్న శ్రేష్టమైన తునికి పండ్లను పట్టణవాసులు ఆదరిస్తూ కొంటున్నారు. రోజుకు ఒక్కో ఆదివాసీ గిరిజనుడు పది కేజీలకు పైగా విక్రయించి రూ.వెయ్యికి పైగా ఆదాయం పొందుతున్నాడు.

తునికి పండు ప్రత్యేకతలే వేరు

తునికి పండు విలువ తెలిసినవారు, రుచి చూసినవారు మళ్లీ మళ్లీ తినాలనుకుంటారు. చెప్పుకుంటూ పోతే ఈ పండు ప్రత్యేకతే వేరు. నెలన్నర రోజులు (మార్చి మూడోవారం నుంచి ఏప్రిల్ వరకు) మాత్రమే లభించే ఈ పండ్ల చెట్లను ఎవరూ పెంచరు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడమూ ఉండదు. అడవిలో మాత్రమే లభించే తునికి పండ్లను గిరిజనులు సేకరిస్తారు. అధిక పోషక విలువలు, ఫైబర్ కలిగిన తునికి పండ్లు పూర్తి ప్రకృతి ప్రసాదించిన వరమని, ఈ పండ్లు అమూల్యమని వైద్యులు చెబుతున్నారు. అడవిలో మాత్రమే ఉండే తునికి చెట్లకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయటం ఉండదు. పూర్తి సహజసిద్ధమైనవి. పండు పైభాగంలో గట్టిగా ఉంటుంది. పండిన తరువాత ఈ పైభాగాన్ని తేలికగా తీసేయొచ్చు. లోపల గుజ్జు, గింజలు ఉంటాయి. ఈ గుజ్జు రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

తునికి పండ్లలో పోషకాలు..

తునికి పండ్లు (టెండూ పండ్లు) అడవుల్లో సహజంగా లభిస్తాయి. దీనిలో అనేక పోషక విలువలున్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీనిలో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిం చడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయని చెబుతుం టారు. డయాబెటిస్ ఉన్నవారికి సహాయ పడతాయి. పండ్లలో యాంటీఆక్సి డెంట్లు ఉండటం వల్ల క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇదీ జుట్టుకూ మేలు. జీర్ణక్రియకూ సహాయపడుతుంది. శరీరంలోని హానికరమైన టాక్సిన్లను తొలగించడంలోనూ ఈ పండు తోడ్పడుతుంది.

తునికి పండ్ల సేకరణ కష్టం

అనూష, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ ఆదివాసి గ్రామం. నేను నర్సింగ్ పూర్తి చేశాను. ప్రతి వేసవిలో తునికి పండ్ల సేకరణ చేపడుతాం. ఇది ఎంతో కష్టతరమైన ప్రక్రియ. ఎండలో అడవంతా తిరగాలి. రోజంతా ఎండలో కూర్చుని అమ్మితే రూ.500కు మించి రావడం లేదు.

- అడవి బిడ్డలకు వేసవి ఆదాయ వనరు
- పట్టణాల్లో ప్రకృతి ప్రసాదంగా కొనుగోళ్లు
- రసాయనాలు లేని పోషక విలువల పండు
- కిలో రూ.50 చొప్పున విక్రయం
- ఏడాదిలో నెలన్నర రోజులు మాత్రమే లభ్యం

అటవీ పరిసర పట్టణాల్లో ఎక్కువ విక్రయం

ప్రస్తుతం తునికి పండ్లు రాష్ట్రంలో అటవీ ప్రాంతం ఉన్న అన్ని నగరాల్లోనూ లభిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, చర్ల, కొత్తగూడెం, ఇల్లందు, ఖమ్మం జిల్లాలోని కారేపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రధాన రోడ్డు మార్గాల్లో విరివిగా విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని అటవీప్రాంతాల్లో తునికి పండ్లు లభిస్తున్నాయి. ఈసారి వర్షాలు విస్తారంగా కురవటంతో పంట బాగా వచ్చిందని గిరిజనులు చెప్తున్నారు. కానీ దీన్ని సేకరించడం ఒకింత కష్టతరమేనంటున్నారు. తునికి కాయలను తీసుకొచ్చిన తర్వాత మాగబెట్టేందుకు రెండ్రోజులు పడుతుంది. ఆ తర్వాత బస్సుల్లో తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. రోజంతా అమ్మితే రూ.500 వరకు ఆదాయం లభిస్తుందని చెబుతున్నారు. పురుషులు వీటిని సేకరిస్తే మహిళలు ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో ఎక్కువగా వీటిని విక్రయిస్తున్నారు.



కాంగ్రెస్ ర్యాలీపై విరుచుకుపడిన బీహార్ పోలీసులు

పాట్నా : బీహార్‌లో కాంగ్రెస్ ర్యాలీపై శుక్రవారం పోలీసులు లాఠీలు, వాటర్ కెనాన్‌లతో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేత కన్హయ్య కుమార్ సహ పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరుద్యోగ సమస్యలపై కాంగ్రెస్ ఈ ర్యాలీ చేపట్టింది. 'వలసవాదాన్ని ఆపండి, ఉద్యోగాలు ఇవ్వండి' అని నినాదాలు చేపడుతూ కాంగ్రెస్ బీపీసీసీ ప్రధాన కార్యాలయం సదాకత్ ఆశ్రమం నుంచి మార్చ్ ప్రారంభించింది. రాజాపుల్ కాస్రింగ్ చేరుకోగానే పోలీసులసు వారిపై విరుచుకుపడ్డారు. లాఠీలు, వాటర్ కెనాన్‌లు ప్రయోగించారు. ఈర్యాలీ ప్రారంభానికి ముందు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనటె మాట్లాడారు. బీహార్‌లోని పాలక ఎన్డీఏ ముందుకు కదలని, పొగను మాత్రమే వదిలే డబుల్ ఇంజిన్ సర్కార్ అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్ విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో కొనసాగేందుకు జేడీ(యూ)పై ఆధారపడినప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలు పొందడంలో నితీశ్ కుమార్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

రెండు నెలల విద్యుత్ బిల్లు చెల్లించని బీజేపీ ఎంపీ



సిమ్లా : బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రెండు నెలల విద్యుత్ బకాయిలు చెల్లించలేదని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డ్ (హెచ్‌పీఎస్ఈబీ) స్పష్టం చేసింది. రెండు నెలల విద్యుత్ బకాయిల మొత్తం రూ.90,384 ఉందని తెలిపింది. మేడమ్ బిల్లులు చెల్లించకపోగా, రాష్ట్ర ప్రభుత్వాన్ని దూషించారని రాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి విక్రమాదిత్య సింగ్ మండిపడ్డారు. మనాలిలోని తన ఖాళీ నివాసానికి నెలకు లక్ష రూపాయల విద్యుత్ బిల్లు వచ్చిందని ఇటీవల మండిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ఆరోపించిన సంగతి తెలిసిందే. మేడమ్ విద్యుత్ బిల్లులు కట్టరని, బహిరంగవేదికలపై ప్రభుత్వాన్ని దూషిస్తారని మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు చెందిన బిల్లులు రూ.90,384 అని, వాటిలో గతంలో రూ.32,287 కూడా ఉన్నాయని హెచ్‌పీఎస్ఈబీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మనాలిలోని సిమ్సా గ్రామంలోని కంగనారనౌత్ నివాసంలో ఆమె పేరు మీద 100000838073 నెంబర్ కింద విద్యుత్ కనెక్షన్ ఉందని తెలిపింది. విద్యుత్ కనెక్టెడ్‌లోడ్ 94.82 కేడబ్ల్యూ అని, సాధారణ నివాస సగటు విద్యుత్ లోడ్ కన్నా 1500 శాతం ఎక్కువని పేర్కొంది. అక్టోబర్, డిసెంబర్ వరకు కంగనా బిల్లులను సకాలంలో చెల్లించలేదని ఆ ప్రకటనలో తెలిపింది.

క్లాస్ టీచర్‌కు విద్యార్థుల 'వీడ్కోలు' కానుక

మాదకద్రవ్యాలకు జీవితాంతం దూరంగా ఉంటామని ప్రమాణం

కేరళలో అరుదైన దృశ్యం ; చిన్నారులను ప్రశంసించిన విజయన్

ఇడుక్కి : కేరళలోని ముస్లిం ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎంఇఎస్)కు ఒక క్లాస్ టీచర్‌కు విద్యార్థులు విన్నూతమైన వీడ్కోలు కానుక ఇచ్చారు. తమ జీవితంలో ఎప్పుడూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేసి మాటా ఇచ్చారు. విద్యార్థుల ఇచ్చిన కానుకపై సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సైతం విద్యార్థుల చర్యను ప్రశంసించారు. ఈ సంఘటన పూర్తి వివరాల ప్రకారం కేరళలో ఇడుక్కి జిల్లాలోని వందన్మేడు వద్ద ఉన్న ముస్లిం ఎడ్యుకేషన్ సొసైటీ (ఎంఈఎస్) హయ్యర్ సెకండరీ స్కూల్‌లో సైనాబా బివి టీచర్‌గా పని చేశారు. 9వ తరగతి బి సెక్షన్‌కు క్లాస్‌గా బాధ్యతలు నిర్వహించిన సైనాబా బివి మార్చి 31న పదవీ విరమణ చేశారు. ఈ పదవీ విరమణ కార్యక్రమం సందర్భంగా తరగతిలోని 45 మంది విద్యార్థులంతా కూడా టీచర్ తలపై చేయివేసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. జీవితాంతం వీటికి దూరంగా ఉంటామని మాట ఇచ్చారు. దీనికి గురించి టీచర్ మాట్లాడుతూ విద్యార్థులంగా ఈ ప్రతిజ్ఞలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. అలాగే, 'మాదక ద్రవాల్యకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలనే ఆలోచన నాకు ఆకస్మాత్తుగా వచ్చింది. ప్రస్తుతం మన సమాజంలో మాదక ద్రవ్యాలు తీవ్రమైన సమస్య. నేను ఒక అర్థవంతమైన సందేశాన్ని ఇవ్వాలనుకున్నాను' అని తెలిపారు. సైనాబా బివి 2021 రాష్ట్ర ఉపాధ్యాయ్య అవార్డు గెలుచుకున్నారు. అలాగే, తన కెరీర్ యావత్తు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అలాగే, విద్యార్థుల చర్యను తల్లిదండ్రులతో పాటు రాష్ట్రవ్యాపంగా విద్యావేత్తలు, పిల్లల హక్కుల న్యాయవాదులు కూడా ప్రశంసించారు. దీన్ని విలువ ఆధారిత విద్య ప్రజారోగ్య అవగాహన యొక్క అర్థవంతమైన సమ్మేళనంగా అభివర్ణించారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కూడా ఇటీవల విద్యార్థుల ఈ చర్యను ప్రశంసించారు. ఇది మాదకద్రవ్య రహిత సమాజం పట్ల ప్రేమ, నిబద్ధతకు స్ఫూర్తిదాయకమైన చర్య అని పేర్కొన్నారు. 'ఇటువంటి చర్యలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటంలో మనందరిని ప్రేరేపిస్తాయి' అని విజయన్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని..

నాలుగు కోట్ల బహుతిని అందుకోనున్న వినేశ్ ఫోగట్



హర్యానా : ప్రముఖ భారత రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫోగట్‌కి హర్యానా ప్రభుత్వం రెండు ఆఫర్‌లను ఇచ్చింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమె ప్రదర్శనకు గౌరవ సూచికగా హర్యానా ప్రభుత్వం గ్రూప్ ఎ ప్రభుత్వ ఉద్యోగం కానీ, నగదు బహుమతి కానీ, నివాస స్థలం వంటివి ఆఫర్ చేసింది. అయితే వినేశ్ ఫోగట్ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులకుని.. నాలుగు కోట్ల రూపాయల నగదు బహుమతిని ఎంచుకున్నారు. ఈ రివార్డులను హర్యానా షెహ్రీ వికాస్ ప్రాధికార్ కింద వినేశ్‌కి అందించనున్నారు. హర్యానా క్రీడా విధానం ప్రకారం టాప్ అథ్లెట్లకు డిప్యూటీ డైరెక్టర్ స్థాయి పదవిని ఇవ్వనుంది.

కాగా, రాష్ట్ర క్రీడా విధానం ప్రకారం ఒలింపిక్ రజత పతక విజేతకు సమానమైన 30 ఏళ్ల ప్రయోజనాలను వినేశ్ ఫోగట్‌కి అందించాలని హర్యానా మంత్రివర్గం నిర్ణయించిందని ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించారు. ఆ రాష్ట్ర సిఎం ప్రకటనతో వినేశ్ ఫోగట్ నగదు బహుతిని అందుకునే తన నిర్ణయాన్ని మంగళవారం క్రీడా విభాగానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వినేశ్ ఫోగట్ పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. కానీ కేవలం ఒక గంట ముందు ఆమెపై అనర్హత వేటు పడింది. దీంతో ఆమె రెజ్లింగ్‌కి గుడ్‌బై చెప్పి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె జులానా సీటు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.

అర్జెంటీనాలో కార్మిక సంఘాల సమ్మె బాట

- స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు
- విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గటం పట్ల ఆగ్రహం
- యూనియన్లపై జెవియర్ ప్రభుత్వం కన్నెర్ర



బ్యూనస్ఎయిర్స్ : అర్జెంటీనాలో కార్మిక సంఘాలు సమ్మె బాటపట్టాయి. ఆర్థిక సంస్కరణల పేరుతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆ దేశ ప్రభుత్వంపై కార్మిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జెవియర్ ప్రభుత్వం తన చర్యలను ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పేద ప్రజల సంక్షేమానికి నిధులు కోత పెడుతున్నారనీ, విద్య వైద్య రంగాలకు నగదు కేటాయింపులు తగ్గిస్తున్నారని కార్మిక సంఘ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ద్రవ్యోల్బణంతో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను, పెన్షన్లు కట్ చేయడం సరైన పద్ధతి కాదనీ, ఈ తరహా చర్యలను ఉపసంహరించుకోవాలని యూనియన్ సంఘాలు ప్రభుత్వానికి సూచిస్తున్నాయి. సమ్మె కారణంగా పలు రాకపోకలు నిలిచిపోయాయి.

బస్సు, రైళ్లు, విమానాల రవాణా సేవలు స్తంభించాయి. ప్రభుత్వ దవాఖానా లు, స్కూల్స్, బ్యాంకులు, పోస్టల్ సర్వీసులను బంద్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా సమ్మెకు సంఘీభావం ప్రకటించి, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఇటు సమ్మెపై జెవియర్ ప్రభుత్వం కన్నెరజేసింది. రాజకీయ కుట్రలో భాగంగా పలువురు ఈ చర్యలకు పాల్పడ్డారని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ప్రస్తుతం దేశం ఆర్థికంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నదనీ, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే ఈ సంస్కరణలు అవసరమని ప్రభుత్వం వివరించింది. అయితే, ప్రతిపక్ష నాయకులు దీన్ని ప్రజా వ్యతిరేక విధానమని ఖండించారు.

మస్కట్‌లో నేడే అమెరికా, ఇరాన్ అణు చర్చలు

ట్రంప్ చిత్తశుద్ధి ఎంతో చూస్తామన్న ఇరాన్



టెహరాన్ : అమెరికా నుండి తీవ్రంగా ఒత్తిడి వస్తున్నప్పటికీ ఒమన్‌లో అమెరికాతో జరిపే అణు చర్చల్లో దౌత్యానికి నిజమైన అవకాశం ఇస్తున్నట్లు ఇరాన్ శుక్రవారం పేర్కొంది. మస్కట్‌లో శనివారం ఈ చర్చలు జరగనున్నాయి. అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ఈ చర్చలు ఉద్దేశించబడ్డాయి. ఇరాన్‌తో చర్చలకు సిద్ధమైనట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ఆకస్మికంగా ఒక ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాక్వెయి ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. "చిత్తశుద్ధితో, పూర్తి స్థాయిలో అప్రమత్తతతో దౌత్యానికి నిజమైన అవకాశం ఇస్తున్నాం. అమెరికా ఘర్షణాయుత వైఖరిని అవలంబించినప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నందుకు అమెరికా ఈ నిర్ణయాన్ని ప్రశంసించాలి." అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ చర్చలకు అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వం వహిస్తారు.

చర్చలు ప్రత్యక్షంగా జరగాలని ట్రంప్ అన్నారు కానీ పరోక్షంగానే జరగాలని అరగ్చి పట్టుబట్టారు. ఈ చర్చలకు ఒకపక్క ఏర్పాట్లు జరుగుతున్నా మరోపక్క ఇరాన్‌పై ఆంక్షల విధానాన్ని వాషింగ్టన్ కొనసాగిస్తునే వుంది. ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మిలటరీ చర్య తీసుకోవడం తప్పనిసరని బుధవారం ట్రంప్ హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపుల వల్ల ఉపయోగమేమీ వుండదని, ఐక్యరాజ్య సమితి అణు పర్యవేక్షక సంస్థకు చెందిన ఇనస్పెక్టర్లు ఇరాన్‌కు వచ్చి తనిఖీలు జరపకుండా అడ్డగించడంతో సహా అనేక చర్యలు తీసుకునేందుకు అవకాశాలు కల్పించినట్లవుతుందని ఇరాన్ మత పెద్ద ఖమేని గురువారం హెచ్చరించారు. అటువంటి చర్యలు ఇరాన్ వైపు నుండి కవ్వింపు చర్యలుగా పరిగణించాల్సి వస్తుందని అమెరికా పేర్కొంది. ఇలాంటి నేపథ్యంలో జరుగుతున్న ఈ చర్చల పట్ల ముందుగానే తాము ఎలాంటి అంచనాలకు, అభిప్రాయాలకు రావడం లేదని బాక్వెయి వ్యాఖ్యానించారు. శనివారం నాటి సమావేశంలో అమెరికా చిత్తశుద్ధి, నిజాయితీ ఎంతలా వుందో అంచనా వేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దానికి అనుగుణంగానే తమ తదుపరి చర్యలు వుంటాయని తెలిపారు.



జెరూసలేంలో ఆ స్కూళ్లు వద్దు

యునైటెడ్ నేషన్స్ బడులను మూసివేయాలి : ఇజ్రాయెల్

టెల్అవీవ్ : ఇజ్రాయెల్ అధికారులు తూర్పు జెరూసలేంలోని యునైటెడ్ నేషన్స్(యూఎన్) ఆరు పాఠశాలలను మూసివేయాలని ఆదేశించారు. ఆ స్కూల్స్ కేంద్రంగా హమాస్‌కు సహాయం చేస్తున్నాయనీ, ఆ దేశ ముఠాలకు ఆవాసాలుగా మారుతున్నాయని ఇజ్రాయెల్ ఆరోపణలు చేసింది. అయితే ఈ ఆరోపణలను యూఎన్ ఖండించింది. పాలస్తీనియన్ విద్యార్థులు ఎక్కువగా చదివే ఈ పాఠశాలలు మూసివేయటంతో, వేలాది మంది విద్యార్థుల చదువుకు ఆటంకమవుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది.

'సైబర్ బానిసత్వం' గుట్టు రట్టు !



- బయటపడిన 60మందికి పైగా భారతీయులు
- ఐదుగురు ఏజెంట్లు అరెస్టు

ముంబయి : మయన్మార్‌లో 'సైబర్ బానిసత్వం'లోకి బలవంతంగా దించబడిన 60మందికి పైగా భారతీయులను మహారాష్ట్ర పోలీసు శాఖలోని సైబర్ విభాగ అధికారులు రక్షించారు. ఇందుకు సంబంధించి ఐదుగురు ఏజెంట్లను అరెస్టు చేశారు. వీరిలో ఒక విదేశీ జాతీయుడు కూడా వున్నారు. దీనిపై మూడు ఎఫ్ఐఆర్‌లను మహారాష్ట్ర సైబర్ విభాగం నమోదు చేసిందని సంబంధిత అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు.

సామాజిక మాధ్యమాల ద్వారా బాధితులతో సంబంధాలు పెట్టుకున్న ఈ ఏజెంట్లు థాయిలాండ్‌లో, ఇతర తూర్పు ఆసియా దేశాల్లో అధిక వేతనాలతో ఉద్యోగాల ఆశ చూపించి వారిని ఈ రొంపిలోకి లాగారని సదరు అధికారి తెలిపారు. బాధితులకు పాస్‌పోర్టులను, విమాన టిక్కెట్లను ఏర్పాటు చేసిన ఏజెంట్లు వారిని టూరిస్ట్ వీసాలపై థాయిలాండ్‌కు పంపారు. ఆ దేశంలోకి అడుగు పెట్టగానే వారిని మయన్మార్ సరిహద్దులకు తీసుకెళ్ళారు. అక్కడ నుండి చిన్న చిన్న బోట్లలో ఒక నదిని దాటించారు.

మయన్మార్‌లోకి చేరిన తర్వాత, బాధితులందరినీ సాయుధ రెబెల్ గ్రూపుల నియంత్రణలో వున్న కాంపౌండ్‌ల్లోకి తీసుకెళ్ళారు. ఈ కాంపౌండ్‌లకు పకడ్బందీ కాపలా ఏర్పాట్లు వున్నాయి. ఇక అక్కడ నుండి వారితో నకిలీ కాల్స్ చేయిస్తూ డిజిటల్ అరెస్టు దగ్గర నుండి బూటకపు పెట్టుబడుల పథకాల వరకు రకరకాలైన సైబర్ నేరాలకు పాల్పడేలా వారిపై ఒత్తిళ్లు తేవడం ఆరంభించారు. మయన్మార్‌లో పోలీసు అపరేషన్ ఎలా సాగిందన్న వివరాలు వెల్లడించకుండా బాధితులను కాపాడినట్లు మాత్రమే ఆ అధికారి తెలిపారు. మహారాష్ట్ర సైబర్ విభాగం, ఇతర సంస్థలు కలిసి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. బాధితులను ప్రశ్నించగా, ఇలాంటి బూటకపు కాల్ సెంటర్ కంపెనీలు, వాటి నెట్‌వర్క్ బయటకు వచ్చిందన్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ ముసుగులో కొన్ని కంపెనీలు ఇలా పనిచేస్తున్నాయి. రిక్రూట్‌మెంట్ ఏజెంట్లుగా వ్యవహరించిన వారిలో వెబ్ సిరీస్‌లు, టెలివిజన్ షోల్లో నటించిన నటుడు మనీష్ గ్రే అలియాస్ మాడీ వున్నాడని ఆ అధికారి తెలిపారు. భారత్‌లో కూడా ఇలాంటి ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు పథకం రచించినట్లు మరో ఏజెంట్ ద్వారా తెలిసిందని, దర్యాప్తు సాగుతోందని చెప్పారు.



వారణాసి సామూహిక లైంగికదాడి కేసులో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి : మోడీ ఆదేశం

వారణాసి : నేడు ప్రధాని మోడీ వారణాసికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల వారణాసిలో జరిగిన సామూహిక లైంగికదాడి ఘటన గురించి పోలీస్ కమిషనర్, డివిజనల్ కమిషనర్, జిల్లా మెజిస్ట్రేట్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని మోడీ అధికారులకు ఆదేశించారు. ప్రధాని మోడీ ఈరోజు వారణాసిలో పలు రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. కాగా, వారణాసిలో ఓ 19 ఏండ్ల యువతిపై 23 మంది ఆరురోజులపాటు సామూహికంగా లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలికి మత్తుమందు ఇచ్చి.. ఆమెను పలు హోటళ్లకు తిప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఏప్రిల్ 4న వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసులో 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. లాల్‌పూర్ పాండేపూర్ పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సెక్షన్ల కింద నిందితులపై కేసు నమోదు చేశారు.

తహవ్వూర్ రాణాకు 18 రోజుల కస్టడీ

ఇతర నగరాల్లోనూ బాంబు పేలుళ్లకు రాణా కుట్రలు : కోర్టుకు తెలిపిన ఎన్ఐఏ



ముంబయి : ముంబయి ఉగ్రదాడులు 2008 కేసులో సూత్రధారి తహవ్వూర్ రాణాకు ఢిల్లీలోని కోర్టు 18 రోజుల కస్టడీ విధించింది. అనేక ఏండ్ల నుంచి భారత్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తుల కారణంగా శుక్రవారం తహవ్వూర్ రాణాను భారత్‌కు అమెరికా అప్పగించిన సంగతి తెలిసిందే. అమెరికా నుంచి ప్రత్యేక విమానం ద్వారా గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న రాణాను ఎన్ఐఏ వెంటనే అదుపులోకి తీసుకుంది. గురువారం రాత్రే రాణాను పాటియాలా హౌస్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రత్యేక న్యాయమూర్తి చందర్ జిత్ సింగ్ ముందు ఎన్ఐఏ వాదనలు వినిపించింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇలాంటి దాడులకు కుట్రపన్నాడని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆరోపించింది. అలాగే, ముంబయి దాడుల కుట్రపై పూర్తి విచారణ చేయడానికి రాణాను 20 రోజుల కస్టడీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. 17 ఏండ్ల క్రితం జరిగిన సంఘటనలు తెలుసుకోవడానికి రాణాను వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి ఉంటుందని తెలిపింది. దీంతో రాణాను 18 రోజుల ఎన్ఐఏ కస్టడీకి న్యాయమూర్తి అప్పగించారు. అయితే ప్రతీ 24 గంటలకు ఒకసారి రాణాకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతీ రోజు న్యాయవాదిని కలవడానికి అనుమతి ఇవ్వాలని ఎన్ఐఏను ఆదేశించారు. అలాగే, సాఫ్ట్-టిప్ పెన్ను మాత్రమే వినియోగించుకునేందుకు రాణాకు న్యాయమూర్తి అనుమతించారు. కాగా, ఈ సందర్భంగా కోర్టు వద్ద భారీ స్థాయిలో భద్రతను ఏర్పాటు చేశారు.

కోర్టు 18 రోజుల కస్టడీ మంజూరు చేయడంతో ఎన్ఐఏ ప్రధానకార్యాలయానికి రాణాను తరలించారు. అక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌లోని 14, 14 సెల్‌ను కేటాయించారు. 24 గంటల నిఘా కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 2008 నవంబర్ 26న 10 మంది ఉగ్రవాదులు ముంబయిలో వివిధ ప్రాంతాల్లో దాడులకు తెగబడ్డారు. దాదాపు 60 గంటల పాటు వివిధ ప్రాంతాల్లో నక్కి కాల్పులు జరపడంతో 166 మంది మరణించగా, 238 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదుల్లో కసబ్‌ను తప్ప మిగిలినవారందర్నీ భద్రతా సిబ్బంది కాల్చిచంపారు. ప్రాణాలతో పట్టుకున్న కసబ్‌ను తరువాత ఉరిశిక్ష విధించారు.

మోడీ ఈఎల్ఐ పథకం.. మరో మోసపూరితం

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (ఇఎల్ఐ) మోడీ ప్రభుత్వ మరో మోసపూరిత ప్రకటన అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ శుక్రవారం విమర్శించారు. ప్రధాని రోజుకో కొత్త నినాదం సృష్టిస్తున్నారని, వాటిలో ఇది ఒకటని అన్నారు. కానీ యువత నిజమైన ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల తర్వాత, ప్రధాని మోడీ ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం పథకాన్ని ఎంతో ఆర్భాటంగా ప్రకటించారని, యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ పథకాన్ని ప్రకటించి సుమారు ఏడాది కావస్తోందని, కానీ అమలు చేయలేదని అన్నారు. ఆ పథకం కోసం కేటాయించిన రూ.10,000 కోట్ల నిధులను కూడా వెనక్కు తీసుకున్నారని, ఈ చర్య నిరుద్యోగంపై మోడీ వైఖరిని తెలియజేస్తోందని దుయ్యబట్టారు. పెద్ద కార్పొరేట్‌లపై మాత్రమే దృష్టిసారించడం, నిష్పాక్షిక, న్యాయమైన వ్యాపారాల కన్నా తన స్నేహితులను ప్రోత్సహించడం, స్వదేశీ నైపుణ్యాలను విస్మరించడంతో ఉద్యోగాలను సృష్టించలేమని అన్నారు. సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం, పోటీ పడగల నిష్పాక్షిక మార్కెట్లు, స్థానిక ఉత్పత్తి, నెట్‌వర్క్‌లకు మద్దతు ఇవ్వడం, సరైన నైపుణ్యంతోనే కోట్లాది ఉద్యోగాలను సృష్టించగలమని అన్నారు. ప్రధాని మోడీ ఈ ఆలోచనలతో ఏకీభవించరని అన్నారు. " ప్రధాని గారు.. మీరు గొప్పగా ఇఎల్ఐ పథకాన్ని ప్రకటించారు. కానీ రూ.10,000 కోట్ల పథకం ఎందుకు అదృశ్యమైంది. మీరు మీ వాగ్దానాలను పక్కనపెట్టినట్లు, నిరుద్యోగ యువతను కూడా విడిచిపెట్టారా. ఉద్యోగాలను సృష్టించడానికి మీ ప్రణాళిక ఏమిటి లేదా ఇది కూడా మరో మోసపూరిత ప్రకటనేనా" అని మోడీని నిలదీశారు.

బిజినెస్

సెన్సెక్స్‌కు 1300 పాయింట్ల లాభం

23వేల చేరువలో ఎన్ఎస్ఈ



ముంబయి : ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లను 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తోన్నట్లు ట్రంప్ చేసిన ప్రకటనతో మార్కెట్లు రాణించాయి. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 1310 పాయింట్ల లాభంతో 75,157కు చేరింది. నిఫ్టీ 429.40 పాయింట్ల లాభంతో 22,829 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టిసిఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనబడింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.7.72 లక్షల కోట్లు పెరిగి రూ.401.54 లక్షల కోట్లకు చేరింది.

ఎన్ఎస్ఈ మరో మైలురాయి

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) 2025 ఏప్రిల్‌లో మరో మైలురాయిని అధిగమించినట్టు తెలిపింది. యూనిక్ క్లయింట్ కోడ్‌లు, ఖాతాలు 22 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. 2024 అక్టోబర్ 20 నాటికి 20 కోట్లుగా ఉన్న సంఖ్య.. ఆరు నెలల్లోనే భారీగా పెరిగిందని పేర్కొంది. మహారాష్ట్ర, యూపీ, గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు 49 శాతం వాటా కలిగి ఉన్నాయని ఎన్ఎస్ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ పేర్కొన్నారు. దేశంలో ఇన్వెస్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతోందన్నారు.

గూగుల్‌లో వందలాది మందికి ఉద్వాసన

వాషింగ్టన్ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ మరోమారు ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈసారి ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్ టీమ్‌ల నుంచి వందలాది మంది ఉద్యోగులను తొలిగించేస్తోందని సమాచారం. ఇప్పటికే వీరికి నోటీసులు కూడా పంపినట్టు రిపోర్టులు వస్తున్నాయి. ఆపరేషన్‌లను స్ట్రీమ్‌లైన్ చేయడం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధిక వృద్ధి రంగాలలో పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం కోసమే ఉద్వాసనలు చేపడుతోందని పరిశ్రమ వర్గాల అంచనా. మరోవైపు ఆర్థిక అనిశ్చితులు, ఎఐ ప్రాజెక్టుల వ్యయం పెరగడం కూడా కారణమని తెలుస్తోంది.

ఎస్ఐపీల్లో తగ్గిన పెట్టుబడులు

ముంబయి : ఈ ఏడాది మార్చిలో సిస్టమెటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్ఐపీ) పెట్టుబడుల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2025 ఫిబ్రవరిలో రూ.25,999 కోట్లుగా ఉన్న పెట్టుబడులు.. మార్చిలో స్వల్పంగా 0.28 శాతం తగ్గి రూ.25,926 కోట్లుగా నమోదయ్యాయి. అయినప్పటికీ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ మొత్తం ఎయూఎం 23.11 శాతం వృద్ధితో రూ. 65.74 లక్షల కోట్లకు చేరిందని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్ఐ) తెలిపింది. రిటైల్ పెట్టుబడిదారులలో అవగాహన పెరగడం, మ్యూచువల్ ఫండ్లపై నమ్మకంతో ఎయూఎం పెరిగడానికి కారణమని ఎఎంఎఫ్ఐ సీఈఓ వెంకట్ చలసాని పేర్కొన్నారు.

మసీదులకు పరదా పట్టాలు..

నవతెలంగాణ - మలక్ పేట్

హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా మసీదులకు ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పరదా పట్టాలను కప్పుతున్నారు. ఈ యాత్రలో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసులు





జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటామని పోలీసులు తెలిపారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బడంగ్ పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 26వ డివిజన్ పరిధిలోని పోస్టల్ కాలనీ సమస్యలకు నిలయంగా మారిందని, కాలనీ వాసులు పలు రకాల రోగాల బారిన పడుతున్నారని వచ్చిన వార్తకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. ఆ మేరకు శుక్రవారం కాలనీలో స్వైర్య విహారం చేస్తున్న పందులను ఇక్కడి నుండి తరలించారు. దీంతో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులు పర్వతాలు గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య గౌడ్, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడుకోవాలి
- బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరా దేవి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరీపై ఉందని, ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని బాలాపూర్ మండల తహశీల్దార్ ఇందిరా దేవి హెచ్చరించారు. శుక్రవారం బాలాపూర్ మండలం జల్పల్లిలోని సర్వే నెంబర్ 69లో 1వెయ్యి గజాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని చేసిన నిర్మాణాలను, అదే విధంగా కుర్మల్ గూడలోని సర్వే నెంబర్ 80లో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని స్మశాన వాటిక ప్రహరీ గోడను ఆనుకొని చేసిన అక్రమ గోడ నిర్మాణాన్ని, రెండు ఇండ్ల నిర్మాణాలను పోలీసుల సహకారంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఇందిరా దేవి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మండలంలోని ప్రభుత్వ భూములను ఎవ్వరు ఆక్రమించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలో గత కొంత కాలంగా కొందరు భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ప్లాట్లుగా తయారు చేసి అమ్ముకోవడం జరిగిందని, అలాంటి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికీ కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణాలు చేశారని తెలిపారు. భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా సరే వారిని వదిలేది లేదని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను అక్రమించినట్లు తెలిస్తే స్థానిక ప్రజలు తమకు నేరుగా సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు షేక్ జమీల్, ప్రశాంతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు బీమా సౌకర్యం కల్పించాం

మేకల సత్యనారాయణ

నవతెలంగాణ - ఎల్బీనగర్

దేశంలో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్య ల పై పోరాటాలు చేసి,సంక్షేమాలు అందించే దిశ గా టీయూడబ్ల్యూ జే సంఘము నిలిచిందని రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సలీమ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ లో వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల గురించి మాట్లాడే సంఘం టీయూడబ్ల్యూజే, ఐజేయూ మాత్రమే అని అన్నారు. నాటి నుండి నేటి వరకు విలువలతో కూడిన సంఘం అనేక విజయాలు సాధించిందన్నారు. అక్రిడేషన్ కార్డుల నుండి మొదలుకొని ఇతర అన్ని రకాల ప్రయోజనాలు యూనియన్ పోరాటాల వల్లనే సాధ్యం అయ్యిందని చెప్పారు. రాష్ట్రంలో మెజార్టీ వర్కింగ్ జర్నలిస్టులు మా యూనియన్ లోనే ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలోని జర్నలిస్టులకు మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జాతీయ అధ్యక్షులు దేవులపల్లి అమర్, జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ముఫైసిల్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్ ల సహకారంతో అకాడమీ తరపున శిక్షణా తరగతులు, యూనియన్ తరఫున ఆరోగ్య శిబిరాలు,క్రీడా పోటీలు నిర్వహించడానికి కృషి చేస్తున్నాం అని వివరించారు. యూనియన్ తరపున రంగా రెడ్డి జిల్లాలోని జర్నలిస్టులకు 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఇప్పటికే కల్పించటం జరిగిందని, మరిన్ని కార్యక్రమాలను అమలు చేయటానికి కృషి చేస్తామన్నారు. యూనియన్ నుండి ఒకరిద్దరు పోయినంత మాత్రాన యూనియన్ కు నష్టం లేదని, జర్నలిస్టులు అంతా ఐక్యత తో ఉన్నారన్నారు.

అనాజీపూర్‌లో అక్రమ వెంచర్‌పై చర్యలేవి..?



- వేముల కత్వ, ఇందిరా సాగర్ కబ్జాకు ఎసరు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులు
- నాలా కన్వర్షన్ లేకుండానే లేఅవుట్ కు శ్రీకారం
- బ్లాస్టింగ్‌తో బెంబేలెత్తుతున్న గ్రామస్తులు
- హెచ్ఎండీఏ ముసుగులో వినియోగదారులకు టోకరా
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవరించడంతో పచ్చని పల్లెల్లో భూగర్భ జలం అడుగంటి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం)



రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, అనాజీపూర్ పూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన వేముల కత్వ, ఇందిరా సాగర్ లను సీపీఐ (ఎం) బృందం శుక్రవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ కోసం కృషి చేస్తే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువులు, కత్వాలు, ఎఫ్ టీ ఎల్ భూములు కనుమరుగవుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. అనాజీ పూర్ గ్రామ పరిధిలోని వేముల కత్వ, ఇందిర సాగర్ లోని ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ భూమిని ఆక్రమించి జీనియస్ డెవలప్మెంట్ సంస్థ రోడ్లు వేసి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. జీనియస్ డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ సంస్థ చేస్తున్న అక్రమాలపై ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారితో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తూ పర్యావరణానికి విగాతం కల్గిస్తూ స్థానిక జనజీవనానికి ఇబ్బందిగా మారిందన్నారు. సుమారు 300 ఎకరాలలో భూమిని చదును చేస్తూ అందులో విల్లాస్ చేపట్టేబోయే నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు లేవన్నారు. నాలా కన్వర్షన్, హెచ్ఎండీఏ, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల నుంచి ఎటువంటి పర్మిషన్ లేకుండా ఆక్రమాలకు దిగుతున్నారన్నారు. పెద్ద, పెద్ద గుట్టలను బ్లాస్టింగ్ తో పేల్చేస్తున్నారన్నారు. అలాగే భారీ ప్రహరీ గోడ నిర్మించి ఎవరినీ రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూడడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మామూళ్ల కు ఆశపడి అక్రమదారులకు అధికారులు వత్తాసు పలికి సహకరిస్తే ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కల్గించి, ప్రభుత్వం ఆస్తులు కొల్లగొట్టే వారు ఎంతటి వారినైనా సీపీఐ(ఎం) వదిలి పెట్టదని హెచ్చరించారు. ఈ పరిశీలనలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, నాయకులు వంగాల ముత్యాలు, కావలి జంగయ్య, గుండె శివకుమార్, మహేశ్వరం లింగస్వామి, పి. శ్రీనివాస్, స్థానిక రైతులు వెంకటేష్ మహేష్, బాల్ రాజ్, ఐలయ్య, ప్రణయ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : కమిషనర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి..త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి. సరస్వతి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ 9వ డివిజన్ సిరిపురం కాలనీలో రూ.11లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ సరస్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటంలో ముందు వరుసలో ఉన్నామని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుబాటులోకి తీసుక రావాలని కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధుల, ప్రజల సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్వర్ రావు, డీఈఈ వెంకన్న, ఏఈ వినీల్ కుమార్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేదే విద్య..



సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతి రావు పూలే.. సామాజిక ఉద్యమాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే . చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే. విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పూలే కృషి చేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు, వివక్షతలకు గురైన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే..

నవతెలంగాణ - ఎల్బీనగర్

మహాత్మా జ్యోతి రావు పూలే 198 వ జయంతి వేడుకలను ఎల్బీనగర్ నియోజక వర్గంలో శుక్రవారం ఘన ంగా నిర్వహించారు. హస్తినపురం డివిజన్ పరిధిలోని జెడ్. పీ.రోడ్డు వై జంక్షన్ వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్యంచారి, శ్రీనివాస్ యాదవ్, బాలం ఈశ్వర్, అనిత, శ్రీనివాస్ నాయక్, సల్వాచారి, ఇబ్రహీం, సయ్యద్, కృష్ణ, వేణు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నాగోల్



మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జోగు రాములు, స్వామి, యాదగిరి, బిక్షపతి, నక్క మహేష్, గుర్రం కోటేష్, మేడి ప్రసాద్, నాగరాజ్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్



తుర్కయంజాల్ మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తా దగ్గర జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను కుల వివ్వక్ష వ్యతిరేక పోరాట సంఘం తుర్కయంజాల్ ప్రధాన కార్యదర్శి ఇల్లూరి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంఘం నాయకులు అరుణకుమార్, సీపీఐ(ఎం) మున్సిపాలిటీ కార్యదర్శి డి.కిషన్ లు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త కురుమ శివకుమార్, ఇంజాపూర్ జోన్ బాధ్యులు, మున్సిపల్ కమిటీ నాయకులు ఎం. సత్యనారాయణ, చేనేత రాష్ట్ర నాయకులు బి. శంకరయ్య, సుందరయ్య కాలనీ శాఖ సమన్వయ కమిటీ నాయకులు కే. శ్రీనివాస్, శాఖ కార్యదర్శి ఐ. కృష్ణ, ఎస్ ఎన్ ఆర్ నగర్ శాఖ కార్యదర్శి మున్సిపల్ కమిటీ నాయకులు ఆశీర్వాదం, కమిటీ సభ్యులు యాదగిరి, మద్దెల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హయత్ నగర్

మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా, హయత్ నగర్ అంబేద్కర్ ధర్నా చౌక్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యకు మార్గదర్శకుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి, సీపీఐ హయత్ నగర్ మండల సమితి కార్యదర్శి శేష రాజు పల్లి, శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం హయత్ నగర్ లోని పూలే విగ్రహానికి నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హయత్ నగర్ మండల సహాయ కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, ఏఐటీయూసీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి రమావత్ సక్రు నాయక్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కర్నె సుజాత, ప్రజా నాట్య మండలి మండల కార్యదర్శి జ్యోతి, వివిధ శాఖల కార్యదర్శులు యమున, ఆర్ సౌజన్య, అనిత, కె.సౌజన్య, శ్రీధర్ రెడ్డి, రాములు, శ్రీకాంత్, రేణుక, మమత, శివ జ్యోతి ప్రజాసంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక జన జాగృతి అధ్వర్యంలో..

హయత్ నగర్ లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసిన సామాజిక జన జాగృతి కమిటీ అధ్యక్షులు తొంట బాబు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సేన నాయకులు గుండె యాదగిరి, నల్ల జగన్, సురేష్, భాస్కర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల నుండి సీఐటీయూ బైక్ ర్యాలీ..

ఆటోనగర్ వనస్థలిపురం చింతలకుంట ఎల్బీనగర్ కొత్తపేట చైతన్యపురి నుండి ర్యాలీ నిర్వహించారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని పూలే విగ్రహం వద్ద నుండి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, సీఐటీయూ ఆఫీస్ బేరర్ మల్లె పాక వీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి ఎల్లయ్య, సిహెచ్ కృష్ణయ్య, బి. కనకయ్య సిహెచ్ మల్లేశం, లింగం యాదవ్, పి రామస్వామి, మంథని యాదయ్య, పి లక్ష్మయ్య, దుర్గారావు, పి శ్రీనివాస్, పోలే కృష్ణ, కట్టా శ్రీనివాస్, చైతన్య, కే రాములు ఎండి లతీఫ్, చంద్రయ్య ఎల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత నేతల ఆధ్వర్యంలో..

హయత్ నగర్ మండల కేంద్రంలో పార%శీ%దస్వామి, ఎర్ర రవీందర్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు, జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ హెడ్మాస్టర్ ఇందిరా,హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గజ్జి శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నాయకులు బండారి భాస్కర్, హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగని, శ్రీనివాస్ పారంద మహేష్, పిట్టల జంగం ముదిరాజ్, శుభరాత్రి మధు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగే విష్ణువర్ధన్, కార్యదర్శి కేరింగుల నరేందర్, గౌడ్ దాసరిమోని శ్రీధర్ ముదిరాజు, హయత్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఆకిటి బాలరాజు, ముదిరాజ్ యువజన సంఘం అధ్యక్షులు లింగం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్ పేట్



మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు తిమ్మని గిరీష్, దళిత నాయకులు జొన్నాడ జంగయ్య, గడ్డం వెంకటేష్, అంజా బాల్రాజ్, నీరుడు శ్రీరాములు, కమిటీ అధ్యక్షులు జొన్నాడ నర్సింగ్ రావు, పగడల ఉమేష్, గూడూరు నాగార్జున, మరాటి నరసింహారావు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం



హస్తినాపురం డివిజన్ పరిధి లోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద జయన్న ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్ సుఖ్ నగర్



మహాత్మా జ్యోతిరావు పూలే మానవ సమాజానికి ఒక మార్గం అని చేతి వృత్తులు సమన్వయ సంఘం నేత గోరెంకల నర్సింహ అన్నారు. పూలే 198వ జయంతిని చైతన్యపురి డివిజన్ పరిధిలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్షౌర వృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్, మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నబోయిన వెంకన్న, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కో ఇం టో సభ్యులు గాజుల ఆంజనేయులు, జి. మనోహర్, ఎం వీరయ్య, ఎం కృష్ణ, దండు మల్లేష్, దండు నిరంజన్, వీరేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ చంపాపేట్



అణగారిన వర్గాల కోసం విద్యను ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత జ్యతిరావు పూలే అని సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు మీసాల శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యులు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ - కొత్తపేట



మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ రాజీవ్ గాంధీ నగర్ ఫేస్ టు లో శుక్రవారం పూలే విగ్రహానికి కొత్తపేట్ డివిజన్ కార్పొరేటర్ శ్రీ నాయి కోటి పవన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ-బడంగ్ పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని కందుకూరు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -ఎల్బీనగర్



దేశంలో 90 శాతం ఉన్న పేద వర్గాలకు వనరుల్లో, విద్య, ఉద్యోగ తదితర అన్ని రంగాలలో సమాన అవకాశాలు లభించినప్పుడే మహాత్మా జ్యోతిరావు పూలే కు నిజమైన నివాళి అని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. కొత్తపేటలోని బీజేఆర్ భవన్ లో నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు, బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే సాగించిన పోరాటం చాలా గొప్పది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైహింద్ గౌడ్, చామకూర రాజు, కోల జనార్ధన్, ఉపేంద్ర, కె.వి గౌడ్ , శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- చంపాపేట్

మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా సంతోష్ నగర్ సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్, ప్రసాదు, లక్ష్మయ్య, బిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అనుమానాస్పద స్థితిలో యాచకుడు మృతి



నవతెలంగాణ-పోచారం

అనుమానాస్పద స్థితిలో యాచకుడు మృతి చెందిన ఘటన పోచారం ఐ.టి కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి తెనుగు గూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 58 నుండి 62 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యాచకుడు స్థానికంగా చుట్టు పక్కల ప్రాంతాల్లో యాచించి ఎవరైనా ఆహారం ఇస్తే తింటూ రోడ్ల పై ఉండేవాడు. కాగా అతను మృతి చెంది కనిపించడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు తెల్ల రంగు అంగీ, బ్లూ కలర్ ఇన్నర్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతునికి సంబంధిచిన సమాచారం తెలిసిన వారు ఎవరైనా ఉంటే పోచారం పోలీస్ స్టేషన్‌లో సంబంధిత పోలీసు అధికారిని సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

- కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యా భివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త పూలే అని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. గౌతమ్ నగర్ చౌరస్తాలోని పూలే విగ్రహానికి కార్పొరేటర్ పూలమాల వేసి నివాళులర్పించారు.కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలను ఏర్పర్చిన మహనీయుడని, విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దూరచా రాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేసిన గొప్ప మహనీయుడు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాముయాదవ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మహోన్నతుడిగా తీర్చేది విద్య ఒక్కటే

- ఎంపీ ఈటల రాజేందర్ , ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటేనని మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా సైనిక్‌పురిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే అన్నారు. 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు పూలే అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచా రాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పూలే కృషి చేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురైన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నివారణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర

- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు
- మల్కాజ్‌గిరి జోన్ పరిధిలో 1,460 సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించిన సీపీ





నవతెలంగాణ-కీసర

నేర నివారణను తగ్గించడం లో సీసీటీవీ నిఘా కీలక పాత్రను పోషిస్తాయని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు అన్నారు. మల్కాజ్‌గిరి జోన్ పరిధిలో నాగారం మున్సిపాలిటీలో 1,460 సీసీ టీవీ కెమెరాలను శుక్రవారం సీపీ ప్రారంభించారు. వీటిలో, 410 సిసిటివి కెమెరాలను 17 కాలనీలలో ప్రధాన రోడ్లు ,జంక్షన్లను కవర్ చేస్తూ, రూ. 1.19 కోట్ల (ఒక కోటి పంతొమ్మిది లక్షలు) వ్యయంతో ఏర్పాటు చేశారు, ఇందులో రెండేండ్ల వార్షిక నిర్వహణ ఒప్పందం (ఏఎంసి) కూడా ఉంది. మిగిలిన 1,050 సిసిటివి కెమెరాలను ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా 212 దుర్గా దేవాలయాలలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానిస్తారు, ఇక్కడ ఒక ప్రత్యేక బృందం 24/7 వాటిని పర్యవేక్షిస్తుంది. అదనంగా, మల్కాజ్‌గిరి జోన్‌లో మొత్తం 5,260 కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, 93,061 నేను సైతం కెమెరాలు ఏర్పాటు చేశారు. మొత్తం 98,321 కెమెరాలను జియో-ట్యాగ్ చేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేర కార్యకలాపాలను నిరోధించడంలో, దర్యాప్తులలో సహాయపడటం, చురుకైన పోలీసింగ్‌ను ప్రారంభించడంలో, నేర విశ్లేషణలో సహాయపడటం సురక్షితమైన వాతావరణాన్ని ప్రోత్సహించడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఆధునిక నేర నివారణ వ్యూహాలలో సీసీటీవీ నిఘా ఒక ముఖ్యమైన భాగమని , సీసీటీవీ ఫుటేజ్ సహాయంతో రాచకొండ పోలీసులు అనేక సంచలనాత్మక కేసులను విజయవంతంగా పరిష్కరించారని తెలిపారు. కాలనీ, కమ్యూనిటీ పెద్దలు తమ కమ్యూనిటీలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చి చొరవ తీసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. నేరాలను నిరోధించడం, అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించడం, దర్యాప్తులో పోలీసులకు సహాయం చేయడం ద్వారా ఇటువంటి ప్రయత్నాలు ప్రజా భద్రతకు గణనీయంగా దోహదపడతాయని చెప్పారు. సీసీటీవీ కెమెరాల ఉనికి కేవలం బలమైన నిరోధకంగా పనిచేస్తుంది, అన్ని నివాసితులకు సురక్షితమైన వాతావరణాన్ని పెంపొందిస్తుందన్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంలో పోలీసులకుమద్దతు ఇచ్చిన కాలనీ పెద్దలను సీపీ , అభినందించి, సత్కరించారు. మల్కాజ్‌గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.వి. పద్మజ, మల్కాజ్‌గిరి జోన్ అదనపు డీసీపీ ఎన్. వెంకట రమణ, మల్కాజ్‌గిరి డివిజన్ ఏసీపీ ఎస్. చక్రపాణి, కుషాయిగూడ డివిజన్ ఏసీపీ టి. మహేష్ గౌడ్, ఐటి సెల్ ఏసీపీ జె. నరేందర్ గౌడ్, మల్కాజ్‌గిరి జోన్‌లోని అన్ని ఎస్‌హెచ్ఓలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఐటీయూ, స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో పూలేకు నివాళి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, సీఐటీయూ ఆధ్వర్యంలో సైనిక్‌పురి చౌరస్తాలో పూలే విగ్రహానికి నివాళ్లర్పించారు. అనంతరం సభా కార్యక్రమం జరిగింది. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. పూలే విగ్రహానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె చంద్రశేఖర్ , నాయకులు శ్రీనివాసరావు, మంగ, హెచ్‌వీ స్వామి, నరసింహారావు, స్ఫూర్తి గ్రూపు నాయకులు జయరాజ్, వెంకట్, జి శివరామకృష్ణ, రహీం, వెంకట సుబ్బయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళు లు అర్పిం చారు. సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పూలే బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆయనను ఆనాడు వ్యతిరేకిం చి కించపరిచిన వారు నేడు పరిపాలన చేస్తున్నారని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. సామాజిక ఉద్యమ నేత జయరాజు మాట్లాడుతూ పూలేకు నిజమైన నివాళి అంటే ఈనాడు ఉన్న మనువాద సంస్కృతిని దాన్ని పెంచి పోషించే వాళ్లకి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలని చెప్పారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ పూలే సినిమాను బ్రాహ్మణీయ భావజాలం కలిగిన పాలకులు అడ్డుకున్నారని, అటువంటి వారే నేడు ఆయనకు దండలు వేసి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని నినాదాలు చేస్తున్నారన్నారు. ముందు అటువంటివారు తమ భావాలలో ఉన్న మనువాద సంస్కృతిని తొలగించుకోవాలని చెప్పారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ ఆనాడు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలేలు చేసిన కృషి ఫలితంగా బాలికలకు చదువు సాధ్యమైందన్నారు. వంశరాజ్ మల్లేష్, నరసింహారావు, హెచ్‌వీ స్వామి, మంగ, రహీం, మంగ, యాదగిరిరావు, జె చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, జయరాజ్, శివరామకృష్ణ, ఎం శ్రీనివాసరావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ నాయకత్వంలో సంక్షేమ రాజ్యం

- ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్ పేట

రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో కల్యాణ లక్ష్మీ, షాదిముభారక్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన ఎంపీ ఈటెల రాజేందర్, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ లతో కలిసి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 389 మంది లబ్ధిదారులకు సుమారు రూ.4 కోట్ల చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. ఘట్కేసర్ మండలంలో 116 మందికి, కాప్రాలో 36మందికి, మేడ్చల్ లో 56 మందికి, మూడుచింతలపల్లిలో 25 మందికి, మేడిపల్లిలో 102 మందికి, శామీర్ పేట లో 58 మందికి మంజూరైన చెక్కులను పంపిణీ చేశామని వివరించారు. అదేశిదంగా ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా, ప్రభుత్వంపై భారం పడుతున్నా సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారని చెప్పారు. అనంతరం దేవరయంజాల్‌లోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో మహేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సిములు యాదవ్, బి బ్లాక్ అధ్యక్షులు మహేష్ కుమార్, తుంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్ పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మెన్ పెండెం లక్ష్మీనారాయణ, వివిధ మండలాల, మున్సిపాలిటీల అధ్యక్షులు, నాయకులు రవీందర్ గౌడ్, నర్సింహా రెడ్డి , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర

సీఎం రిలీఫ్ పండ్ పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు నాగారం మున్సిపాలిటీ బోగారం గ్రామానికి చెంది ఆకుల సుభాష్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.60 వేల చెక్కును లబ్దిదారునికి వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్, కాంగ్రెస్ కీసర మండల ప్రెసిడెంట్ కోలా క్రిష్ణ యాదవ్ ,కాంగ్రెస్ సేవా దళ్ కీసర మండల్ ప్రెసిడెంట్ జనగాం మహేంద్ర భూపతి, మాజీ ఎంపీటీసీ హేమలత పర్వతాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను ముందు తరాలకు అందించాలి

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం. కృపాసాగర్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

పూలే ఆశయాలను ముందు తరాలకు అందించాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం. కపాసాగర్ అన్నారు. మల్కాజిగిరిలోని సీపీఐ(ఎం) కార్యాలయం లో మండల కమిటి ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సనాతన ధర్మాన్ని సమూలంగా నిర్మూలించాలని, మానవులంతా,సమానంగా కలిసి ఉండాలని పూలే పెద్ద ఎత్తున ఉద్యమం నడిపాడని, బాల్య వివాహాలకు, వితంతు వివాహాలకు, సతి సహగమనానికి వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాలు నిర్వహించారన్నారు. ప్రధానంగా, శుద్రులకు, చదువు అందించాలని, చిన్న, చిన్న పాఠశాలలు ప్రారంభించి సత్య శోధక సమాజం ఏర్పాటు చేసి, అనాధ ఆశ్రమాలు ప్రారంభించారని, వివక్షను వ్యతిరేకిస్తూ, అనేక పుస్తకాలు రాశారన్నారు. నేటి కేంద్ర బీజేపీ పాలకులు, సెక్యులర్ భావాలు, కలిగిన రాజ్యాంగాన్ని, రద్దు చేసి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు సనాతన ధర్మాన్ని అమలు చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. మోడీ మతోన్మాదాన్ని అడ్డుకుని శాస్త్రీయ అవగాహన సమాజంలో పెంపొందించాలన్నారు. ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వినోద, ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి పి. మంగ, పార్టీ మల్కాజిగిరి మండల నాయకులు కొండల్, రాజా లక్ష్మీ, నసీమ, అరుణ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

మనువాదంపై పోరాడటమే పూలేకు నివాళి



నవతెలంగాణ-కాప్రా

పూలే స్ఫూర్తితో సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలని ఎస్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్యలు పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైనిక్‌పురిలోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి ఎస్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్యలు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కుల జాడ్యం మన దేశంలోనే ఉన్నదని, వేల సంవత్సరాలుగా కులం పేరుతో ఆధిపత్యం చేస్తూ సామాజిక, ఆర్థిక దోపిడీ కొనసాగిన దానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారులు పూలే దంపతులు అని కొనియాడారు. నేడు బీజేపీ మతోన్మాద అవకాశవాద రాజకీయాలను నడుపుతూ ప్రజల మధ్య వైషామ్యాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. పాతకాలపు నీచమైన రాచరిక వ్యవస్థలోకి తీసుకెళ్ళే దుష్ట ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగన్ని మార్చి మనుధర్మ శాస్త్రన్ని అమలు చేయాలని బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, సుల్తాన్, రమేష్ బాబు, మేడ్చల్ జిల్లా నాయకులు రమేష్, శివ పాల్గొన్నారు.



పూలేకు ఎమ్మెల్యే ఘన నివాళి

నవతెలంగాణ - చర్లపల్లి

అవిభక్త భారతదేశంలో సామాజిక రుగ్మతలు, అంటరానితనాన్ని ధీటుగా ఎదుర్కొంటూ, బాలికలు, మహిళల విద్యా వికాసం కోసం, వితంతువుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన మొదటి తరం సామాజిక విప్లవయోధుడు పూలే అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

గ్యాస్ ధర పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం.వినోద
- మల్కాజిగిరి చౌరస్తా లో కట్టెల పొయ్యితో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-నేరేడ్ మెట్

పెట్రోల్ డీజిల్ రేట్లు పెరిగి సతమతమవుతున్న ఈ తరుణంలో గ్యాస్ రేట్ పెంచడం సరికాదని, పెంచిన గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకో వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం వినోద డిమాండ్ చేశారు. శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి పి.మంగ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యితో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేదు.. ఉద్యోగానికి భరోసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. అనంతరం ఐద్వా పి మంగ మాట్లాడుతూ ఉపాధి లేదు పనికి తగ్గ వేతనం లేవు ప్రభుత్వాలు పెంచాలి కానీ పెంచడం లేదన్నారు. కొనలేని తినలేని పరిస్థితిలో ప్రజలు నెట్టబడుతున్నారని చెఎప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు బడా వ్యాపారుల కోసం తాపత్రయ పడుతున్నదని.. పేదల మధ్యతరగతి ప్రజల గురించి వారికి పట్టడం లేదని మండిపడ్డారు రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 14 రకాల వస్తువులు ఇవ్వాలని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో జిల్లా మొత్తం పెద్ద ఎత్తున మహిళలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు నజీమా, ఎస్ రాజ్యలక్ష్మి, అనిత, షాహిన్, నరసమ్మ, కే పద్మ, అంజమ్మ, పౌజియా, అరుణ, లక్ష్మి, లక్ష్మీ పద్మావతి, రాధమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

కుల మత వివక్ష లేని సమాజ స్థాపనకు పూలే కృషి

- సీపీఐ(ఎం) మేడ్చల్ మండల కార్యదర్శి మందాపురం నరేష్



నవతెలంగాణ-మేడ్చల్

కుల మత వివక్షను లేని సమాజ స్థాపనకు మహాత్మ జ్యోతిబాపూలే విశేషంగా కృషి చేశారని సీపీఐ(ఎం) మేడ్చల్ మండల కార్యదర్శి మందాపురం నరేష్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిభాపూలే బాల్యవివాహాల నిర్మూలనకు వితంతు పునర్వివాహాలకు చేయడం కోసం నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు.విద్యాతోని సమాజంలో గుణనాత్మకైనా మార్పులకు అవకాశం ఉంటుందని చాటి చెప్పారని అన్నారు.సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివద్ధి చెందదని పూలే భావించాడని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు నర్సింగ్ రావు,ప్రశాంత్,చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కృప విజ్ఞాన్ పాఠశాలలో పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ - చర్లపల్లి

స్వాతంత్రం రాకముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని, వారినీ స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాల సాధనకు వారి అడుగుజాడల్లో నడవాలని కృప విజ్ఞాన్ పాఠశాల కరెస్పాండెంట్ శరత్ సుదర్శి పిలుపునిచ్చారు. చర్లపల్లి డివిజన్ ఈసీ నగర్ లోని కప విజ్ఞాన్ పాఠశాలలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృప సుదర్శి, ఉపాధ్యాయుల బందం ప్రకాష్, రిటా, నాగమణి, శ్రావణి, షీబా, కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పిట్టల నరేష్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ చిల్కానగర్ డివిజన్ సీనియర్ నాయకులు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు పిట్టల నరేష్ ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం పిట్టల నరేష్ ముదిరాజ్ మాట్లాడుతూ మహిళా విద్యకు పునాదిగా తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి జ్యోతిరావు పూలే తొలి బాలికల పాఠశాలను స్థాపించారని తెలిపారు. బాల్యవివాహాన్ని వ్యతిరేకిస్తూ బాలికలకు విద్య అవసరమని ఆయన రచించిన గులాం గిరి అనే గ్రంథం అణగారిన వర్గాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని ఆహా మా మహనీయుణ్ణి కొనియాడారు..ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబటి జగదీష్, జల్లి మోహన్, పల్లె నర్సింగ్ రావు, గుడి మధుసూధన్ రెడ్డి, కొంపల్లి రవీందర్, మాస శేఖర్, ఆకిటి బాల్ రెడ్డి, ఎర్ల పరమేశ్వర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి


- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.శోభారాణి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడడమే జ్యోతిరావు బాపూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.శోభారాణి అన్నారు. అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ వినాయకనర్ సెంటర్ పూలే చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు శూద్రులకు విద్య నిషేధమని.. అయినా వారు చదువుకోవాలని పూలే ప్రయత్నించారని తెలిపారు. ఆయన తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించి పాఠశాలలు పెట్టించారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 ఏండ్ల కాలంలో పేస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పైన, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్నందుకు వంద మందికి పైగా హత్యలకు గురయ్యారని, కుల వివక్షను ప్రతిఘటించినందుకు 1000 మందికి పైగా చంపబడ్డారని, తెలిపారు. ఏటా 50 వేలకు పైగా దాడుల కు గురవుతున్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం పార్లమెంటులో చట్టం చేయడం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, నెలకు గ్రామంలో సభలు సమావేశాలు జరిపి తాసిల్దార్లు కలెక్టర్లు పోలీస్ అధికారులు కుల వివక్ష పైన అవగాహన పెంచాలని కోరారు. అంటరానితనం లేకుండా చేయాలన్నారు. మనువాదులు కార్పొరేటు సంస్థలు కలిసి పాలన చేస్తున్నాయని, బడా పెట్టుబడిదారులకు సంపద పెంచే చర్యలు చేపడుతున్నారని చెప్పారు. యజమానులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా కార్మిక నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చారని, మనువాదానికి కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు రామ, సీఐటీయూ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ - చర్లపల్లి

రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలుసుకోవడం, దాని రూపకర్త అంబేద్కర్ జీవితం, సిద్ధాంతాలపై అవగాహన కల్గించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అన్ని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మెన్ కె.నవనీత్ రావు అన్నారు. శుక్రవారం నాచారంలోని స్కూల్ ప్రాంగణంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అంబేద్కర్ వేషధారణలో కనిపించి, ఆయన ప్రసంగాలను ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుమా మీనన్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించే విధంగా విద్యార్థులు నాటకాలు, నత్యాలతో తమ ప్రతిభను చూపించి మంత్రముగ్ధులను చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కమలామనోహర్ రావు, కోర్ ఆపరేషన్స్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైనికపురి చౌరస్తాలో పూలే విగ్రహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ , రామ్ ప్రదీప్ మునుగంటి,చల్ల ప్రభాకర్ ,కంకుల రజినీకాంత్ రెడ్డి ,సంధ్య రెడ్డి సీనియర్ నాయకులు
నవతెలంగాణ-కాప్రా



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఏప్రిల్ 12, 2025 | www.navatelangana.com

ప్రవీణ్ గౌడ్ మృతి



నవతెలంగాణ-బాలానగర్
బాలానగర్ డివిజన్ పరిధిలోని స్థానిక నాయకుడు దండు నర్సింగరావు గౌడ్ కుమా రుడు ప్రవీణ్ గౌడ్ గత కొంతకాలంగా అనా రోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి బాలానగర్‌లోని వారి నివాసానికి వెళ్లి వారి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సాను భూతిని తెలిపి వారి ఆత్మకు శాంతి చేకూరాలని విశ్వసించారు.

పూలే విగ్రహానికి నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో
మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా దళితరత్న మబ్బు పరశురామ్ పూలే విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే సంఘ సంస్కర్తగా, సామాజిక తత్వవేత్తగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీశాలి అన్నారు. తన దాంపత్య జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహాత్ముడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు యార కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జ్యోతిభా పూలే జయంతి



నవతెలంగాణ-సిటీబ్యూరో
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వారు చేసిన సామాజిక సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టి.ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.వినోద్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఎం.సాంబశివరావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎల్.రామ్మోహన్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వి.వెంకట నర్సయ్య, జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



● కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అధికారులకు ఆదేశించారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని రామారావు నగర్ లో శుక్రవారం కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ జరుగుతున్న నాలా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అదనంగా మంజూరు చేసిన 1కోటి 30 లక్షల వ్యయంతో నాలా విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. లో తట్టు ప్రాంతమైన రామారావు నగర్‌లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఏండ్ల తరబడి నాలా సమస్యను ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే కృషితో నాలా సమస్య నుండి విముక్తి కలిగేలా కృషి చేస్తున్నారని అన్నారు. పనుల పురోగతిని అధికారులతో అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, ఆవుల సంజీవ, ముక్తార్, సాంబ శివ, సత్యనారాయణ, కరుణాకర్, యోగి రాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన జగద్గి రిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల నాలుగో తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫుల్లుగా మద్యం సేవించి 4:00 గం॥ల సమయంలో అంజయ్యనగర్‌లోని రోడ్డు నెంబర్ 5లోని ఇంట్లో మెట్లు ఎక్కి కిందికి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బస్తీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో 108 వాహనం ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఈనెల 9న తేదీన మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సదరు మృతి చెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే ఎస్ఐ.శంకర్ 87125 68311,హెడ్ కానిస్టేబుల్ హనుమంతు 9490618292 ఈ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్
● ఓక్షిత్ హిల్ వ్యూ కాలనీలో పర్యటన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధి ఓక్షిత్ హిల్ వ్యూ కాలనీ వాసుల విన్నపం మేరకు కాలనీలో పర్యటించి డ్రయినేజీ సమస్యను పరిశీలిం చారు. కాలనీవాసులతో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల పాలనలో కుత్బులాపూర్ నియోజకవర్గ అభివృద్ధి అడుగంటి పోయిందని విమర్శించారు. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్.బుచ్చిరెడ్డి, పల్లి నరేష్ రెడ్డి, కాలనీ సలహాదారులు సురేందర్ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు నాగరాజు అరుణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి కమలాకర్ రెడ్డి, కోశాధికారి శ్రీధర్ గౌడ్, సంయుక్త కార్యదర్శి నవీన్ యాదవ్, కార్యనిర్వహక కార్యదర్శి కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

పూలే ఆశయాల కోసం పోరాడాలి



● సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు పోరాడాలని సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం షాపూర్ నగర్ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కీలుకాని లక్ష్మణ్ పాల్గొ ని మాట్లాడుతూ... మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారన్నారు. అగ్రకులాల అహంకా రాన్ని ఎదిరించి మహిళలకు బలహీన వర్గాలకు చదువు నేర్పడం కోసం తన ఇంటిని పాఠశాలగా మార్చిన గొప్ప మహనీయుడని అన్నారు. ఆ మహనీయుడికి ఆయన ఆశయాలను కొనసాగించడమే మనమిచ్చే విలువైన నివాళి అన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యురాలు రావుల స్వామి, పార్టీ నాయకులు పాషా, వీరేష్, తదితరులుఉన్నారు.

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గంలో మహాత్మా జ్యోతిభా పూలే జయంతి సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు స్వాతి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలా పురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ మహా నేత మహాత్మా జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా మహాత్మా అనే బిరుదు పొందిన మొదటి వ్యక్తి జ్యోతిబా పూలే అని కొనాయాడారు. సమాజ ఉద్ధారకుడు, అణగారిన జాతుల హక్కులకోసం, అంటరానితనానికి వ్యతి రేకంగా పోరాటం చేసిన మహనీయులు పూలే, సావిత్రిభా పూలే అన్నారు. దేశంలో మొట్టమొదటి బాలికల పాఠశాల ఏర్పాటుచేసింది కూడా ఆయనే అని గుర్తు చేశారు. స్వ యంగా సావిత్రాభా పూలే స్వయంగా ఆడపిల్లలకు పాఠా లు చెప్పారన్నారు. నా గురువు పూలే అని భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ గారే ప్రక టించారని తెలిపారు. అంటే పూలే గొప్పతనం అర్థం చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లులు పి.స్వాతి, సంతోష జ్యోతి, రాజేశ్వరి, మంజుల, మాదవి, అనిత, బాలమణి, సరిత, జాన్సీ, లాస్య పవిత్ర,శృతి, స్వాతి మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిభా పూలేకు ఘన నివాళులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం, అంబేద్కర పార్క్ పరిరక్షణ కమిటీ దయార్ గూడ ఆధ్వర్యంలో.. మహాత్మ జ్యోతి రావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం సింగూరు పాండు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం సింగూరు పాండు మాట్లాడుతూ.. విద్యకు ప్రాముఖ్యతనిచ్చిన గొప్ప సంఘ సంస్కర్త ప్రజల అభ్యున్నతికై కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. బీసీ అయిన ఆయన అట్టడుగు వర్గాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. తమకు సంతానం ఉంటే సమాజ సేవకు ఉపయోగపడలేమనే ఉద్దేశ్యంతో.. ఆ దంపతులు వారికి పిల్లలు కలగకుండా అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించారు. ఈ కార్యక్రమంలో మద్దెల గిరి, బ్యాగరి నర్సింహులు, రాజేష్ పాశ్వాన్, పసునాది రాములు, కళ్ళెం శంకర్, మేకల నర్సింగ్ రావు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి నాటికి 2752వ రోజుకు నిత్య జ్ఞాన మాల..

14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా.. కూకట్‌పల్లి పుర వీధుల్లో అంబేద్కర్ చిత్ర పటంతో గుర్రపు టాంగా పైన భారీ ఊరేగింపు ఉంటుందని సింగూరు పాండు తెలిపారు. అనంతరం అంబేద్కర్ పార్క్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. అంబేద్కర్ నిరంతర నిత్య జ్ఞాన మాలలో భాగంగా జయంతి నాటికి 2752వ రోజు పూర్తి చేసుకుంటామని తెలిపారు. అలాగే అంబేద్కర్ పార్కులో మహనీయుల జయంతి ఉత్సవాలు తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు.

నందనవనం పార్క్‌ను అభివృద్ధి చేయాలి



నవతెలంగాణ-నిజాంపేట్
ప్రగతి నగర్ నాలుగవ డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీలో ఉన్న నందనవనం పబ్లిక్ పార్క్‌ను అభివృద్ధి పరచాలని స్థానికులు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబీర్ అలీకి శుక్రవారం విజ్ఞాపన పత్రం అందించారు. కమిషనర్‌ని కలిసిన వారి మాజీ కార్పొరేటర్ శ్రీరాములయ్య, ఆకుల సతీష్, స్వాతిరావు, ఈశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు పార్కు పరిస్థితులను వివరించారు. సుమారు 300 గజాల్లో ఉన్న ఇంకుడు గుంతను కాపాడాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఈ పార్కులో కనీస సౌకర్యాలు లేవని వారు వివరించారు.పార్కు లోపల చెట్లు పూర్తిగా ఎండిపోతుచ న్నాయని, అందుకు నీటి సౌకర్యం లేకపోవడమే కారణమని తెలిపారు. ఇందుకుగాను రూ. 50 వేలతో ఒక బోర్ వెల్ వేయించి తద్వారా పార్కుల్లోని చెట్లకు నీటి సౌకర్యం కల్పించాలని అభ్యర్థించారు.పార్కు పడమవైపు 300 గజాల ఇంకుడు గుంత ఉందని దానిని కాపాడాలని వారు కోరారు. ఇటీవల కొందరు వర్షపు నీటి నిలువ గుంతకు ఉన్న ఇనుపకంచను తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సాబీర్ అలీ మాట్లాడుతూ పార్కును వీలైనంత తొందరగా అభివృద్ధి పరుస్తామని అందుకు సిబ్బందికి తక్షణమే ఆదేశాలిస్తు న్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖేష్ బేతు పూడి శ్రీనివాస్, చందా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి
గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై కూకట్‌పల్లి పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం 9వ తేదీ బుధ వారం మూసాపేటలో దాదాపు 45 -50 సం॥రాల వయస్సు గల, ఒక గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధ పడుతుండటం కూకట్‌పల్లి పోలీసులు గమనించారు. 108 అంబులెన్స్ సహా యంతో 9వ తేదీన హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి 10వ తేదీ గురువారం రోజున మరణించాడని డాక్టర్‌లు తెలిపారు. అతని వివరాలు ఏమి లభ్యం కానందున, మృతుడి వివరాలు ఎవరికైన తెలిస్తే కింది నంబర్‌కు 63058 87062 సమాచారం ఇవ్వాలని కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

13 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి..

● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో
జిల్లాలో 13 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం 'ధాన్యం సేకరణ'పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి క్రమ పద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చూసుకోవాలని కోరారు. తర్వాత ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యంను ఎట్టి పరిస్థితుల్లోనూ మన జిల్లాలో కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లుల యజమానులను సన్నవడ్ల దిగుమతుల సమయంలో తగు జాగ్రత్తలు పాటించి వాటిని ప్రత్యేకంగా లాట్లు వేసి సెపరేట్ రిజిస్టర్లు పెట్టాలని కోరుతూ రైస్ మిల్లుల వద్ద దింపే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. రైతు తమ ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. అధికారులందరూ సమిష్టిగా పని చేసి జిల్లాకు, ప్రభుత్వానికి ధాన్యం కొనుగోలు విషయంలో మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎల్.సుగుణాబాయి, జిల్లా వ్యవ సాయ విస్తరణ అధికారి చంద్రకళ, రైస్ మిల్లుల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్, క్లేటన్ ప్లే స్కూల్‌లలో గ్రాడ్యుయేషన్ డే..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్, క్లేటన్ ప్లే స్కూల్‌లలో ప్రీ ప్రైమరీ -2 విద్యార్థులకు గ్రాడ్యుయషన్ డే సెలబ్రేషన్స్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాలల చైర్మెన్, ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రీ ప్రైమరీ విద్యారులలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, గోల్డ్, మెడల్స్‌ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లి దండ్రులు తీసుకోవాలని కోరారు. నేటి పిల్లలు చాలా అడ్వాన్స్‌గా ఉన్నారని వారి కంటే ఉపాధ్యాయులు ఇంకా బెటర్‌గా ఆలోచించి మంచి విద్యను అందించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ప్రీ ప్రైమరీ పిల్లల్ని సైతం ఆట, పాట, మాటలలో తర్ఫీదు ఇవ్వాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్టుగా తెలిపారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హించాలని ఆకాంక్షించారు. చిన్నారులు ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆక ట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ యం సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలి



● జేఎన్‌టీయూ హెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
ఆధారిత పరిశోధనకు ప్రాధాన్యత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, స్టాండలోన్ ఎంబీఏ కళాశాలల (ఆటోనమస్ , నాన్-ఆటోనమస్) చైర్మన్‌లు, సెక్రటరీలు, ప్రిన్సిపాల్‌లతో ఇంటరాక్షన్ మీటింగ్, శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. రెక్టర్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వర రావు, నాన్-ఆటోనమస్ డైరెక్టర్ డా. ఎస్.తారా కళ్యాణి, ఆటోనమస్ డైరెక్టర్ డా.బి. రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశం తనకు ఒక హెూంకమింగ్ లాంటిదన్నారు. 2016 వరకు జేఎన్‌టీయూ వ్యవస్థలో పనిచేశానని తెలిపారు. అనంతరం గుజరాత్, ఒడిషాలో ఉపకులపతులుగా బాధ్యతలు నిర్వహించామన్నారు. సంబంధిత కళాశాలలతో సంప్రదింపులు జరిపి సరైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో 20,000కు పైగా కంప్యూటర్ సైన్స్ సీట్లు ఉండటం, అలాగే ఎంఐ వంటి కొత్త సాంకేతిక పరిణామాలు ఉద్యోగ అవకాశాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. జేఎన్‌టీయూ వ్యవస్థలో 10 సెంటర్ అఫ్ ఎక్సెలెన్స్‌లను ఏర్పాటు చేయడం అన్నారు. అనుబంధ, స్వయం పాలిత కళాశాలల వనరులను ఉపయోగించాల న్నారు. రెక్టర్ డా.కె. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నియంత్రణ మాత్రమే కాకుండా, మార్గనిర్దేశక పాత్ర కూడా పోషించాల్సిన అవసరం ఉందన్నారు. డైరెక్టర్ డా.ఎస్.తారా కళ్యాణి చర్చించిన అంశాలకు సంబంధించిన అమలుచేయదగిన నిర్ణయాలను పొందుపరిచిన సమగ్ర కార్యాచరణ పత్రాన్ని సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు .కొత్త విద్యా సంవత్సరానికి అనుబంధ ప్రక్రియలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. విశ్వవిద్యాలయం ప్రమాణాలను మరింత బలోపేతం చేయడంలో అన్ని వర్గాల సహకారం అవసరమని డా.తారా కళ్యాణి పేర్కొని, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దశలవారీగా సమస్యలు పరిష్కారిస్తాం..



● కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
జగద్గిరిగుట్ట డివిజన్,రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు.శుక్రవారం డివిజన్ రాజీవ్ గృహకల్పలోని సమస్యలపై కాలనీ వాసులతో కలిసి పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా కాలనీలోని భూగర్భ డ్రయినేజీ సమస్యలు, బ్లాక్ నెంబర్ 19, 22, 39, 32 దగ్గర డ్రయినేజీ కొత్త పైప్ లైను వెయ్యాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా కాలనీలోని నీటి సమస్య అధికంగా ఉందని నీరు సక్రమంగా రావడంలేదని కాలనీ వాసులు వాపోయారు. సానుకూలంగా స్పందించి కార్పొరేటర్ డ్రయినేజీ సమస్యలను అంచలంచలుగా పరిష్కరిస్తానని మంచినీటి సమస్య కూడా అతి తొందరగా సమస్య లేకుండా చూస్తానని,సమయానికి నీళ్లు వచ్చే విధంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలోని సంక్షేమ సంఘం ఎన్నికలు కూడా అతి త్వరగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గార్లపాటి ప్రభాకర్, మాజీ ప్రధాన కార్యదర్శులు వనం శ్రీనివాస్, ధర్మారపు అంజయ్య, మాజీ ఉపాధ్యక్షులు వంగాల పరశురాం, కాలనీ సీనియర్ నాయకులు, మమత, నిర్మల,సరస్వతి కాలనీ వాసులు పాల్గొన్నారు.

గంజాయి సప్లై చేస్తున్న నిందితుడు అరెస్ట్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న నిందితుడిని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీస్ అధికారులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపిన వివరాలు ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 చట్నీస్ రెస్టారెంట్ వద్ద గురువారం రాత్రి హైదరాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు, , జూబ్లీహిల్స్ ఎక్సైజ్ అధికారులు కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో లింగంపల్లిలో నివసిస్తున్న షేక్ సాజిద్ తండ్రి జావిద్ (32) ఇంటి నంబర్ 19/5 తెలంగాణ నివాసి ,తన హీరో ఫ్యాషన్ ప్లస్ బైక్ నంబర్ ఏపీ 11ఏఏ 9072 పై వెళ్తుండగా అతనిని చెకింగ్ చేయగా అతని వద్ద ఎండిన గంజాయి పాకెట్ లభించింది. అతనిని వెంటనే జూబ్లీహిల్స్ లోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, బైకుస్వాధీనం చేసుకున్నారు. అతని ఫోన్ నెంబర్ ఆధారంగా గంజాయి ఎక్కడినుండి హైదరాబాదుకు తీసుకొని వస్తున్నాడని ఎంతమందికి, ఎప్పటినుండి సప్లై చేస్తున్నాడనే వివరాలు సేకరించుటకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపారు.

ఓయూ జాగ్రఫీ హెడ్‌గా ప్రొ. అనురాధ

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా విశ్వవిద్యాలయం, సైన్సు కళాశాల జాగ్రఫీ హెడ్ (భూగోళ శాస్త్రం)గా ప్రొఫెసర్ తుమ్మ అనురాధ నియమితులయ్యా రు. ఆమె శుక్రవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్ చేతుల మీదుగా నియమ ఉత్తర్వులు స్వీకరించారు. ఆమె ప్రస్తుతం విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మెన్‌గా (బీఓఎస్)గా పని చేశారు. గతంలో సీడీసీ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. ప్రొ. అను రాధ పలు జర్నలస్, బుక్స్ రాశారు. పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. విభాగం అభివృద్ధి కి కృషి చేస్తానని ప్రొ. అనురాధ అన్నారు.

దళిత స్టడీ సెంటర్ ఫర్ దళిత్ సర్కిల్‌ను వినియోగించుకోవాలి

● దళిత స్టడీ సెంటర్‌ను పరిశీలించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ ఎస్‌పీఆర్ హిల్స్‌లో సెంటర్ ఫర్ దళిత్ సర్కిల్ ను తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. మొదటగా స్థానిక నాయకులతో కలిసి జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్ అండ్ బి అధికారుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ భవనానికి సంబంధించిన అన్ని పత్రాలను చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య అందించి వివరించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఎంతో విశాలవంతమైన అన్ని సౌకర్యాలతో రెండవ దళిత్ స్టడీ సర్కిల్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో రహమత్ నగర్ డివిజన్‌లో నిర్మించటం ఎంతో గొప్ప విషయమన్నారు. జి ప్లస్ సిక్స్ అంతస్తులులో నిర్మించడం జరిగిందని ఆరవ అంతస్తులో అద్భుతమైన లైబ్రరీ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండునట్లు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు డిప్యూటీ సీఎం కు వివరించారు. అనంతరం దళిత స్టడీ సర్కిల్ భవనంలోని అన్ని అంతస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని పనులు పూర్తి అయ్యాయని మే నెల మొదటి వారంలో దళిత స్టడీ సర్కిల్ ను ప్రారంభించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ సీఎస్ రెడ్డిమల్లు భట్టి విక్రమార్కకు మహిళా శక్తి భవన్, రహమత్ నగర్ బస్ స్టాండ్ సెంటర్లో జంక్షన్ ఇంప్రూవ్మెంట్, బీసీ వెల్ఫేర్ హాస్టల్, వాటర్ రిజర్వాయర్ ప్రారంభించుటకు తోడ్పాటును అందించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సెంటర్ ఫర్ స్టడీ సర్కిల్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బోరబండ ఇన్స్పెక్టర్ సురేందర్, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగోల్ మీరా, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొని బందోబస్తు ఏర్పాటు చేశారు.

నల్లాకు అక్రమంగా బిగించిన మోటార్లు స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటి నల్లాలకు మోటార్ల బిగించుకోవడం జలమండలి అధికారుల దృష్టికి వచ్చింది. దీని వల్ల మిగిలిన వినియోగదారులకు.. లో- ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతోంది. ఇలా చేయడం చట్ట రీత్యా నేరం. ఈ నేపథ్యంలో జలమండలి విజి లెన్స్ అధికారులు క్రమంగా తనిఖీలు నిర్వహి స్తున్నారు. జలమండలి పైపులైన్‌కు నేరుగా విద్యుత్ మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించి జలమండలి విజిలెన్స్ సిబ్బంది మోటార్లు సీజ్ చేశారు. శుక్రవారం రోజున ఓ అండ్ ఎం డివిజన్ నంబర్-2, మూసారాంబాగ్ సెక్షన్ పరిధిలోని శాలి వాహన నగర్ రోడ్ నంబర్ 12,13,14 ప్రాంతా ల్లో పర్యటించి పైపులైనుకు అక్రమంగా బిగించిన 8 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే వారిపై జలమండలి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5 వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించవద్దని జలమండలి విజ్ఞప్తి చేస్తోంది. ఒకవేళ తక్కువ ప్రెజర్‌తో నీరు సరఫరా అయినా, లేదా నీటి సరఫరాలో ఏవైనా ఇతర సమస్యలు తలెత్తి నా తమకు దగ్గరలోని సంబంధిత మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలని, లేదా జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తప్పకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యల్ని పరిష్కరిస్తారు.

అణగారిన వర్గాల శ్రేయస్సుకు పోరాడిన మహనీయుడు పూలే

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధరణ, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొనియాడారు. మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుల వివక్ష, లింగ అసమానతలకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధరణ, మహిళా విద్యా, సామాజిక సంస్కరణలకు మార్గదర్శకుడు, గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబా పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఆర్వో ఈ.వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

17న, పార్ట్ టైమ్ అధ్యాపకుల చలో సెక్రటేరియేట్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలోని 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న పార్ట్ టైమ్ అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ 17న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ సోమేశ్వర్, డాక్టర్ జానకి రెడ్డి డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ దశాబ్దాలుగా యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నియామకాల్లో పార్ట్ టైం టీచర్లకి ఎక్స్పీరియన్స్ కి వెయిటేజ్ కల్పించాలని, నియమకాల్లో పార్ట్ టైం టీచర్లకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో అన్ని యూని వర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బడుగు వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

నవతెలంగాణ-బేగంపేట

బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహా నాయకులు శ్రీ జ్యోతి రావు పూలే అని ఆయన ఆశయాలు భవిష్యత్తు తరాలకు ఎంతో ఆదర్శనీయమని ఆర్‌టీసీ బీసీ ఉద్యోగుల సికింద్రాబాద్ రీజియాన్ గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అన్నారు. జ్యోతి రావు పూలే జయంతి నీ పురస్కరించుకొని జేబీసీలోని కార్యాలయంలో జరిగిన ఆయన ప్రసంగించారు.1827 లో మహారాష్ట్రలోని పూణేలో జన్మించిన మహనుభావులు పూలేను నేటి వరకు మనం స్మరించుకోవడం చూస్తుంటే ఆయన చేసిన సేవలు ఎంత గొప్పవో మనకు అర్థమవుతుందని పవన్ కుమార్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు శ్రీ తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, రేణుక, రేజినయ్ అధ్యక్షులు సృజన కార్యదర్శి కృష్ణ పుష్పలత, పద్మపలువురు ఆర్‌టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే





టీవీఎఫ్ ఆధ్వర్యంలో పూలే జయంతి

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ విద్యార్థి ఫోరం(టీవీఎఫ్) ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ జేఏసీ నేత ఆశాడపు మధు మాట్లాడుతూ సామాజిక దార్శనికుడిగా, సంఘసంస్కర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేక పోరాటానికి బాటలు వేసి, వివక్ష లేని సమానత్వం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త మహనీయులు మహాత్మ జ్యోతి బా పూలే అన్నారు. సమాజంలో స్త్రీ అయినా పురుషుడు అయిన అందరూ స్వేచ్ఛగా జన్మించారన్నారు. ఈ కార్య క్రమంలో టీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎం శ్రీకాంత్ యాదవ్, జేఏసీ నాయకులు శ్రీకాంత్, బీసీ సంఘం నాయకులు లింగం గార్లు, పవన్, ప్రదీప్, నరేష్, ఉదయ్ ప్రవీణ్, సుమంత్, అనస్కాన్, పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో

నవ తెలంగాణ, ఓయూ:

మహాత్మ జ్యోతిరావు పూలే 198వ, జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం అడ్డగుట్ట సీపీఎం పార్టీ ఆఫీసు లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏం అజయ్ బాబు, బి శారద, శ్రీనివాస్, ఫాతిమా, వనిత పాల్గొన్నారు.

శారదా మల్లేష్ ఆధ్వర్యంలో

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి మెట్టుగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఆదర్శ్‌కుమార్ ఆధ్వర్యంలో దూద్ బాయ్ బస్తీలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గౌరవ దిశా కమిటీ సభ్యురాల శారదా మల్లేష్, కేఎం ప్రభుత్వ నరేష్ మాదిగ, యుద్ధ వీరు, దూద్ బాయ్ బూత్ అధ్యక్షులు మహేష్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యురాలు సరోజ బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, పాల్గొన్నారు.



ఘనంగా మహా కుంభాభిషేకం

నవతెలంగాణ బేగంపేట



మోండా డివిజన్‌లోని పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన మహా కుంభాభిషేకంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. 40 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మహా కుంభాభిషేకం శుక్రవారం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఎంతో వైభవంగా నిర్వహించిన పూజలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ చైర్మెన్ నర్సా రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు నాగులు, రాములు, మహేష్ యాదవ్, కిషోర్ కుమార్, జయరాజ్, ఆలయ సభ్యులు నరేందర్ రెడ్డి, గోవిందన్, నరేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై భారం మోపటం అన్యాయం

● సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ నాయకులు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కేంద్ర పభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ నాయకులు టి.సాయి శేషగిరిరావు, జాకటి స్వామి లు డిమాండ్ చేశారు. ఎస్‌పీఆర్ హిల్స్‌లోని చౌరస్తాలో శుక్రవారం పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడా పెట్టుబడిదారు లకు అనుకూలంగా లక్షల కోట్లు మాఫీ చేస్తూ, అంతే మొత్తంలో సబ్సిడీలు కూడా అందజేస్తూ, సామాన్యులపై ధరలు పెంచి భారాలు మోపటం అన్యాయమన్నారు. ముఖ్యంగా తెలంగాణలోని 91 లక్షల కుటుంబాలపై ఈ ధరల ప్రభావం ఉంటుందని తెలిపారు . అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతూ ఉంటే, మన దేశంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం ధరలు పెంచుకుంటూ పోతున్నదని, అప్పులు పాలైన దేశాన్ని ఈ పేదల మీద వేసిన, భారాలతో నింపుకోవాలని చూస్తున్నదని దుయ్యబట్టారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే దేశం మొత్తం ప్రజలు సుదీర్ఘ పోరాటాలు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెంచిన ధరలపై ఎటువంటి వ్యతిరేకత కూడా వ్యక్తం చేయడం లేదని, పన్నుల రూపంలో మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఎంతో కొంత మొత్తం అందుతుంది కాబట్టే వారు ఆ పని చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, దేవదాస్, భాగ్యరాజ్, ఏ ఆర్ నరసింహ ,బాలయ్య ,సోమల నాయక్, రాజశేఖర్, జైపాల్ ,మేస్త్రి బాలయ్య ,సిద్దు, వెంకటయ్య, కురుమయ్య ,చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే ఉద్యోగాలకు కొదవలేదు..

● ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. బాలకిష్టారెడ్డి



నవతెలంగాణ-ఓయూ

నేటి సమాజంలో ప్రతిభ విషయ పరిజ్ఞానం, సబ్జెక్టు ఉంటే ఉద్యోగాలకు కొదవ లేదని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొ.బాలకిష్టారెడ్డి అన్నారు. శుక్రవారం ఓయూ డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల బ్లీచ్ క్రిగ్ (బిజినెస్ యుద్ధ యంత్రం)లో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసంగిం చారు. టెక్నాలజీ ప్రపంచంలో ఉన్నదానిని ఉపయోగించు కొని ముందుకు సాగాలన్నారు. ఓయూ ఎంబీఏ విభాగంలో 60కి 50 మంది ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. ఈ విభాగలో ఉపాధి కల్పించే కోర్సులు నిర్వహించడాన్ని ప్రశంసించారు. ఇదే విభాగంలో పలువురు విద్యార్థులు సంవత్సరానికి రూ.16 లక్షల ప్యాకేజీ పొం దటం ఇక్కడి ఎంబీఏ విద్యా విధానంకి నిదర్శనమన్నారు. విద్యార్థులు జాబ్స్ ఇచ్చే లీడర్స్ గా, బిజినెస్ ఐకాన్స్ గా, కృషి చేయాలని అంతటి స్థాయికి ఎదగలన్నారు. ఓయూ వీసీ ప్రొ. యం.కుమార్ మాట్లాడుతూ ఎం బీఏ విద్యార్థులు రూ.16 లక్షలు కాకుండా రానున్న రోజుల్లో రూ.20 లక్షల ప్యాకేజీ తీసుకునే స్థాయికి ఎద గాలని కోరారు. ఈకార్యక్రమంలో విభాగం హెడ్ ప్రొ. వై. జహంగీర్ మాట్లాడుతూ విభాగం ఉన్నతిని ,ఇక్కడి అంది స్తున్న విద్యా విధానం, వివరించారు. ఈ కార్యక్రమంలో 700 మంది వివిధ ఎంబీఏ కళాశాలాల విద్యార్థులు పాల్గొన్నరాని చెప్పారు. కార్యక్రమంలో బిజినెస్ క్విజ్, బెస్ట్ మేనేజర్, ఎంటర్ ప్రైనర్, లాంటి పోటీలతో పాటుగా సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ. సత్యనారాయణ, పూర్వ విద్యార్థి డా.నాగయ్య, ప్రిన్సిపాల్ ప్రొ. శేఖర్, జ్యోత్స్న, హెడ్ ప్రొ. జహంగీర్, డా.వి. సమున్నత, డా.శ్రీరాములు, ప్రో.స్మిత సాంబ్రాణి, డా.విద్యా సాగర్, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలకు అండగా నిలబడదాం

● మాజీ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి



నవ తెలంగాణ, ఓయూ

ఓయూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతిని నిర్వహించి సామాజిక నిధి కార్యక్రమం నిర్వహించారు. బీటీఆర్ వర్ధంతి నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వరకు సామాజిక నిధి కార్యక్రమంలో భాగంగా జ్యోతిరావు జయంతి ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిర్వహించి, సామాజిక నిధి సేకరించారు. సామాజిక నిధిని ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ. కాసీం, ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రో.కొండ నాగేశ్వర్, సోషలజీ డిపార్ట్మెంట్ హెడ్ భీనమేని రామ్ షఫర్డ్ , ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రిసర్చ్ స్కాలర్ ఆర్.ఎల్.మూర్తి, అసిస్టెంట్ ప్రొఫె సర్సు విద్యార్థులు కార్మికులు సామాజిక నిధి ఇచ్చి సహకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఒక సామాజిక సంస్కర్త, విద్యావేత్త, భారతదేశంలో సామాజిక న్యాయం కోసం పోరాడిన మహెూన్నత వ్యక్తి అని అన్నారు. ఆయన ఉద్యమం ప్రధానంగా సామాజిక అసమానతలు, కుల వ్యవస్థ, అణగారిన వర్గాల (శూద్రులు, అతి శూద్రులు, మహిళలు) హక్కుల కోసం కేంద్రీకృతమై జరిగిం దన్నారు. ఆయన చేసిన కృషి, ఆదర్శాలు కూడా ప్రజలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. సామాజిక అణచివేతకు గురవుతున్న వర్గాలకు సామాజిక నిధి ఇచ్చి అండగా నిలబడుతూ సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఓయూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ యూని యన్(సీఐటీయు) ప్రెసిడెంట్ టి.మహేందర్, ప్రధాన కార్యదర్శి సీతారాం ఉపా ధ్యక్షులు శ్రీనివాస్ సహాయ కార్యదర్శినాగ, వెంకటేష్, లక్ష్మి. రాజు పాల్గొన్నారు.

ఓయూలో మండే ఎండల్లో కాంట్రాక్టు అధ్యాపకుల ర్యాలీ

నవతెలంగాణ, ఓయూ



తెలంగాణ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్‌ని రెగ్యులరైజేషన్ చేయాలని రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ నుండి పరిపాలనా భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. నరేష్ రెడ్డికు యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అందరూ యూనివర్సిటీ పదవులకు రాజీనామా పత్రాలను సమర్పించి తమ నిరసనలు వ్యక్తపరిచారు. ప్రభుత్వానికి యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులర్ చేయమని ప్రభుత్వానికి యూనివర్సిటీ వీసీ ఉత్తరం రాయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్‌ని రెగ్యులరైజ్ చేయకపోతే నిరవధిక సమ్మె ద్వారా యూనివర్సిటీలలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పరిపాలన భవన్ ఎదుట ధర్నా చేపట్టారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ పరుశరామ్, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ రేష్మా రెడ్డి, డాక్టర్ తాళపల్లి వెంకటేష్, డాక్టర్ ఓ. కృష్ణయ్య, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ టి.తిరుపతి,డాక్టర్ వినీత పండే, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ రజిని, డాక్టర్ అరుణ్, డాక్టర్ కిరణ్.డాక్టర్ రామలింగం, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ హరీష్, పాల్గొన్నారు.

'మహాత్మా జ్యోతిబా పూలే జీవితం.. ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయం'

● వీసీ ప్రొ. కుమార్ మొళుగరం



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వీసీ కుమార్ మొళుగరం, మహనీయుడు, సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో అణగారిన ప్రజలు కోసం చేసిన చిరస్మరణీయమైన కృషికి హృదయపూర్వకంగా నివాళులు అర్పించారు. ఓయూ మహాత్మా జ్యోతిబా పూలే పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో, ఏప్రిల్ 11న పూలే-అంబేద్కర్ సెంటర్ ఫర్ ఇన్‌క్లూసివ్ అండ్ ఎంపవర్మెంట్ స్టడీస్‌లో మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూలే కృషి వెనుకబడిన తరగతుల అభివృద్ధికి మార్గం వేసిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మహాత్మా జ్యోతిబా పూలే పరిశోధన కేంద్రం, ఓయూ డైరెక్టర్ డా. జి. ఉపేందర్ నిర్వహించారు. ప్రొ. జి. నరేష్ రెడ్డి (రిజిస్ట్రార్), ప్రొ. ఎస్. జితేందర్ కుమార్ నాయిక్ (ఓఎస్‌డి టు వీసీ), డా. హమీదా బీ (డైరెక్టర్, మైనారిటీస్ సెల్), ప్రొఫెసర్ ఐ. డైసీ (డైరెక్టర్, ఎస్సీ/ఎస్టీ సెల్), ప్రొ. జి. ప్రభాకర్ (ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్), ప్రొఫెసర్ సి.కాసీం (ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కాలేజ్), ప్రొఫెసర్ బి.లావణ్య (డీన్, అభివృద్ధి,యుజిసి వ్యవహారాలు), డా. కొండ నాగేశ్వర్ (సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్), డా. సిహెచ్. వెంకటేశ్వర్లు, ప్రొ. రాములు, ప్రొ. కృష్ణ కుమార్, ప్రొ. లింగప్ప, ప్రొ. రాజేందర్ నాయిక్, డా. యాదగిరి, డా. శ్రీనివాస్, డా. పి. హిమ బిందు, డా. రమేష్ బాబు, డా. నాగేశ్వర్ రావు, డా. సిహెచ్. వంశీధర్, రఘుపతి (డైరెక్టర్, ఈ.ఎం.ఆర్.సి.), విద్యార్థులు, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

చీకటి సమాజానికి వెలుగుదారి చూపిన సామాజిక విప్లవకారుడు పూలే



● ఓయూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద బ్లడ్ డొనేషన్ క్యాంప్

నవతెలంగాణ-ఓయూ

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ,ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు(విజృంభణ), విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. కొండ. నాగేశ్వర్, ప్రొ. రాములు,ప్రొ. మాయాదేవి, ప్రొ. బీనవేని రామ్ షఫర్డ్, ప్రొ. చలమల్ల.వెంకటేశ్వర్లు, హాజరై డొనేషన్ క్యాంపును ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచనను విద్యార్థుల అనుసరించాలని, సమాజంలో జరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రశ్నించాలని పోరాడాలన్నారు. చీకటి సమాజానికి వెలుగుదారి చూపిన సామాజిక విప్లవకారుడు పూలే అని అన్నారు. విద్యార్థులు మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల బాటలో నడవాలని ఆయన రాసిన గులాంగిరి పుస్తకాన్ని చదవాలని విద్యార్థులను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు రద్దు కోసం, వితంతు స్త్రీల పునర్ వివాహం కోసం కృషి చేశాడు. వారిని అన్ని విధాల ఆదుకోవడానికి, వారు మెరుగైన జీవితాన్నికి వితంతువలకు ఆశ్రమాన్ని స్థాపించాడు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పరిశోధక విద్యార్థి ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల్లో కనుగుణంగా విద్యార్థులు ఉద్యమించాలని నేటి పాలకులు మహనీయుల ఆశయాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ప్రధానంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి మనుధర్మ శాస్త్రాన్ని దేశంలో అమలు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ. మహాత్మ జ్యోతిరావు పూలే నేటి విద్యార్థులకు ఆదర్శమని, మహాత్మ జ్యోతిరావు పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరు చదవాలని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి అంటే దండలు వేసి దండం పెట్టడమే కాదని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాల్సిన బాధ్యత కూడా విద్యార్థులపై ఉందని బ్లడ్ డొనేట్ చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడుతున్నటువంటి వారికి, ఇతర అనారోగ్యానికి గురైన వారికి ఉపయోగపడుతుందని అన్నారు.బ్లడ్ డొనేషన్ క్యాంపు కి విద్యార్థులు, టీచర్స్ పెద్ద మొత్తంలో హాజరై బ్లడ్ డొనేట్ చేశారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్యు విజృంభణ రాష్ట్ర కార్యదర్శి విజయ్, ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు, అజయ్ ,క్రాంతి, పీఎస్ కుమార్, కరణ్,మహేష్,సతీష్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాచారంలో ఫూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద, రాఘవేంద్ర నగర్ లో పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పూలే సేవలు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని కార్పొరేటర్ కొనియాడారు. పలువురు స్థానిక కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను జీహెచ్ఎంసీ రూ. 2000 కోట్లు టార్గెట్ వసూలు మైలు రాయిని అధిగమించి అదనంగా 38 కోట్లు వసూలు చేసినందుకుగాను ప్రాపర్టీ టాక్స్ సిబ్బందికి కమిషనర్ ఇలాంబర్తి అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కాప్రా సర్కిల్‌కు ఇచ్చిన రూ. 61.19 కోట్ల టార్గెట్ కి అదనంగా రూ. 41 లక్షలు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసి 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 61.60 కోట్లు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేసినందుకు కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌ను అభినందించారు. ప్రాపర్టీ టాక్స్ అధికంగా వసూలు చేసిన, ఏఎంసీ నాగార్జున, టాక్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్,బిల్ కలెక్టర్ సత్యనారాయణలను ప్రశంసిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు.

నవతెలంగాణ-కాప్రా

ప్రభుత్వ స్థలాల వివరాలు
డిజిటలైజేషన్‌కు సిద్ధంగా ఉండాలి

- తిరుమలగిరి మండలం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక
- 22న సీజీజీ నిర్ణీత యాప్‌లో భూముల వివరాలు అప్‌లోడ్
- రెవెన్యూ అధికారులు లక్ష్యం నిర్దేశించుకుని పని చేయాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నిర్ణీత యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని.. ల్యాండ్ బ్యాంక్, ప్రభుత్వ భూముల కేటాయింపులు తదితర 20 అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ రికార్డ్ నిర్వహణలో రెవెన్యూ అధికారుల పాత్ర చాలా ముఖ్యమైనదని, అధికారులు లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అప్‌డేట్ చేసి వివరాలను డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం వేరే శాఖలకు ఇచ్చిన భూములు వినియోగంలో ఉన్నవి ఎన్ని, వినియోగంలో లేనివి ఎన్ని, ఖాళీగా ఉన్నవి ఎన్ని అని గుర్తించి ఆక్రమణల గురికాకుండా ఉండేందుకు వివరాలను డిజిటలైజేషన్, అప్‌డేషన్ చేయాల న్నారు. ఈనెల 22న పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి మండలంలో చేపట్టాలనీ, జిల్లాలోని మిగతా మండలాలలో చేపట్టేందుకు తహసీల్దారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.ముకుంద రెడ్డి, డీఆర్వో ఈ. వెంకట చారి, ఆర్డీవో సాయి రాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీరాం, ఈడీఎం రజిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి : ఐద్వా



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి, నగర అధ్యక్ష కార్యదర్శులు ఏ పద్మ,వై.వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ తరపున గోల్కొండ ఎక్స్ రోడ్డులో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పేదలపై పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ పెను భారాలు మోపుతోందని, ఒకవైపు నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు పోషకాహారం తీసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా గ్యాస్ ధర పెంచడం పెను భారం మోపడమేనని అన్నారు. అచ్చేదిన్ అని ప్రభుత్వం చెప్పేది ఆదానీ అంబానీలకు మాత్రమేనని పేద మధ్యతరగతి ప్రజలపై పెను భారాలు మోపి బడా కార్పొరేట్ లకు ప్రభుత్వం కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు నగర నాయకులు శారద, పీ.విమల, లక్ష్మీవెంకటమ్మ,రాధిక,లత,రోజా పాల్గొన్నారు

ఇంగ్లీష్ మీడియం బ్రోచర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

చిలకలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంగ్లీష్ మీడియం బ్రోచర్‌ను శుక్రవారం టెస్ట్ స్పాట్ కేంద్రం సెయింట్ మేరీ స్కూల్‌లో హైదరాబాద్ జిల్లా విద్యాశాధికారిణి ఆర్.రోహిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ చిలకలగూడ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నామనీ, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అనుభవం కలిగి ఉపాధ్యాయులతో పాటు ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది విద్య సంవత్సరం నుంచి 50పైన విద్యార్థులు ఉన్న బడుల్లో ఏఐ ద్వారా కంప్యూటర్ విద్యను అందిస్తామన్నారు. ఈ మండల ప్రాంత ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించాలనీ, జిల్లాలోని ప్రజలంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని డీఈవో తెలిపారు. సికింద్రాబాద్ డిప్యూటీ ఈవో శ్రీధర్, మారేడుపల్లి డిప్యూటీ ఐవోఎస్ మదన్ మోహన్ రెడ్డి, మారెడుపల్లి నోడల్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, పాఠశాల హెడ్ మాస్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యా య బృందం సాలెహా, షహీన్ సుల్తానా, పుష్పలత, ఉమా, గీత ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే 199 వ జయంతి వేడుకలను శుక్రవారం సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలోసికింద్రాబాద్ కోర్టులో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఓబీసీ లాయర్స్ జేసీ చైర్మన్ తలకొక్కుల రాజు పాల్గొని మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. అంటరానితనం, కుల వివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పూలే తన భార్య సావిత్రి బాయి పూలేతో కలిసి మహిళా విద్యకు కృషి చేశారని తెలిపారు. మహిళా విద్యను ప్రోత్సహించడానికి దేశంలోనే మొట్టమొదటిసారిగా తొలి బాలిక పాఠశాలలను ప్రారంభించారన్నారు. జ్యోతిబాపూలే జీవిత చరిత్రను భావితరాలకు తెలియచేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఉపాధ్యక్షులు జి.మల్లికార్జున్ మాట్లాడుతూ ఈ దేశంలో కుల వ్యవస్థకు వ్యతిరేకంగా అంటరానితనానికి పోరాడిన యోధుడు పూలే అని అన్నారు. ప్రధాన కార్యదర్శి నాగులపల్లి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి జ్యోతిబాపూలేను మార్గదర్శకంగా తీసుకొని ఆయన ఆశయాలకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లాయర్లు చిట్టబోయిన బాల మల్లేష్ యాదవ్, నవీన్ రెడ్డి, కొమరయ్య, బాలు నాయక్, వెంకటరమణ, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ఒక దార్శనిక సామాజిక సంస్కర్త



నవతెలంగాణ-అంబర్‌పేట

జ్యోతిబా పూలే ఒక దార్శనిక సామాజిక సంస్కర్త, ఆలోచనాపరుడు, 19వ శతాబ్దపు భారతదేశం లో కుల వివక్షను సవాలు చేయడంలో, మహిళా విద్య కోసం వాదించడంలో కీలక పాత్ర పోషించా రని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ప్రముఖ సంఘ సంస్కర్త జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్, అంబర్‌పేట అలీ కేఫ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి డాక్టర్ దిడ్డి సుధాకర్, డా. అన్సారీ, సుధారాణి, భాస్కర్, శహబాజ్, ధర్మేంద్ర తివారి, రాకేష్ రెడ్డి, రాకేష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ జ్యోతి రావు పూలే అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. భారతదేశంలో ప్రగతిశీల సామాజిక సంస్కరణ ఉద్యమాలకు పునాది వేసిన జ్యోతిబా పూలే ఆశయ సాధనకై కృషి చేస్తామని డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు.

జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివి

- సీపీఐ (ఎం) నాయకులు మల్లేష్



నవతెలంగాణ-మెహదీపట్నం

జ్యోతిరావు పూలే సమాజానికి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ(ఎం) నాంపల్లి జోన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతిని మెహదీపట్నంలోని మల్లేపల్లి కమిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల కోసం నిరంతరం పనిచేశారన్నారు. సమాజంలో పీడిత ప్రజల కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బి.శంకర్, సిహెచ్ వెంకట్ స్వామి, డి.లక్ష్మణ్, డి.యాదమ్మ సువ్వులమ్మ, రాని, రీటా, లతా, బాబాయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్‌తో ఫలితాలు సూపర్

- గతేడాదికంటే రూ. 121 కోట్లు అధికం
- సమిష్టి కృషితో ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ కొత్త రికార్డు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆస్తిపన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రికార్డ్ స్థాయిలో అద్భుతమైన వసూళ్లను సాధించి చరిత్ర సృష్టించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. రూ. 2 వేల కోట్లకు పైగా ఆస్తిపన్ను వసూలు చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు బాగా పని చేశారన్నారు. జీహెచ్ఎంసీకి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో ఆస్తి పన్ను వసూలైన నేపథ్యంలో అందుకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏ.ఎం.సీలు, డిప్యూటీ కమిషనర్లకు శుక్రవారం బంజారా హిల్స్ లోని బంజారా భవన్ లో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ వసూలు కానంతగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం లక్ష్యాన్ని మించి పన్ను వసూలు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పన్ను వసూలు ఎంత ఎక్కువగా వస్తే ప్రజలకు అంత బాగా సేవలు అందించవీలుంటుందన్నారు. ఎన్నో అభివద్ధి పనుల ద్వారా ప్రజలకు మౌలిక వసతులు కల్పన, సుస్థిర అభివృద్ధి జరగాలంటే పన్నుల వసూలు సవ్యంగా కావాలన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అమలుతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. అధికారులు, ఆయా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ



తీసుకుని పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించడంతో ఈ ఏడాది అత్యధికంగా పన్ను వసూలైందని తెలిపారు. పూర్తి బాధ్యత, శ్రద్ధతో పన్నుల వసూళ్లలో భాగస్వాములైన వివిధ కేటగిరీ ఉద్యోగులు, అధికారులను ప్రతి ఒక్కరిని ఈ సందర్భంగా కమీషనర్ అభినందించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రూ. 121 కోట్లకు పైగా ఆస్తిపన్ను అదనంగా వసూలైందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023-2024లో ఆస్తి పన్ను రూ. 1917 కోట్లు వసూలు కాగా, 2024-2025 ఆర్థిక సంవత్సరం 2038 కోట్ల రూపాయలకు పైగా పన్ను వసూలైందన్నారు. ఎస్టేట్ విభాగం నుండి కూడా ఈ సంవత్సరం రెవెన్యూ పెరిగిందని తెలిపారు. అత్యధికంగా పన్ను వసూళ్లు చేసిన బిల్ కలెక్టర్లకు, ట్యాక్స్ కలెక్షన్ ఇన్‌స్పెక్టర్లకు, డిప్యూటీ కమిషనర్లకు, ఏ.ఎం.సి లకు, జోనల్ కమిషనర్ లకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేసి కమీషనర్ అభినందనలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గాను రూ. 3వేల కోట్లు ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల అంచనా లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, వేణుగోపాల్ రెడ్డి, రఘు ప్రసాద్, వేణుగోపాల్, స్మ్రాట్ అశోక్, సరోజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్ రెడ్డి, రవికిరణ్, వెంకన్న, సీసీపీ శ్రీనివాస్, జాయింట్ కమిషనర్ మహేష్ కులకర్ణి, డిప్యూటీ కమిష నర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏ.ఎం.సిలు, బిల్ కలెక్టర్లు, ఐటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యను ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత పూలే

- సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మీసాల శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

అణగారిన వర్గాల కోసం విద్యను ఆయుధంగా మలచిన సామాజిక ఉద్యమ నేత పూలే అని, దోపిడీ రహిత సమాజం కోసం జీవితాంతం ఉద్యమించిన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మీసాల శ్రావణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యదర్శివర్గ సభ్యులు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా చిత్ర పటానికి ఆయనతో పాటు పార్టీ జిల్లా నాయకులు, మహేష్ దుర్గే లతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనువాదం, సామాజిక దురాచారాలకు, కుల వివక్షతకు వ్యతిరేకంగా సంస్కరణ ఉద్యమానికి పూలే శ్రీకారం చుట్టారన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సనాతన ధర్మం పేరుతో మనువాదాన్ని ముందుకు తీసుకువచ్చి మహిళలను వంటింటికి పరిమితం చేయాలని కుట్ర చేస్తుందన్నారు. మతోన్మాదం రెచ్చగొట్టే బీజేపీ ప్రయత్నాలను తిప్పి కొట్టడమే పూలేకు మనం ఇచ్చే ఘనమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే..

- సీఐటీయూ సౌత్ జిల్లా ఉపాధ్యక్షులు కె.జంగయ్య



నవతెలంగాణ-ధూల్‌పేట్/సుల్తాన్‌బజార్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతి రావు పూలే అని సీఐటీయూ సౌత్ జిల్లా ఉపాధ్యక్షులు కె.జంగయ్య అన్నారు. ముక్తార్ గంజ్, మహారాజ్ గంజ్, దాల్ మార్కెట్ హమాలీ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై యూనియన్ హమాలీ కార్మిక నాయకులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యోతి రావు పూలే స్త్రీల విద్యా పట్ల, వెనుకబడిన వర్గాలకు చేసిన కృషిని ఆయన కొనియాడారు. ఆయన ఆశయ సాధన ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ముక్తార్ గంజ్ మహారాజ్ గంజ్ దాల్ మార్కెట్ హమాలి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్. సాయిలు , పి. చెన్నయ్య, కోశాధికారి జి.నర్సింహ్మ ఉపాధ్యక్షులు పి.కుర్మయ్య , సత్యనారాయణ , సహాయ కార్యదర్శి నిరంజన్, బాల్ రాజు, ఉప్పలయ్య , కన్ కేష్ గణేష్ , గణపతి , సంతు , సంతోష్, నర్సింహ్మ, ముత్యాలు, శ్రీను, వెంకటేష్ , రాములు , తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ కూలర్ అందజేత

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



సుల్తాన్ బజార్ బాలికల ప్రభుత్వ పాఠశాలకు వాటర్ కూలర్‌ను శ్రీ జైన్ సేవా సంఘ్ మహిళా విభాగం ప్రెసిడెంట్ సీమ షీల్ కుమార్, జైన్ సెక్రటరీ రెమా జైన్‌లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుష్మితకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే

- మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

మహాత్మ జ్యోతిరావు పూలే ఒక గొప్ప సామాజిక న్యాయ సంఘకర్త, కుల వివక్షతపై పోరాడిన గొప్ప మేధావి అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ అన్నారు. పూలే 198వ జయంతిని సంతోష్ నగర్ సీఐటీయూ కార్యాలయంలో పూలమాలతో సత్కరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన వర్గాల కోసం పోరాడిన గొప్ప మహానీయుడన్నారు. ఆయన స్ఫూర్తితో మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. వాటిని తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కార్మిక చట్టాలను రక్షించుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకి రూ. 26 వేలు 8 గంటల పని దినాలను అమలు పరచాలన్నారు. ఈఎస్ఐ, పీఎం సౌకర్యాలను పని భద్రత కల్పించాలన్నారు. పలు డిమాండ్లతో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగా మే 20న సంతోష్ నగర్ లో సీఐటీయూ కార్యాలయం నుండి కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, లక్ష్మయ్య, బిక్షపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన లంబాడీలకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలి'



- గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో జరిగే క్యాబినేట్ విస్తరణలో గిరిజన లంబాడీ సామాజిక వర్గంలో ఒకరికి మంత్రి పదవి కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు సమాఖ్యల రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆమోదించిన పలు తీర్మానాలను శుక్రవారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ ప్రకటించి మాట్లాడారు . నియోజకవర్గాల పునర్విభజనలో గిరిజన జనాభాను రాష్ట్ర యూనిట్ ప్రాతిపదికన కాకుండా జిల్లాల ప్రాతిపదికన విభజించి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశం కల్పించాలని, రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను వేర్వేరుగా విభజించి గిరిజనుల కోసం స్వయంప్రతిపత్తికతో కూడిన ఎస్టీ కమిషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజనులు నివసిస్తున్న గ్రామపంచాయితీలను రెవిన్యూ గ్రామ పంచాయితీలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని, గిరిజన, ఆదివాసీలకు స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దినేష్ నాయక్, రాష్ట్ర నాయకులు వెంకటేష్ నాయక్, హరిలాల్ నాయక్, రాము నాయక్, ముని నాయక్, స్వామి నాయక్, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తాం

సెంట్రల్ జోన్ డీసీపీ కే.శిల్పవల్లి



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తామని సెంట్రల్ జోన్ డీసీపీ కే.శిల్పవల్లి తెలిపారు. శుక్రవారం హనుమాన్ జయంతికి సంబంధించి వీర హనుమాన్ విజయ యాత్ర దృష్ట్యా సెంట్రల్ జోన్ శాంతి కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల స్థానిక నాయకుల తో శాంతి కమిటీ సమావేశం ముషీరాబాద్‌లోని ఒక్క ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి సెంట్రల్ జోన్ డీసీపీ కే.శిల్పవల్లి మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించాలని మతసామరస్యాన్ని ప్రతీకగా ఈ వేడుకలు ఉండాలన్నారు. డీజే సిస్టమ్‌లు, అధిక-వాల్యూమ్ యాంప్లిఫైయర్‌లను ఉపయోగించడం మానుకోవాలని సలహా ఇచ్చారు. భక్తి భావంతో విజయ యాత్ర ర్యాలీలు నిర్వహించాలని ప్రజలు ఒకే చోట గుమ్మి కూడకుండా నిర్వాహకులు పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శోభాయాత్ర నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు వారికి సహకరిస్తూ త్వరగా విజయ యాత్ర పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, శాంతి కమిటీ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉదయశ్రీ,ఎం చంద్ర శేఖర్,మహ్మద్ అలీ,మహ్మద్ మూసా, తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'13న మైనార్టీ వక్ఫ్ బచావో మార్చ్'

- మార్చ్‌కు పలు విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

13న మైనార్టీ వక్ఫ్ బచావో మార్చ్‌కు తెలంగాణ విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ విద్యార్థి జేఏసీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో 13న ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే మార్చ్, ధర్నాకు బహుజన సంఘాలు మద్దతు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డా.వెంకటేష్ చౌహన్ మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వ విధానాలు పేద వర్గాలకు వ్యతిరేకంగా ముఖ్యంగా ముస్లింల భూములు, ఆస్తుల దోపిడీకి పాల్పడుతుందని, ఆదానీ, అంబానీలకు దేశ సంపదను కట్టబెడుతూ దేశాన్ని వారి పర్సనల్ వ్యక్తులకు అమ్మేస్తుందని ఆరోపించారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మెన్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెం టనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటు వంటి నిర్ణయం సరైంది కాదన్నారు.ఇలాంటి సమయంలో పేద వర్గాలందరూ ఐక్యంగా ముస్లిం మైనార్టీల పక్షాన నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐతరాజు అభేందర్, వక్ఫ్ బచావో మార్చ్ కో-ఆర్డినేటర్ ఖదీర్ ,తెలంగాణ మాదిగ యూత్ ఫోర్స్ అధ్యక్షులు రమేష్, దక్కన్ వర్క్స్ ప్రొడక్షన్స్ సొసైటీ నజీర్ సలీం మక్బూల్, తెలంగాణ ఎరుకల సంఘం నాయకులు రాజేష్, మాదిగ విద్యార్థి జేఏసీ ఓయూ ప్రెసిడెంట్ జోగు గణేష్, శ్రీమాన్, వడ్డెర సంఘం నాయకులు మహేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూలే జయంతి వేడుకలు

నవతెలంగాణ-అంబర్‌పేట



మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా అంబర్‌పేట డివిజన్ అలీకేఫ్ చౌరస్తాలో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించిన అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అంటరానితనం కులవివక్ష నిర్మూ లన కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు,సమాజంలో సగమైన మహిళలకు సమాన హక్కులు కల్పించాలని గలవెత్తిన యుగపురుషుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరా జ్, సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి జాఫర్, అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, నాయకులు తదితరులున్నారు.



నవతెలంగాణ-అంబర్‌పేట

జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకొని అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో అలికేఫ్ చౌరస్తా లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగభూషణం చారి, నవీన్ రెడ్డి, దయాకర్ యాదవ్, భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, ఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

మహాత్మ జ్యోతి బా పూలే జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ నియోజకవర్గంలోని పలు జ్యోతిబా పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్య తోనే ఈ దేశంలో మార్పు సాధ్యమైతది అని చెప్పిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు జెల్ల బిక్షపతి, రాజేష్, నాగ సాయి, శ్రీనివాస్, సుదర్శన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో కుల గణన చేయాలి

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

నవతెలంగాణ-ముషీరాబాద్



దేశ వ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో కుల గణన చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాల గౌని, బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలీ వెంకన్న గౌడ్‌లు డిమాండ్ చేశారు. బీసీల ఆరాధ్యుడు, గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జోతిబాపూలే అని ఆయన ఆశయ సాధన కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. శుక్రవారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో జోతి బాపూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో బీసీల మహా గర్జన చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్, వివిధ సంఘాల నాయకులు సూగూరి దుర్గయ్య గౌడ్, కోల శ్రీనివాస్,గడ్డ మీది విజయకుమార్ గౌడ్, బైరి శేఖర్, బాలగౌని వెంకటేష్ గౌడ్, సింగం నగేష్ గౌడ్, కోయడ హర్షవర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పుస్తకాలు మధ్య తరగతి విద్యార్థులకు దోహదం..

నవతెలంగాణ-ధూల్‌పేట్



గ్రంథాలయ పుస్తకాలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు దోహదపడతాయని యునైటెడ్ వే హైదరాబాద్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల, గ్రంథాలయశాఖ విభాగానికి లక్ష రూపాయల విలువచేసే కంప్యూటర్ శాస్త్ర పుస్తకాలు "యునైటెడ్ వే హైదరాబాద్" అనే ఎన్జీవో సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ , ఈ జన్ సంస్థతో ఉచితంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా మా సంస్థ ద్వారా గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తామ ని మధ్యతరగతి విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. టీఎస్ కేఎస్సీ విభాగానికి రెండు కంప్యూట ర్లని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపప్రచార్యులు డాక్టర్. శాంతి, డాక్టర్.మల్లికార్జున్, డాక్టర్ రవికుమార్ చేగోని, డాక్టర్ శారద, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుని స్ఫూర్తిని కొనసాగిద్దాం


నవతెలంగాణ-ధూల్‌పేట్



భారతదేశ సర్వతోముఖ అభివృద్ధికి తమ జీవితాన్ని ధారపోసిన మహనీయులు స్ఫూర్తితో విద్యార్థులు ముందుడగు వేయాలని కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన మహనీయుల స్మరణలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. మహాత్మా పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ , జగ్జీవన్ రామ్‌లు జీవితంలో అనేక కష్ట నష్టాలు భరించి జాతిలో విజ్ఞాన దీపాన్ని వెలిగించారని చెప్పారు. అణగారిన మహిళల విద్యతోనే సామాజిక ప్రగతి వేగవంతమవుతుందని గ్రహించి అందు కోసం ఎన్నో పాఠశాలలు స్థాపిం చిన జ్యోతి రావు పూలే, సావిత్రీ బాయి పూలే సామాజిక వైతాళికులని కొని యాడారు. అనంతరం ముఖ్య అతిథి పసునూరి రవీందర్‌ను సామాజిక శాస్త్ర అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి, డాక్టర్.శంకర్, డాక్టర్.కృష్ణవేణి, డాక్టర్.కె భాస్కర్, డాక్టర్.శ్రీనివాస్, డాక్టర్.తిరుపతి, డాక్టర్. కోటేశ్వర రావు, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'సామాజిక మార్పు కోసం అహర్నిశలు పాటుపడిన పూలే దంపతులు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



సామాజిక మార్పు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల సాధికారత కోసం మహాత్మ జ్యోతిబా పూలే దంపతులు అహర్నిశలు పాటు పడ్డారని ఓబీసీ ఇంట లెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ కొనియాడారు. సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతిని పురస్కరించుకొని హైదర్ గూడ చౌరస్తాలో పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళల సాధికారిత కొరకు పూలే దంపతులు ఎంతో కృషి చేశారన్నారు. విగ్రహాల దాత, ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం జాతీయ అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ రాజు, ఎర్ర శ్రీహరి గౌడ్, సరికొండ రామకృష్ణంరాజు, బీసీ సంక్షేమ సంఘం కార్య నిర్వా హక అధ్యక్షులు శివకుమార్, భిక్షపతి గౌడ్, నరసింహులు గౌడ్, అనంతుల ప్రసాద్ గౌడ్, రవికుమార్ యాదవ్, ఉపేందర్, కొత్త వినయ్ బాబు, అక్షిత్ జైస్వాల్, విశ్వపతి తదితరులు పాల్గొన్నారు.

'భారతదేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన పూలే'

- శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



భారతదేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన జ్యోతిరావు పూలే అని శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్ పావని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం హిమాయత్ నగర్ లోని ఫోరం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆనాడు దేశంలో కొనసాగుతున్న ఆధిపత్య రాజకీయాలను ప్రశ్నిస్తూ అందరికీ చదువుకునే హక్కు కావాలని విద్య ద్వారా మాత్రమే సమాజంలో సమూలమైన మార్పులు వస్తాయని భావించిన జ్యోతిరావు పూలే అనేక పాఠశాలలో నెలకొల్పారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ ఆధిపత్య బ్రాహ్మణీయ భావజాల కుట్రలకు బలైన క్షేత్రపతి శివాజీ చరిత్రను తెలుసుకున్న జ్యోతిరావు పూలే స్వయంగా ఆయన సమాధికి దగ్గరికి వెళ్లి ఆయన రైతు బాంధవుడని అనేక కవితల ద్వారా చాటి చెప్పుతూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల రాజ్ కుమార్, జేరిపోతుల కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టు కింది శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చైతన్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కళ్యాణ్, విద్యార్థి నాయకులు అనిల్, అరుణ్, వంశీ, కార్మిక నాయకులు రాము, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగర్ డివిజన్‌లో



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతి బా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్, బీజేపీ సికింద్రా బాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొని పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ ఆయన సేవ దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకొని సంగసంస్కరణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్,సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్,సత్తి రెడ్డి,ప్రకాష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, ధోనేటి సత్యం,శ్రీనివాస్, సాయి కుమార్,సంయుక్తారాణి తదితరులు పాల్గొన్నారు.

భార్యా భర్తలకు సంబంధించిన విషయాల్లో ఇతరుల ప్రమేయం అవసరమా లేదా? ఒక వేళ ఉన్నా ఎంత వరకు ఉండాలో అంత వరకే ఉండాలి. అలా కాదు అని ప్రతి విషయంలో కలగజేసుకుంటే చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. దాంతో సమస్యలు మరింత ఎక్కువవుతాయి. వాళ్ళు కూడా తమ విషయాలు మరొకరితో చెప్పకునే ముందు వారికి ఎంత వరకు చెప్పాలో అంతే చెప్పాలి. అది కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచించి పంచుకోవాలి. అలా కాకుండా అన్ని విషయాలు ఇతరులకు చెప్పకుంటే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయో ఉదాహరణే ఈ వారం ఐద్వా అదాలత్...



ఇతరుల జోక్యం అవసరమా..?

లతకు ఆకాష్‌తో పెండ్లి జరిగి పదేండ్లు అవుతుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ పదేండ్లలో భార్యా భర్తల మధ్య బంధం ఎలాగుంది అంటే బాగానే ఉందని చెప్పలేము, అలాగని బాగోలేదని కూడా చెప్పలేము. ఎందుకంటే వాళ్ల సంతోషంగా ఉంటే ఇక్కడి వరకు వచ్చే వారు కాదు కదా! ఆకాశ్ తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని భార్యతో కాకుండా ఇతరులతో చెబుతుంటాడు. లతతో తనకు ఎలాంటి సమస్య వచ్చినా వాటి గురించి కూడా వేరే వాళ్లకు చెబుతుంటాడు. ఆ విషయాలన్నీ వాళ్ల వచ్చి లతకు చెబుతారు. వాళ్ల వచ్చి చెప్పే వరకు ఆకాష్‌కు ఏం కావాలో లతకు తెలిసేది కాదు. ఆ మూడో వ్యక్తి కుటుంబంలో ఒకరు అయితే పెద్దగా ఇబ్బందులు ఏమీ వుండేవి కావు. కానీ అలా కాకుండా అతను స్నేహితులతో మాట్లాడడం, వాళ్ల వచ్చి 'మీరు ఆకాష్‌ను సరిగ్గా చూసుకోవడం లేదు. పెండ్లి జరిగి పదేండ్లు అయినా ఇంకా మేము వచ్చి ఈ విషయాలు చెప్పడం ఏం బాగోలేదు. కానీ మాట్లాడక తప్పడం లేదు. మీలో మార్పు వస్తుందని ఆకాష్‌తోపాటు మేము కూడా ఎదురు చూస్తున్నాము. కానీ మీలో ఎలాంటి మార్పూ లేదు. పైగా మీ వల్ల ఆకాష్ రోజురోజుకు కుంగిపోతున్నాడు. అతనికి ఇక మీతో కలిసి ఉండటం ఇష్టం లేదు. విడిపోవాలని అనుకుంటున్నాడు. వారం పది రోజుల్లో నోటీసులు పంపిస్తా డంటా. అందుకే మేము ఈలోపు మీతో మాట్లాడాలని వచ్చాము. భార్యాభర్తలు విడిపోతుంటే భరించలేక మేము మీతో ఈ విషయాలన్నీ చెబుతున్నాం' అని చెప్పారు.

'అసలు సమస్య ఏంటీ? ఎందుకు అతను నా నుండి విడిపోవాలని అనుకుంటున్నారు' అనే విషయం నాకు తెలియాలి కదా! ఆకాష్ ఇంటికి వచ్చిన తర్వాత లత అడిగితే నోరు తెరిచి సమాధానం చెప్పడు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక ఆమె ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చింది.

మేము విషయం తెలుసుకుందామని ఆకాష్‌కు ఫోన్ చేసి పిలిపిస్తే అతను చెప్పింది ఏంటంటే... 'లతకు ఒక్క పని కూడా సరిగ్గా రాదు. వంట చేయడానికి చాలా టైం తీసుకుంటుంది. ఈ విషయం మా అమ్మకు, అక్కకు చెబితే మెల్లిగా నేర్చుకుంటుందిలే అంటారు. అంతే కానీ ఆమెను గట్టిగా అస్సలు అడగరు. అమ్మ చాలా సార్లు లతకు ఇంటి పనిలో, వంట పనిలో సాయం చేస్తుంది. నేర్పించడానికి ప్రయత్నం చేసింది. ఇప్పుడు కాస్త పర్వాలేదు. ఇల్లు శుభ్రంగా పెట్టుకోదు. అందుకే ఒక పనమ్మాయిని పెట్టుకున్నాము. ఇక ఆమెకు వుండేది ఒక్క వంట పని మాత్రమే. అది కూడా సరిగ్గా చేయదు. ఆఫీస్ నుండి 7 గంటలకు ఇంటికి వస్తుంది. రాగానే పని మొదలుపెట్టదు. కొద్ది సేపు కూర్చొని టీ తాగి పిల్లల హోం వర్క్‌లో సాయం చేసి మెల్లిగా అప్పుడు వంట చేస్తుంది. పిల్లలు తిని 9 గంటలకు పడుకుంటారు. పిల్లలను ఎనిమిది గంటల కల్లా పడుకోబెట్టమని నేను ఎన్నో సార్లు చెప్పాను. అయినా నా మాట వింటే కదా! ఈ విషయాలే నా స్నేహితులతో పంచుకుంటాను. ఇద్దరం కలిసి ఎక్కడికైనా బయటకు వెళదామంటే రాదు. ఆఫీసుకు సెలవు, పిల్లలకు సెలవు ఉన్న రోజుల్లోనే వెళదామంటుంది. ఈ విషయమే అక్కతో చెప్పాను. ఆమె వచ్చి చెప్పినా వినదు. ఇంటి కోడలు ఇంటి ఆడపడుచు చెప్పిన మాట వినాలి కదా! అయినా మా అక్క నాకు కాకుండా ఆమెకే సపోర్ట్ చేస్తుంది. ఇంట్లో ఏ ఒక్కరూ నాకు సపోర్టు చేయరు. అమ్మా, అక్కా చివరకు పిల్లలు కూడా ఆమెకే సపోర్ట్. అందుకే నేను నా బాధలు నా స్నేహితులకు చెప్పకుంటాను. లత మాత్రం నన్ను అర్థం చేసుకోవడం లేదు. అందుకే ఆమెక విడాకులిచ్చి నేను చెప్పినట్టు వినే ఆమెను పెండ్లి చేసుకుందామనుకుంటున్నాను' అన్నాడు.

దానికి లత 'ఆకాష్ నాతో అస్సలు ఏమీ మాట్లాడడు. మా అత్తయ్యనే ఇంట్లో వంట చేయడం గురించి, ఏదైనా పని గురించి నాతో మాట్లాడుతుంది. ఆకాష్ మాత్రం నాకు అది నచ్చలేదు, ఇదైతేనే ఇష్టం అని నాతో ఎప్పుడూ చెప్పలేదు. బయటకు ఎక్కడికైనా ట్రిప్ ప్లాన్ చేసేటప్పుడు ముందు నాకు చెబితే కదా ఆఫీస్‌లో లీవ్ తీసుకోడానికి. కానీ నాకు ముందు చెప్పడు. అలాంటప్పుడు నాకు సెలవులు ఎలా ఇస్తారు. ఇలా నాతో ఏమీ చెప్పకుండా అన్నీ తన స్నేహితులకు చెప్పుకుంటే నాకెలా అర్థమవుతుంది. పెండ్లయి పదేండ్లు అవుతుంది. ఇప్పటి వరకు ఆయన ఇష్టాఇష్టాలు కూడా నాకు తెలియదు. ఏ విషయం అయినా వాళ్లకు చెబుతాడు. చివరకు మా ఫిజికల్ లైఫ్ గురించి కూడా తన స్నేహితులతో పంచుకుంటున్నాడు. ఆ విషయంలో అయినా నా ఇష్టం గురించి అడగడు. అసలు ఆయనకు నేనొకదాన్ని ఇంట్లో ఉన్నాననే విషయమే తెలుసో లేదో నాకు అర్థం కావడం లేదు. ఇలా ఇబ్బందులు పడుతూ విడాకులు తీసుకోవల్సింది నేను కదా! కానీ ఆయన నా నుండి విడిపోతా అంటున్నాడు. ఈ విషయం కూడా తన స్నేహితులు చెబితేనే నాకు తెలిసింది. నేనంటే ఆయనకు చాలా చులక భావం. ఇలాంటి వ్యక్తితో ఉండటం చాలా కష్టం. అందుకే ఆయన అడిగినట్టు విడాకులు ఇచ్చి నా బతుకు నేను బతుకుతాను' అంది.

ఇద్దరి మాటలు విన్న తర్వాత కూర్చోబెట్టి 'మీ ఇద్దరి మధ్య సమస్యకు కారణం మనసు విప్పి మాట్లాడుకోకపోవడం. మీరు కేవలం భార్యాభర్తలు మాత్రమే కాదు. తల్లిదండ్రులు కూడా. ఆ విషయం మర్చిపోతున్నారు. మీరిద్దరూ విడిపోతే పిల్లల పరిస్థితి ఏంటీ? ఆకాష్ ముందు మీరు మీ భార్యతో ఎలాంటి సమస్య వచ్చినా ఆమెతోనే చెప్పండి. ఆమెకు చెప్పడం రాకపోతే మా దగ్గరకు రండి. అంతే కానీ స్నేహితులతోనో, మీ అక్కతోనే ఇక చెప్పకండి. దీని వల్ల మీ మధ్య సమస్యలు మరింత పెరుగుతాయి. నాలుగ్గోడల మధ్య ఉండాల్సిన విషయాలు బయటి ప్రపంచానికి తెలిసిపోతే మీకు సమాజంలో విలువ ఉండదు. మీ స్నేహితులకు చెబితే మీపై జాలి పడతారని మీరు అనుకుంటు న్నారు. కానీ అదే పనిగా మీ వ్యక్తిగత విషయాలు చెబితే మీరు వాళ్లకు చులకనైపో తారు. విడిపోవడం అంటే అంత తేలికైన విషయం కాదు. మీరు కాస్త అర్థం చేసుకొని ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటే కలిసి ఉండడంలో ఉండే ఆనందం ఏంటో మీకు తెలుస్తుంది' అని చెప్పాము.

అలాగే లతతో 'మీ భర్త ఇష్టాయిష్టాలు తెలుసుకోవల్సిన బాధ్యత నీకు ఉంది. మీ అత్త గారిని, మీ ఆడపడుచును అడిగి ఆకాష్ ఇష్టా లేంటే తెలుసుకోవల్సిన అవసరం నీకు ఉంది. అప్పుడు అతనికి నచ్చింది చేసి పెట్టొచ్చు. అతను మీతో మాట్లాకపోతే మీరే మాట్లాడించే ప్రయత్నం చేయండి. పదేండ్ల నుండి కలిసి ఉంటున్నారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చారు. ఇద్దరూ ఆ మాత్రం మాట్లాడుకోకపోతే ఎలా? అనవసరంగా ఏవేవో ఊహించుకుని సంసారాన్ని చేతులారా పాడుచేసుకోవద్దు' అని సర్ది చెప్పి పంపించాము.

> విడిపోవడం అంటే అంత తేలికైనా విషయం కాదు. మీరు కాస్త అర్థం చేసుకొని ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకుంటే కలిసి ఉండడంలో ఉండే ఆనందం ఏంటో మీకు తెలుసుకుంది

> 'మీ ఇద్దరి మధ్య సమస్యకు కారణం మనసు విప్పి మాట్లాడుకోకపోవడం. మీరు కేవలం భార్యాభర్తలు మాత్రమే కాదు. తల్లిదండ్రులు కూడా. ఆ విషయం మర్చిపోతున్నారు. మీరిద్దరూ విడిపోతే పిల్లల పరిస్థితి ఏంటీ?

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

- వై వరలక్ష్మి, 9948794051

సమతుల్యంగా ఉండాలంటే..!

హార్మోన్ల అసమతుల్యత.. ప్రస్తుతం చాలామంది మహిళలు ఎదుర్కొంటోన్న సమస్య. దీని కారణంగా నెలసరి-ప్రత్యుత్పత్తి సమస్యలే కాదు.. జీర్ణ సంబంధిత సమస్యలు, బరువు పెరగడం, శక్తి కోల్పోవడం, మానసిక సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలు.. వంటివి తలెత్తుతాయి. అయితే ఇన్ని అనారోగ్యాలకు కారణమయ్యే హార్మోన్లను తిరిగి సమతుల్యం చేసుకోవాలంటే.. ఆహారమే కాదు.. మనం అనుసరించే జీవనశైలి కూడా కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు.



ఎండ పొడ.. తగలాల్సిందే!

నిద్ర లేచీ లేవగానే చాలామంది చేసే పని.. మొబైల్ పట్టుకోవడం. దీనివల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయంటున్నారు నిపుణులు. ఇది ఒత్తిడిని కలిగించే హార్మోన్. ఉదయాన్నే ఒత్తిడి దరిచేరితే.. ఇక ఆ రోజంతా చిరాగ్గానే గడపాల్సి వస్తుంది. కాబట్టి.. అటు ప్రశాంతంగా రోజును ప్రారంభిస్తూనే, ఇటు హార్మోన్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలంటే లేలేత ఎండలో ఓ అరగంట గడపమంటున్నారు నిపుణులు. ఇది జీవ గడియారాన్ని ప్రేరేపించి.. భౌతిక, మానసిక, ప్రవర్తన పరంగా మార్పులు తీసుకొస్తుంది. తద్వారా చక్కటి జీవనశైలిని పాటించే అవకాశం ఉంటుంది.. ఇక ఇదే ఎండలో చిన్నపాటి వ్యాయామాలు చేయడం, నడక.. వంటివి చేస్తే మరీ మంచిది.

చెప్పుల్లేకుండా.. కాసేపు!

అడుగు తీసి బయటపెట్టామంటే చెప్పులు వేసుకోవాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు చాలామంది. కానీ ఉదయాన్నే కాసేపు చెప్పుల్లేకుండా నడవడం వల్ల హార్మోన్ల ఆరోగ్యం మెరుగుపడుతుం దంటున్నారు నిపుణులు.

ఈ వ్యాయామాలు చేస్తున్నారా?

రోజంతా ఉత్సాహంగా ఉండడంలో ఉదయాన్నే చేసే వ్యాయామాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈ ప్రక్రియ హార్మోన్ల సమతుల్యతనూ ప్రేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బరువులెత్తడం, కార్డియో వ్యాయామాలు హార్మోన్ల స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. ఇటు శారీరక ఫిట్‌నెస్, అటు హార్మోన్ల ఆరోగ్యాన్నీ మెరుగుపరచుకోవచ్చంటున్నారు. ■

సమానత్వం కోసం పోరాడిన తత్వవేత్త పూలే

(మొదటిపేజీ తరువాయి)

గొప్ప సంఘసంస్కర్తల్లో అగ్రగణ్యుడన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల విద్యకు కృషి చేసిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం చేసి, జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వానికి సూచించిన మహనీయుడు పూలేనన్నారు. అయితే దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మతతత్వ పార్టీలు సామాన్యులకు విద్య, ఉపాధి దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నాయని తెలిపారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. మతాన్ని రెచ్చగొడుతూ పిల్లలకు విద్యను దూరం చేయాలనే కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూలే ఆశయాలకు అనుగుణం గా సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, డీజీ నరసింహారావు, రమణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల కన్నా కాసులే మిన్న

న్యూఢిల్లీ: రైళ్లలో సీనియర్ సిటీజన్లకు రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్లు వ్యక్తం అవుతున్న విషయం తెలిసిందే. కోవిడ్ నేపథ్యంలో 2020 మార్చి 20 నుంచి సీనియర్ సిటీజన్లకు రాయితీని ఎత్తివేశారు. అప్పటి నుంచి సీనియర్ సిటీజన్ల క్యాటగిరీలో అంటే గత ఐదేండ్లలో రైల్వే శాఖకు అదనంగా రూ. 8,913 కోట్ల ఆదాయం వచ్చినట్టు తేలింది. సమాచార హక్కు చట్టం కింద సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డేటా నుంచి ఈ సమాచారాన్ని సేకరించారు. రైల్వేశాఖకు చెందిన టికెట్లు, ప్రయాణికుల వివరాలను సీఆర్ఐఎస్ మెయింటైన్ చేస్తోంది.

కనికరంలేని మోడీ సర్కార్..

రైల్వే శాఖ ప్రతి ప్రయాణికుడిపై 46 శాతం రాయితీ ఇస్తోందని మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 2020, మార్చి 20 కన్నా ముందు.. రైల్వే టికెట్లపై 60 ఏండ్లు నిండిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40 శాతం రాయితీ, 58 ఏండ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ కల్పించేవారు. సీఆర్ఐఎస్ డేటా ప్రకారం మార్చి 20, 2020 నుంచి ఫిబ్రవరి 28, 2025 వరకు 31.25 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు రైళ్లలో ప్రయాణించారు. రాయితీ ఎత్తివేయడంతో ఆ ప్రయాణికుల నుంచి రూ. 8913 కోట్ల ఆదాయం వచ్చినట్టు ఆర్టీఐ సమాచారం ద్వారా వెల్లడైంది. గత ఐదేండ్లలో 18.2 కోట్ల మంది పురుషులు, 13.06 కోట్ల మంది మహిళలు, 43 వేల మంది ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు సీనియర్ సిటిజన్ కోటాలో ప్రయాణించినట్టు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ వేసిన పిటిషన్ ఆధారంగా ఈ సమాచారం బహిర్గతమైంది. పురుష ప్రయాణికుల ద్వారా 11,531 కోట్లు, మహిళా ప్రయాణికుల ద్వారా 8,599 కోట్లు, ట్రాన్స్‌జెండర్ల ద్వారా రూ.28 లక్షల ఆదాయం వచ్చింది. ఈ మొత్తం ఆదాయం రూ.29 వేల కోట్లు దాటింది. అయితే పురుషులకు చెందిన 40 శాతం, మహిళలకు చెందిన 50 శాతం రాయితీ తీస్తే ఆ మొత్తం అమౌంట్ నుంచి రూ.8913 కోట్లు సీనియర్ సిటిజన్ కోటా నుంచి వచ్చినట్టు అవుతుందని చంద్రశేఖర్ తెలిపారు.

ఆర్టీసీలో కండక్టర్ల కొరత

హైదరాబాద్ రీజియన్‌లో 265 మంది...
సికింద్రాబాద్ రీజియన్‌లో 258 మంది కొరత
డిప్యుటేషన్‌పై ఉన్నవాళ్లంతా రీజియన్లలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో కండక్టర్ల కొరత తీవ్రమైంది. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కండక్టర్ల కొరత ఆర్టీసీని వేధిస్తుంది. హైదరాబాద్ రీజియన్‌లో 265 మంది, సికింద్రాబాద్ రీజియన్‌లో 258 మంది కండక్టర్ల కొరత ఉన్నట్టు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. వేసవి సెలవుల దృష్ట్యా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో బస్‌భవన్ సహా ఇతర ప్రాంతాల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు అందరూ తమ సొంత రీజియన్లలో రిపోర్టు చేయాలని చీఫ్ పర్సనల్ మేనేజర్ శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. బస్‌భవన్, ఆర్టీసీ కాల్‌సెంటర్, హకీంపేట శిక్షణా కేంద్రంలో మొత్తం 67 మంది కండక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా తమ సొంత రీజియన్లలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్

ఆర్ఆర్ఆర్ పనులు వేగవంతం చేయాలి
ఎన్‌హెచ్‌ల భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి :
ఆర్ఆర్ఆర్, ఎన్‌హెచ్‌లపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వచ్చే వందేండ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలనీ, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదిక తయారీని వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్ఏఐ) పంపించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయనీ, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో రైతులతో మాట్లాడి భూసేకరణ పూర్తి చేయాలని సీఎం తెలిపారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలనీ, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, ఆర్ఆర్ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, చీఫ్ ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

పూలే మార్గం అందరికి ఆచరణీయం

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏ. రాజశేఖర్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్‌కుమార్, రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ)చైర్మెన్‌గా మరో రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియమితుల య్యారు. హెచ్‌ఆర్సీ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి.కిషోర్‌లను ప్రభుత్వం నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మెన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల ఐదున సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన సెలక్షన్ కమిటీ తాజాగా వీరి పేర్లను ఖరారు చేసింది.

జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి ప్రొఫైల్

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సిర్సనగండ్లలోని సాధారణ వ్యవసాయ కుటుంబంలో 1960, మే 4న జన్మించారు. తల్లిదండ్రులు జయప్రద, రామానుజరెడ్డి. హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీ నుంచి పట్టభద్రులైన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బంగారు పతకం పొందారు. 1985, ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, 2005లో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సర్వీస్ ట్యాక్స్‌కు సీనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పని చేశారు. 2013, ఏప్రిల్ 12న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన 2014లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022, ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు.

జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రొఫైల్

నల్లగొండ జిల్లాలో 1961, జనవరి 1న రహీమున్నీసా బేగం, జాన్ మహమ్మద్‌కు షమీమ్ అక్తర్ జన్మించారు. నల్లగొండ నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివారు. నాగ్‌పూర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా నుంచి న్యాయపట్టా పొందారు. 1996లో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పీజీ కాలేజ్ ఆఫ్ లా నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 2002లో నల్లగొండ జిల్లా, సెషన్స్ జడ్జిగా, తర్వాత పలు కోర్టుల్లో పనిచేశారు. హైకోర్టులో రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)గా పనిచేశారు. 2017లో హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. 2022 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు.

కంచ గచ్చిబౌలి భూముల స్కాంలో బీజేపీ ఎంపీ హస్తం

(మొదటిపేజీ తరువాయి)

భూమిగానే గుర్తించాలని 1996లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అలాంటి భూముల లెక్కలు తీయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇచ్చింది పాయింట్ ఫోర్ క్యానపీ ఉన్న భూమి కచ్చితంగా అటవీ భూమే. 1980 ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం అటవీ భూములను తాకట్టుపెట్టే లేదా అమ్మే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదు" అని కేటీఆర్ అన్నారు. భూ స్కాంలో ఒక బీజేపీ ఎంపీ హస్తం ఉందని కేటీఆర్ విమర్శించారు. "ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ ప్రయివేట్ లిమిటెడ్ అనే బ్రోకర్ కంపెనీని తీసుకొచ్చి సదరు బీజేపీ ఎంపీ ఈ కాన్సెప్ట్‌ను చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎంను బైపాస్ చేసి డబ్బులు తీసుకొస్తామని చెప్పి అందుకు కమిషన్ ఇవ్వాలని ఆ కంపెనీ కోరింది. సదరు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.169 కోట్ల లంచం చెల్లించింది. ఆ తరువాత బీకన్ ట్రస్టీషిప్ అనే కంపెనీని ముందు పెట్టి మోసానికి పాల్పడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు రాగానే రూ.75 కోట్లకు ఒక ఎకరం చొప్పున ఆ 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి బదలాయి స్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ ఆ భూమిని ఏలియనైజేషన్ చేయలేదు. సేల్ డీడ్ చేయలేదు. మ్యూటేషన్ కూడా చేయలేదు. అంటే ప్రభుత్వానికి ఆ భూమిపై ఓనర్‌షిప్ రాలేదన్నట్టే. టీజీఐఐసీకీ ఆ భూములపై యాజమాన్య హక్కు లేదు. తనది కాని భూమిని బ్రోకర్ కంపెనీ మాట విని తాకట్టు పెట్టింది. ఎలాంటి వెరిఫికేషన్ చేయకుండా బ్యాంకు రూ.పదివేల కోట్ల డబ్బులు చెల్లించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకారం కంచ గచ్చిబౌలి ఏరియాలో గజం విలువ రూ.26,900 కోట్లు మాత్రమే. 400 ఎకరాలకు 5,239.84 కోట్లు మాత్రమే. కానీ రెవెన్యూ శాఖ మాత్రం ఆ భూమి విలువ రూ.30 వేల కోట్లు అని చెప్పుకుంది. ప్రభుత్వం, బ్రోకర్ సంస్థ, బ్యాంకు కుమ్మక్కై ఆ భూమికి లేని విలువను ఉన్నట్టుగా చూపించి రూ.10వేల కోట్ల లోన్ తీసుకున్నారు. రిజర్వ్ బ్యాంకును, బ్యాంకులను, దేశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసింది. రూ. 75 కోట్లు ఎకరమని జూన్‌లో జీవో ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల తర్వాత మళ్లీ ఇంకో సంస్థతో నవంబర్ 23న కొత్త వాల్యుయేషన్ తీసుకొచ్చి ఎకరం రూ. 52 కోట్లు మాత్రమే అని రిపోర్ట్ తయారు చేసింది. ఐదు నెలల కాలంలో రూ. 25 కోట్ల విలువ ఎందుకు తగ్గింది? ఆ తర్వాత బహిరంగ మార్కెట్లో రిలయబుల్ వ్యాల్యూ అసెస్మెంట్ అని ఎకరాకు రూ.41.6 కోట్లు మాత్రమే అని ప్రభుత్వం ప్రకటించింది. ఇలా 400 ఎకరాల భూమి విలువను రూ.30 వేల కోట్ల నుంచి రూ. 16,640 కోట్లకు ప్రభుత్వం కుదించింది. అదే బ్యాంకరు, అదే బ్రోకర్ని అడ్డం పెట్టుకొని ఆ భూములను తమ మనుషులకు అడ్డికి పావుసేరుకు అమ్మడానికి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నాడు" అని కేటీఆర్ ఆరోపించారు. ఈ స్కాంలో హస్తమున్న బీజేపీ ఎంపీ పేరును త్వరలోనే బయట పెడతామని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కోర్టుకు పోతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ తరపున ప్రధానమంత్రితో పాటు ఆర్థిక శాఖ మంత్రిని కలిసి అవినీతిపై ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

భారత్ నుంచి వంద మంది

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ స్పైవేర్ పెగాసస్ అప్పట్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. భారత్‌తో పాటు పలు దేశాల్లోని పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖులను పెగాసస్ లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ స్పైవేర్ వినియోగంతో పలువురు ఫోన్లు హ్యాక్ అయ్యాయని, వారిపై 'అనధికారిక' నిఘా జరిగిందని ఆందోళనలు వెలువడ్డాయి. దీనిపై పెగాసస్‌ను తయారు చేసే ఇజ్రాయెల్ ఎన్ఎస్ఓ గ్రూపు టెక్నాలజీస్, 'మెటా'కు చెందిన వాట్సప్ మధ్య అమెరికా న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతోంది. యూఎస్ కోర్టులో కొత్త చట్టపరమైన దాఖలును ఉటంకిస్తూ 'మీడియానామా' ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. 2019 వాట్సప్ హ్యాకింగ్ ప్రచారంలో ఇజ్రాయెల్ స్పైవేర్ పెగాసస్ ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న 1223 మందిలో వంద మంది భారత్‌లో ఉన్నారు. ఏప్రిల్ 2019 నుంచి మే 2019 మధ్య రెండు వారాల వ్యవధిలో 1400 మంది వాట్సప్ వినియోగదారులపై ఎన్ఎస్ఓ గ్రూపునకు చెందిన స్పైవేర్ ఉపయోగించబడిందని 'వాట్సప్' ఆరోపించింది. 2019లో తన స్పైవేర్ పెగాసస్‌ను ఉపయోగించి.. 1400 వాట్సప్ ఖాతాలపై అనధికార నిఘాకు ఎన్ఎస్ఓ గ్రూపు బాధ్యత వహిస్తుందని గతంలో యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పునిచ్చింది. ఎన్ఎస్ఓ గ్రూపు వాట్సప్‌నకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని ప్రత్యేక విచారణలో నిర్ణయిస్తారని సమాచారం. పైన తెలిపినట్టు రెండు వారాల వ్యవధిలో పెగాసస్ ఉపయోగించి లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల సంఖ్యను దేశాలవారీగా వాట్సప్ జాబితా చేసింది. పెగాసస్ బాధిత వాట్సప్ వినియోగదారులు ప్రపంచవ్యాప్తంగా 51 దేశాలలో ఉన్నారు. ఈ జాబితాల్లో మెక్సికో ముందున్నది. 456 మందిని ఎన్ఎస్ఓ పెగాసస్ టార్గెట్‌గా చేసుకున్నది. ఇక తర్వాతి స్థానంలో భారత్ ఉన్నది. ఈ టార్గెట్‌లో భారత్ నుంచి వంద మంది ఉన్నారు. భారత్ తర్వాత.. బహ్రెయిన్ (82), మొరాకో (69), పాకిస్థాన్ (58), ఇండోనేషియా (54)లు ఉన్నాయి. ఇక టర్కీ నుంచి 26 మంది, స్పెయిన్ నుంచి 21 మంది, ఫ్రాన్స్ నుంచి ఏడుగురిని ఈ స్పైవేర్ ద్వారా టార్గెట్ చేశారు. అయితే, 2019 వాట్సప్ హ్యాకింగ్ ప్రచారంలో లక్ష్యంగా చేసుకున్న వ్యక్తుల వివరాలు మాత్రం అస్పష్టంగా ఉన్నాయి. అయితే, మెటా వాదనలను ఎన్ఎస్ఓ తోసిపుచ్చినట్టు ఇజ్రాయెల్ వార్త సంస్థ ఒకటి వివరించింది. 2021 జులైలో 17 మీడియా సంస్థల బృందం, మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జరిపిన దర్యాప్తులో.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులపై అనధికారిక నిఘా కోసం పెగాసస్‌ను ఉపయోగిస్తున్నట్టు తేలింది. భారత్‌లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా, పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ వంటి వారు టార్గెట్ జాబితాలో ఉన్నట్టు ఇప్పటికే వెల్లడైన విషయం విదితమే. ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. భారత్‌లో అక్రమ నిఘా సాధ్యం కాదని అప్పటి కేంద్ర సమాచార సాంకేతిక మంత్రి వైష్ణవ్ 2021 జులైలో పార్లమెంటులో తెలిపారు. అయితే, ఆరోపణలపై సుప్రీంకోర్టు ఒక నిపుణుల కమిటీని ఏర్పర్చింది. 2022 ఆగస్టులో ఈ ప్యానెల్.. 29 ఫోన్లకు గానూ ఐదింటిలో మాల్వేర్‌ను గుర్తించిందని కోర్టు వివరించింది. అయితే, విచారణకు కేంద్రంలోని మోడీ సర్కారు సహకరించలేదని ప్యానెల్ కనుగొన్న విషయాన్ని కూడా న్యాయస్థానం గమనించింది.

మూసీ పునరుజ్జీవ పనులు వేగవంతం చేయండి



సీఎం రేవంత్ ఆదేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్‌లో నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్‌తోపాటు మీరాలం ట్యాంక్‌పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు. మీరాలం ట్యాంక్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని చెప్పారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మూసీ పునరుజ్జీవంపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె. శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌తోపాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. మీరాలం ట్యాంక్‌పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. 2.5 కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలనీ, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితోపాటు మీరాలం ట్యాంక్ వద్ద వివిధ చోట్ల ఐలాండ్‌లా ఉన్న మూడు ప్రాంతాలు పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

సింగపూర్‌లోని గార్డెన్స్‌ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలు ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, హంపీ థియేటర్‌ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్‌తోపాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్టులు, హోటళ్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్‌లో ఈ ఐలాండ్ జోన్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

మీరాలం ట్యాంక్‌లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీతో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలనీ, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని సీఎం సూచించారు.

మీరాలం బ్రిడ్జితోపాటు ఈ ఐలాండ్ జోన్‌ను పక్కనే ఉన్న జూపార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవలప్‌మెంట్ ప్లాన్‌ను దృష్టిలో పెట్టుకొని జూపార్కును అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్నీ అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ట్రిబుల్ ఆర్ పనులను వేగవంతం చేయాలి :

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ వరకు హైదరాబాద్ మెట్రో సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో మెట్రో విస్తరణపై సీఎం సమీక్షించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని ఈ సందర్భంగా సీఎం అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఢిల్లీలో అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కి.మీమేర మెట్రో విస్తరించేందుకు కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. దాదాపు 30వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట్ వరకు పొడిగించాలని సూచించారు. అందుకవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపించాలన్నారు. హెచ్ఎండీఏ, ఎఫ్ఎస్‌డీఏ (ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ) సంయుక్తంగా ఈ మెట్రో రూట్ విస్తరణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా మొత్తం 76.4 కి.మీ విస్తరణకు రూ.24,269 కోట్ల అంచనాలతో డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపించిందని తెలిపారు. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం నిధులు భరించేలా జాయింట్ వెంచర్‌గా ప్రాజెక్టు చేపట్టేలా ప్రతిపాదనలు తయారు చేసిందని గుర్తు చేశారు. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలనీ, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులనూ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ సమీపంలోనే భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా డ్రైపోర్ట్ నిర్మాణానికి రూపకల్పన చేయాలని సూచించారు. హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం సూచించారు.

ఐదు మ్యాచులు, నాలుగు పరాజయాలు, ఓ గెలుపు. ఐపీఎల్ 18లో సన్‌రైజర్స్ కథ ఇది. భారీ అంచనాలతో సీజన్‌ను మొదలెట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పూర్తిగా నిరాశపరిచింది. బ్యాట్, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ చెత్త గణాంకాలను నమోదు చేసింది. సీజన్లో రెండో విజయం కోసం ఎదురుచూస్తున్న సన్‌రైజర్స్ నేడు బలమైన పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.

కథ మారుతుందా?

పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు
విజయంపై కన్నేసిన ఆరెంజ్ ఆర్మీ

నవతెలంగాణ-హైదరాబాద్

సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మరో కీలక సమరానికి సిద్ధమైంది. వరుస పరాజయాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న పాట్ కమిన్స్ సేన.. కాస్త విరామం తర్వాత మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెడుతోంది. తొలి మ్యాచ్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో అదరగొట్టిన సన్‌రైజర్స్ ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో తేలిపోయింది. జట్టులోని కీలక బ్యాటర్లు ఆత్మవిశ్వాసం కోల్పోయినట్టు కనిపిస్తుండగా.. నేడు ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. మరోవైపు పంజాబ్ కింగ్స్ నాలుగు మ్యాచుల్లో మూడింట విజయాలు సాధించిన మంచి ఫామ్‌లో ఉంది. సన్‌రైజర్స్, పంజాబ్ కింగ్స్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.

బ్యాటర్లు మెరుస్తారా?

సన్‌రైజర్స్ సక్సెస్ ఫార్ములా టాప్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్‌పై ఆధారపడి ఉంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మలు పవర్‌ప్లేలో పవర్‌ఫుల్ స్కోరు సాధించటం కీలకం. కానీ ఈ సీజన్లో ట్రావిషేక్ జోడీ అంచనాలను అందుకోలేదు. హెడ్ ఒకట్రెండు ఇన్నింగ్స్‌ల్లో మెరిసినా, ఆ తర్వాత డీలా పడ్డాడు. ఇషాన్ కిషన్ తొలి మ్యాచ్‌లో శతకబాదిన తర్వాతి మ్యాచుల్లో దారుణంగా తేలిపోయాడు. టాప్-3 బ్యాటర్లు పవర్‌ప్లేలోనే నిష్క్రమించటం సన్‌రైజర్స్ పతనానికి దారితీస్తోంది. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి ఈ సీజన్లో తడబాటుకు గురవుతున్నాడు. బ్యాట్‌తో, బంతితో ఏమాత్రం ఆకట్టుకోవటం లేదు. హెన్రిచ్ క్లాసెన్ ధనాధన్‌పై ఎటువంటి అనుమానం లేదు. 15 ఓవర్ల తర్వాత క్రీజులోకి వస్తేనే క్లాసెన్ ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించగలడు. కానీ వరుస వికెట్లతో క్లాసెన్ పవర్‌ప్లే ముగియగానే క్రీజులోకి అడుగుపెడుతున్నాడు. యువ ఆటగాడు అనికెత్ వర్మ నిలకడగా మంచి ఇన్నింగ్స్‌లు ఆడినా.. గత రెండు మ్యాచుల్లో తేలిపోయాడు. సొంతగడ్డపై నేడు బ్యాటర్లు సమిష్టిగా మెరిస్తే మరో భారీ స్కోరుపై కన్నేయవచ్చు. బౌలింగ్ విభాగంలో పాట్ కమిన్స్, మహ్మద్ షమి టైటాన్స్‌పై రాణించారు. మిడిల్ ఓవర్లలో సన్‌రైజర్స్ స్పిన్నర్లు సైతం మాయ చేయగలిగితే ఆరెంజ్ ఆర్మీకి నేడు ఎదురుండదు!.



పంజాబ్ కింగ్స్ శిబిరంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బిగ్ ఇన్నింగ్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రియాన్ష ఆర్య, ప్రభుసిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కో జాన్సెన్, విజయ్‌కుమార్ వైశాక్‌లు కీలకం కానున్నారు. బ్యాట్‌తో, బంతితో సమిష్టిగా రాణిస్తూ అద్భుత విజయాలు సాధిస్తోన్న పంజాబ్ కింగ్స్ నేడు ఉప్పల్‌లోనూ అదే ఫార్ములాతో బరిలోకి దిగుతోంది.

పూజలు ఫలిస్తాయా?

సొంతగడ్డపై ఆడిన మూడు మ్యాచుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండింట పరాజయం చవిచూసింది. దీంతో ఆతిథ్య జట్టు విజయం సాధించేందుకు ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ ముంగిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూరేటర్ చంద్రశేఖర్, గ్రౌండ్ సిబ్బంది నేడు మ్యాచ్‌కు ఉపయోగించే పిచ్‌పై పూజలు నిర్వహించారు. వరుస పరాజయాలు ఎదురైనా.. స్టేడియానికి అభిమానులు భారీ స్థాయిలో రావటం సన్‌రైజర్స్‌కు అతిపెద్ద అనుకూలత.

సూపర్‌కింగ్స్ చిత్తు

8 వికెట్ల తేడాతో నైట్‌రైడర్స్ గెలుపు
చెన్నై 103/9, కోల్‌కత 107/2



చెన్నై : ఐపీఎల్18లో చెన్నై సూపర్‌కింగ్స్ తడబాటు కొనసాగుతుంది. సీజన్లో ఐదో పరాజయం చవిచూసిన సూపర్‌కింగ్స్.. ఆరంభంలోనే ప్లే ఆఫ్స్ ఆశలను ఆవిరి చేసుకుంది!. శుక్రవారం చెపాక్‌లో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కత నైట్‌రైడర్స్ చేతిలో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. 104 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నైట్‌రైడర్స్ 10.1 ఓవర్లలోనే ఊదేసింది. మరో 59 బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. సునీల్ నరైన్ (44, 18 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (23), అజింక్య రహానె (20 నాటౌట్) మెరవటంతో కోల్‌కత అలవోక విజయం సాధించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ సొంతగడ్డపై తేలిపోయింది. సునీల్ నరైన్ (3/13), వరుణ్ చక్రవర్తి (2/22) మాయకు హర్షిత్ రానా (2/16) పేస్ తోడవటంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులే చేసింది. శివం దూబె (31 నాటౌట్, 29 బంతుల్లో 3 ఫోర్లు), విజయ్ శంకర్ (29, 21 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ త్రిపాఠి (16), డెవాన్ కాన్వే (12) మినహా మరో బ్యాటర్ రెండెంకల స్కోరు చేయలేదు. రచిన్ రవీంద్ర (4), అశ్విన్ (1), జడేజా (0), హుడా (0), ధోని (1), నూర్ అహ్మద్ (1) దారుణంగా విఫలమయ్యారు. సీజన్లో ఆరు మ్యాచుల్లో మూడో విజయంతో పాయింట్ల పట్టికలో కోల్‌కత మూడో స్థానంలో నిలువగా.. ఐదో ఓటమితో సూపర్‌కింగ్స్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది.

నవచిత్రం

ఫీల్ గుడ్ సినిమా



రాజేంద్రప్రసాద్, నటి అర్చన కాంబినేషన్‌లో రూపేష్, ఆకాంక్ష సింగ్ హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'షష్టి పూర్తి'.

పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఇళయరాజా ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. ఇందులో తొలిపాటను కీరవాణి రచించగా ఇటీవల విడుదల చేశారు. సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ విడుదల చేసిన ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ లభించింది. రెండో పాటను హీరో రవితేజ ఆవిష్కరించి, యూనిట్‌కి బెస్ట్ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మా రాజేంద్రప్రసాద్ అన్నయ్య చేసిన ఈ సినిమా చూడండి.. డెఫినెట్‌గా బావుంటుంది. మంచి ఫీల్ గుడ్ సినిమా అవుతుందనిపిస్తోంది. దర్శక నిర్మాతలకు, ఆర్టిస్టులకు అందరికీ ఆల్ ది బెస్ట్' అని చెప్పారు. 'ఇరు కనులు కనులు కలిసి మురిసె మొదటి చూపులో...తొలి పిలుపు తగిలి మెరుపు మెరిసే మనసు నింగిలో..' అంటూ రెహమాన్ రాసిన ఈ పాటను ఎస్పీ చరణ్, విభావరి ఆలపించారు.

దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ, 'సినిమాలో చాలా అందమైన యుగళ గీతం ఇది. ఇళయరాజా బాణీ ఇవ్వగానే నాకు 'సాగర సంగమం'లో 'మౌనమేలనోయి 'పాటలాంటి గొప్ప పాట అవుతుందనే అనుభూతి కలిగింది. ఈ ట్యూన్‌కి రెహమాన్ మంచి సాహిత్యం సమకూర్చారు. ఇళయరాజా ఒక్క కరక్షన్ కూడా చెప్పకుండా ఓకే చెప్పేశారు. ఎస్పీ చరణ్, విభావరితో ఈ పాట పాడించారు. రాజమండ్రిలో ఈశ్వర్ నృత్య దర్శకత్వంలో హీరో, హీరోయిన్లు రూపేష్,ఆకాంక్ష సింగ్‌లపై ఈ పాటను చిత్రీకరించాం' అని అన్నారు.

మరిన్ని అవకాశాల కోసం..



నిర్మాత, టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, నిర్మాత హర్షిత్ రెడ్డి ఇటీవల ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ బృందంలో డిప్యూటీ కాన్సుల్ జనరల్ స్టీవెన్ కానోలీ, వైస్ కాన్సుల్ హారియట్ వైట్, స్టెఫీ చెరియన్ ఉన్నారు.

భారత్–ఆస్ట్రేలియాల మధ్య ముఖ్యంగా సినిమా, సాంస్కృతిక రంగాల్లో సంబం ధాలను ఎలా మరింత పటిష్టం చేసుకోవాలనే దానిపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

ఇరు దేశాల మధ్య సినిమా సహ నిర్మాణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నటీనటులు, సాంకేతిక నిపుణుల టాలెంట్ ఎక్సేంజ్ వంటి పలు కీలక అంశాలపై మాట్లాడుకున్నారు. హైదరాబాద్ నగరంపైన, తెలుగు సినిమాపైన ఆస్ట్రేలియా ప్రతినిధులు ఎంతో ఆసక్తి, ఉత్సాహం చూపించారు. ఈ చర్చల ద్వారా ఇరు దేశాల సృజనాత్మక రంగాల మధ్య బంధం మరింత బలపడుతుందని, ఆస్ట్రేలియాలో తెలుగు సినిమాకు మరిన్ని మంచి అవకాశాలు వస్తాయని ఇరు పక్షాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

వేసవి కానుకగా 'వీరమల్లు..' రిలీజ్



పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు'. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో ఆయన ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అగ్ని లాంటి ఆవేశం, న్యాయం చేయాలనే ఆలోచన ఉన్న యోధుడిగా.. మునుపెన్నడూ చూడని సరికొత్త అవతార్‌లో కనిపించనున్నారు. మొఘల్ రాజుల నుండి కోహినూర్ వజ్రాన్ని దొంగిలించడంతో పాటు, ప్రేక్షకుల మనసు దోచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఇది కేవలం కథ కాదు.. ఇది ఒక విప్లవం. న్యాయం కోసం యుద్ధం చేయనున్న వీరమల్లు. వేసవి కానుకగా మే 9వ తేదీన తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.


ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, ఎ.ఎం.జ్యోతి కృష్ణ దర్శకులు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్, సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నిర్మాత ఎ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఆ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తాయి

తమన్నా ప్రధాన పాత్రధారణిగా నటించిన చిత్రం 'ఓదెల 2'. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి ఇది సీక్వెల్. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి.మధు ఈ చిత్రాన్ని నిర్మించారు.

తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 17న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత డి.మధు మీడియాతో ముచ్చటించారు.



డి. మధు

- నేను సంపత్ నందికి తెలియకుండానే 'ఓదెల' ఫస్ట్ పార్ట్ చూశాను. సినిమా చూసి చాలా ఎక్సైట్ అయ్యాను. అనుకోకుండా ఆయనే 'ఓదెల2' కథని నాతో చెప్పారు. కంటెంట్ బాగా నచ్చి, ఈ ప్రాజెక్ట్ చేశాను. పైగా తనతో నాకు మంచి వేవ్ లెంత్ కుదిరింది. భవిష్యత్తులో ఆయనతో మరిన్ని ప్రాజెక్ట్స్ చేయాలని ఉంది.
- ఇందులో నాగ సాధుగా తమన్నా అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఫస్ట్ లుక్‌తోనే ఆ క్యారెక్టర్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ కథ విషయంలో తమన్నా చాలా ఎగ్జైట్ అయ్యారు. చాలా హార్డ్ వర్క్ చేశారు. కరెక్ట్ టైంలో, కరెక్ట్ కథ ఆమె దగ్గరకు వెళ్లిందని నేను నమ్ముతున్నాను. ఈ సినిమా కథ లాజికల్‌గా ఉంటుంది. ప్రతి దానికి ఒక ఆధారంతోనే చూపించాం. ఇందులో చాలా థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. అవన్నీ కూడా ఆడియన్స్‌ని చాలా సర్‌ప్రైజ్ చేస్తాయి. అజనీస్ లోక్‌నాథ్ ఈ జోనర్‌కి పర్ఫెక్ట్ మ్యూజిక్ డైరెక్టర్. చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోరు చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అలాగే సినిమాటోగ్రాఫర్ సౌందర్ రాజన్ విజువల్స్‌తో మంచి ట్రీట్ ఇచ్చారు.
- ఈ కథలో ప్రతి పాత్రకి ఇంపార్టెన్స్ ఉంటుంది. వశిష్ట క్యారెక్టర్ కూడా చాలా బాగుంటుంది. తమన్నా, వశిష్ట.. ఈ రెండు క్యారెక్టర్స్ మధ్య టగ్ ఆఫ్ వార్‌లా ఉంటుంది. అలాగే మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, హెబ్బా..ఈ పాత్రలన్నీ కూడా చాలా బాగుంటాయి. ప్రేక్షకులు పాత్రలతో లీనం అవుతారు. ఇందులో గ్రాఫిక్స్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. పంచభూతాల కాన్సెప్ట్‌ని గ్రాఫిక్స్‌లో చూపించాం. ప్రేక్షకులకు మంచి సినిమా ఇవ్వాలి, ఒక మంచి సక్సెస్‌ని అందుకోవాలని ప్యాషన్‌తో ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం.

అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో 'సోదరా'



ఆర్తి గుప్తా, సంపూర్ణేష్ బాబు

సంపూర్ణేష్ బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'సోదరా'. ఈ చిత్రంలో ఆయనతోపాటు సంజోష్ కూడా ముఖ్యపాత్రలో నటిస్తున్నాడు. ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి మోహన్ మేనంపల్లి దర్శకుడు.

చిత్రీకరణ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం ఈనెల 25న వేసవి కానుకగా ప్రేక్షకులను ఎంటర్‌టైన్‌చేయడానికి థియేటర్స్‌ల్లో విడుదల కాబోతుంది.

ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి విడుదల చేశారు.

ఈ సందర్భంగా సాయి రాజేష్ మాట్లాడుతూ, 'సంపూతో నేను సినిమా తీసి 13 ఏళ్లు అయ్యింది. 'హృదయ కాలేయం' సూపర్‌హిట్ తరువాత సంపూ నన్ను ఆర్థికంగా చాలా ఆదుకున్నాడు. తాను సంపాదించుకున్న డబ్బులో అందరికి సహాయం చేస్తుంటాడు. సంపూ నా దృష్టిలో స్టార్' అని అన్నారు.

'ఈ సినిమా పవన్‌కల్యాణ్ 'బ్రో' సినిమాలా ఘన విజయం సాధించాలని, అందరికి మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాను నేను థియేటర్‌లో ఒక షో బుక్ చేసుకుని మా ఫ్రెండ్స్ అందరికి చూపిస్తాను. ఇలాంటి చిన్న సినిమాలను నా వైపు నుంచి ప్రోత్సాహించాలనే బాధ్యత వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నాను' అని ఎస్‌కేఎన్ అన్నారు. సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, 'నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన సాయి రాజేష్ ఈ వేడుకకు రావడం హ్యాపీగా ఉంది. అప్‌డేట్ అయిన తమ్ముడు, అమాయకుడైన అన్న మధ్య జరిగే స్వచ్ఛమైన కథే ఈ సినిమా. ఇప్పటి వరకు ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కంటెంట్‌కు మంచి స్పందన వచ్చింది. నేను రియల్‌లైఫ్‌లో ఎలా ఉంటానో అలాంటి పాత్రని ఇందులో చేశాను. అందరూ ఈ సినిమాను ఆదరించి మాకు మంచి విజయం అందిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు. ఈ వేడుకలో దర్శకుడు మోహన్ మైనంపల్లి, దర్శకుడు కృష్ణ చైతన్య, హీరో చైతన్య, దర్శకుడు నవీన్ మేడారం, డిఓపీ జాన్, ఎడిటర్ శివ,లిరిక్ రైటర్ పూర్ణాచారి, హీరోయిన్ ఆర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ సంఘటనలతో స్ఫూర్తితో '23'



'మల్లేశం, 8 ఎ.ఎమ్, మెట్రో' చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్. నిజమైన సంఘటనల నుండి ప్రేరణ పొంది ఆయన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ '23'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. ఇటీవల విడుదల టీజర్ సెన్సేషనల్ రెస్పాన్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సినిమా నుంచి 'కోసీ కోయ్యంగానే' సాంగ్‌ని లాంచ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ పాటని రా అండ్ రస్టిక్ ఎనర్జీ ఉన్న పవర్‌ఫుల్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి వరంగల్ శంకర్ రాసిన సాహిత్యం ఉర్రూతలూగించేలా ఉంది. రేలా జాన్ సాంగ్ హై ఎనర్జీతో పాడటం మరింత ఆలరించింది. ఈ సాంగ్‌లో లీడ్ యాక్టర్స్ రస్టిక్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

'రియల్ ఇన్సిడెంట్స్‌ని స్ఫూర్తిగా తీసుకుని తెరకెక్కిస్తున్న ఈచిత్రం అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు రాజ్ చెప్పారు. తేజ, తన్మయి, ఝాన్సీ, పావోన్ రమేష్, తాగుబోతు రమేష్, ప్రణీత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి దర్శకత్వం: రాజ్ ఆర్, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, సంగీతం: మార్క్ కె రాబిన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకట్ సిద్దారెడ్డి, ప్రొడక్షన్ డిజైన్: లక్ష్మణ్ ఏలే, ఆర్ట్ డైరెక్షన్: విష్ణు వర్ధన్ పుల్లా, కాస్టింగ్ డైరెక్షన్: మహేష్ గంగిమల్ల, డైలాగ్స్: ఇండస్ మార్టిన్, ఎడిటింగ్: అనిల్ ఆలయం, సాహిత్యం: చంద్రబోస్, రెహమాన్, సింధు మార్టిన్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల

- నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి, మెడికల్ కాలేజీలు, కొత్తపేట్, సనత్‌నగర్, అల్వాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు, వరంగల్ హెల్త్ సిటీ భవన నిర్మాణ పనులపై సమీక్షించారు. పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ఈ ఏడాది చివరికల్లా అన్ని హాస్పిటళ్లు, కాలేజీల నిర్మాణ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. నిర్మాణ పనులు ఆలస్యం అవుతుండడంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షకాలం మొదలయ్యేలోగా నిర్మాణ పనులన్నీ కొలిక్కి రావాలన్నారు. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ, కొత్తపేట్, అల్వాల్, సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అల్వాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో సైన్సెస్‌గా, సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ సైన్సెస్‌గా, కొత్తపేట సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ గ్యాస్ట్రో సైన్సెస్‌గా అభివృద్ధి చేయబోతున్నామని మంత్రి వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే పరికరాలను సమకూర్చుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆరోగ్యంపై ఎన్ఐడీపీఆర్‌తో ఐఐపీహెచ్ ఒప్పందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాల బలోపేతం కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐడీపీఆర్)తో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్) ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్ సమక్షంలో రిజిస్ట్రార్ మనోజ్ కుమార్ ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కౌల్ శుక్రవారం హైదరాబాద్‌లో ఎంఓయూపై సంతకం చేశారు. ఈ భాగస్వామ్యంతో నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్, సర్వైకల్ క్యాన్సర్, వన్‌హెల్త్, డిజిటల్ హెల్త్ టెక్నాలజీల విని యోగం వంటి రంగాలపై ఉమ్మడి పరిశోధనలకు ఆస్కారం ఏర్పడుతుంది. అలాగే పంచాయతీ రాజ్ సంస్థల సామర్థ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ఉత్తమ శిక్షణ, నైపుణ్యాల పెంపు, గ్రామీణాభివృద్ధి, ప్రజారోగ్య రంగాల్లో అభివృద్ధికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమిలో ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్మా జోతిబా పూలే 198వ జయంతి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి, బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని పురస్కరించుకుని అకాడమిలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి ప్రిన్సిపల్ కె సురేందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ గోపీనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమర్షియల్ ట్యాక్స్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వై సత్యనారాయణ మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని సూచించారు. తద్వారా స్ఫూర్తి పొంది వారి జీవితాల నుంచి నేర్చుకున్నటువంటి అంశాలను విద్యార్థులుగా ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. సమాజ అభ్యున్నతికి సమసమాజ స్థాపనకు పాటుపడాలని అన్నారు. అలాంటి జీవితం ధన్యమవుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందించిన మహాత్మా జోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ చరిత్రకు సంబంధించినటువంటి సినిమా క్లిప్పింగ్‌లు విద్యార్థులకు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి నుంచి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాలు, మెమోంటోతో సత్కరించారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. వారిలో ఏ వేణు రావు, వినీత, పత్తి రవి, ఫణి కుమార్, హరీష్, ఎస్ శ్రీధర్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ జనార్ధన్ దండు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీష్ కుమార్, ఆన్‌లైన్ కోర్సు ఎడిటర్ కోట మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది జక్కుల ఆమని, బండారి రంజిత్ కుమార్, బి సంధ్యా రాణి, సుమన్ ధలోడ్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యరంగాలకు మొదటి ప్రాధాన్యత

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగామ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థుల 174వ స్నాతకోత్సవంలో పాల్గొనీ, విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉస్మానియా ప్రొఫెసర్లకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరుల ప్రాణాలు కాపాడే అవకాశం, ఇతరుల బాధను, నొప్పిని తొలగించే అవకాశం డాక్టర్లకు మాత్రమే ఉంటుందని తెలిపారు. పేదల పక్షనా నిలబడాలని సూచించారు. దశాబ్దాల ఉస్మానియా నూతన ఆస్పత్రి ఆకాంక్షను నెరవేరుస్తున్నామనీ, గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో హాస్పిటల్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. రూ.210 కోట్లతో అత్యాధునిక వసతులతో హాస్టల్స్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. మంచి డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

కాకతీయ హెరిటేజ్ టూర్‌కు చురుగ్గా ఏర్పాట్లు

- పర్యాటక శాఖ కార్యదర్శి స్మితాసబర్వాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మేలో జరగనున్న మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో తలపెట్టిన కాకతీయ హెరిటేజ్ టూర్‌కు చురుగ్గా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే కాకతీయ రాజవంశం, రామప్ప దేవాలయం యొక్క నిర్మాణ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేశ విదేశాల నుంచి వచ్చే అతిథులను హైదరాబాద్ నుంచి తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యంతో పాటు, భద్రత కల్పించాలని ఆదేశించారు. ఈవెంట్‌లో తెలంగాణ సంస్కృతి, వంటకాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఎన్.ప్రకాష్ రెడ్డి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల, సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ, హన్మకొండ, ములుగు కలెక్టర్లు ప్రావిణ్య, దివాకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనలో ఉద్యోగులు భాగస్వాములు కావాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పూలే ఆశయ సాధనలో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేశ్, ఎం.వెంకటేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయంలో జ్యోతిబా పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా అట్టడుగు తరగతుల అభ్యున్నతికి విద్య యొక్క ప్రాధాన్యత ఎంత అవసరమో సమాజం గుర్తించే విధంగా విశేషమైన కృషి చేశారని గుర్తుచేశారు. అన్ని రక్షాల వివక్షలకు దూరంగా ఉండాలంటే మహిళలకు చదువు నేర్పించాలని పట్టుదలగా పూలే ప్రయత్నించారని తెలిపారు. పూలే మనువాదానికి వ్యతిరేకంగా నికరంగా నిలబడి పోరాడారని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కులం, మతం, ప్రాంతీయ అసమానతలను పెంచి పోషిస్తున్నదని విమర్శించారు.

నేతన్న, రైతన్నల సంక్షేమమే తమ ప్రాధాన్యత

- రూ.34కోట్లతో నేతన్నలకు రూ.లక్ష రుణమాఫీ పూర్తి
- నేతన్న జీవనోపాధి కల్పనకు రూ.900కోట్ల ఆర్డర్లు అందించాం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సిరిసిల్ల ఆపెరల్ పార్క్‌లో మరో పరిశ్రమ యూనిట్ ప్రారంభం



నవతెలంగాణ - సిరిసిల్ల

నేతన్నలు, రైతన్నల సంక్షేమమే ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపెరల్ పార్క్‌లోని 7.6 ఎకరాల్లో రూ.62 కోట్లతో ఏర్పాటైన పంక్చుయేట్ వరల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ (టెక్స్‌పోర్ట్) యూనిట్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు. పరిశ్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. నేతన్నల జీవనోపాధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు ఒకేసారి రూ.20,600 కోట్ల రుణమాఫీ చేసిందని, నేతన్నలకు రూ.34 కోట్ల రుణమాఫీ పూర్తి చేసిందని తెలిపారు. నేతన్నలకు రూ.914 కోట్ల బకాయిలు విడుదల చేశామని, రూ.900 కోట్ల ఆర్డర్లు అందించామని చెప్పారు. త్వరలోనే వర్కర్ టూ ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని వెల్లడించారు.మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. టెక్స్‌పోర్ట్ సమస్యలు పరిష్కరించి పరిశ్రమ ప్రారంభించామని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామన్నారు. వేములవాడ అభివృద్ధికి నిధులు కేటాయించామని, శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానికులకు ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. టెక్స్‌పోర్ట్ యూనిట్ ఏర్పాటు సంతోషకరమని, భవిష్యత్తులో విస్తరణకు సహకరిస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు చీరల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకే ఇచ్చామని, పేదల కోసం సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు చీరల పంపిణీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో కాటన్, పాలిస్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం పరిశ్రమలో శిక్షణ పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్, ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ రాఘవేందర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ మాకొద్దు

- పనులు ప్రారంభించిన 2 నెలల తర్వాత ప్రజాభిప్రాయ సేకరణా..?
- 18 వరకు
- కోర్టు స్టే ఉండటంతో ఆగిన పనులు: ఆర్డీఓ
- నల్లవల్లి గ్రామ పంచాయతీకి నోటీసు..
- ప్రారంభమైన ప్రజాభిప్రాయం
- మొదటి రోజు వ్యతిరేకించిన
- నాలుగు గ్రామాల ప్రజలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్-నల్లవల్లి గ్రామంలో జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డ్ తమ కొద్దంటూ స్థానికులు వ్యతిరేకించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రెండు నెలల క్రితమే రాంకీ సంస్థ పనులు చేపట్టింది. స్థానికులు దాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమం చేపట్టారు. భూముల సర్వే చేయకుండానే డంపింగ్ యార్డ్ పనులు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రైతులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈ నెల 18 వరకు ఎలాంటి పనులు కొనసాగించవద్దంటూ స్టే విధించింది. పనులు తాత్కాలికంగా ఆగిపోయినా డంపింగ్ యార్డ్ పెట్టాలన్న ఆలోచనలో రాంకీ సంస్థ ఉండటంతో 11 గ్రామాలకు చెందిన ప్రజలు జేఏసీగా ఏర్పడి 66 రోజులుగా స్థానికంగా గ్రామాల వారీగా నిరవధిక దీక్షలు కొనసాగిస్తున్నారు. అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు..

కోర్టు స్టే ఉండటంతో డంపింగ్ యార్డ్ పనుల్ని తాత్కాలికంగా నిలిపి వేశారు. ప్రజాందోళన కొనసాగుతున్న వేళ ఈ నెల 3న గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం ఎ1-నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సాలిడ్ వ్యర్థాల నిర్వహణ కోసం గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లోని బిలా దాఖల్ సర్వే నెంబర్‌లో ఉన్న 152 ఎకరాల భూమిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడానికి సిఫార్సు చేశారు. నోటీస్ జారీ చేసిన రోజు నుంచి 15 రోజుల్లోపు స్థానిక ప్రజలు డంపింగ్ యార్డ్ గురించి ఆసక్తి, వ్యతిరేకత చూపే వాళ్లు తమ అభిప్రాయాన్ని తెలియజేయాల్సిందిగా నోటీసులో పేర్కొన్నారు. తహసీల్దార్ జారీ చేసిన నోటీస్ గురించి మండల వాసులంతా తెలుసుకుని డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ అభిప్రాయం తెలియచేయాలని తీర్మానించుకున్నారు. జేఏసీ ఈ మేరకు ప్రజలకు పిలుపునిచ్చింది. దాంతో శుక్రవారం మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్, కొత్తపల్లి, మంబాపూర్‌కు చెందిన 1000 మంది వరకు తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయవద్దంటూ అభిప్రాయం తెలియజేస్తూ తహసీల్దార్ కార్యాయంలో సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతులు అందజేశారు.

పనులు ప్రారంభించిన తర్వాత ప్రజాభిప్రాయమా..?

డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ముందే ప్రజాభిప్రాయం చేయాల్సి ఉన్నా జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ, రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్న పరిస్థితి ఉంది. పనులు మొదలు పెట్టిన రెండు నెలల తర్వాత ప్రజాభిప్రాయం ఎలా సేకరిస్తారని జేఏసీ నాయకులు ఆర్డీఓను శుక్రవారం నిలదీశారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎఎస్పీ సంజీవరావు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పోలీసులు మోహరించారు.

18 వరకు స్టే ఉన్నది: రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి, ఆర్డీఓ

ప్యారానగర్ భూముల సర్వేకు సంబంధించి హైకోర్టు స్టే విధించడం వల్ల అక్కడ పనులు జరగట్లేదు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయనున్నందున ఆసక్తి ఉన్న వాళ్లు, వ్యతిరేకించే వాళ్లు తమ అభిప్రాయాల్ని తెలియజేసేందుకు వీలుగా ప్రజాభిప్రాయాన్ని కోరాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

కార్మికులను బానిసల్ని చేసేందుకే లేబర్ కోడ్‌లు

- వాటి రద్దు కోసం మే 20 దేశవ్యాప్త సమ్మె
- డిజిటల్ మీడియా జర్నలిస్టులతో మీట్ ద ప్రెస్‌లో సీఐటీయూ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చేందుకే లేబర్ కోడ్‌లను తీసుకురాబోతున్నదని సీఐటీయూ నేతలు చెప్పారు. వాటి రద్దు కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఆ సమ్మె జయప్రదానికి డిజిటల్ మీడియా కూడా సహకరించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాటల సోమన్న అధ్యక్షతన టీయూ న్యూస్, ఈ69 న్యూస్ ఆధ్వర్యంలో మీట్ ద ప్రెస్ కార్యక్రమం నిర్వహించారు. అందులో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, వీఎస్.రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ..కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని విమర్శించారు. అదే సమయంలో కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తున్న తీరును ఎండగట్టారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా వందేండ్లలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందనీ, దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాల ద్వారా ఐదేండ్లుగా అమలు కాకుండా అడ్డుకోగలుగుతున్నామని చెప్పారు. హిందుత్వ ఎజెండాతో ముందుకు సాగుతూ రాజ్యాంగ విలువలను, ప్రజల హక్కులను మోడీ సర్కారు హరిస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వం నుండి భూములు, నిధులు, ఇతర అనేక రాయితీలను పెట్టుబడిదారులు పొందున్నారనీ, వారికి మరింత ఎక్కువ మోతాదులో లాభాలు ఆర్జించి పెట్టేందుకు కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నదని తెలిపారు. కార్మిక చట్టాల రద్దుతో జర్నలిస్టులు కూడా అనేక సౌకర్యాలు, హక్కులు కోల్పోబోతున్నారని వివరించారు. మే 20 జరిగే సమ్మెలో జర్నలిస్టులు కూడా భాగస్వాములు కావాలని, ప్రజలను, కార్మికులను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఇప్పటికే చాలా కంపెనీల్లో 12 గంటల పని విధానం నడుస్తున్నదనీ, లేబర్‌కోడ్‌ల ద్వారా దాన్ని మోడీ సర్కారు చట్టబద్ధం చేయబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సామాజిక పథకాలకు నిధులు తగ్గిస్తున్న తీరును ఎండగట్టారు. కార్మిక సంఘాల రద్దు, ఉమ్మడి బేరసారాల హక్కు హరణ, పనిప్రదేశాల్లో గేటు మీటింగ్‌ల పెట్టడం, కరపత్రాల పంపిణీ చేయడం వంటి వాటిని సైతం నిషేధించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ తుంగలోకి తొక్కాలని చూస్తున్నదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. మల్టీనేషనల్ కంపెనీల్లో హైలీ స్కిల్డ్ కార్మికులకు రిక్రూట్ చేసుకోని ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో మధ్యలోనే ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న తీరును వివరించారు. వారు వివిధ సంఘాలను, అసోసియేషన్లను ఏర్పాటు చేసుకోని హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు ఏఐ టెక్నాలజీతో కార్మికవర్గంపై దాడి చేయబోతున్నాయని హెచ్చరించారు. అసంఘటిత రంగ కార్మికులు మొదలుకొని ఐటి ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ మే 20 సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

తక్షణమే ఏపీని నిలువరించండి

జీఆర్ఎంబీకి నీటిపారుదల శాఖ లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి-బనకచర్లపై ఏపీ ముందుకెళ్లకుండా చూడాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)కి రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి అనిల్‌కుమార్ లేఖ రాశారు. పోలవరం ప్రాజెక్టు, తాడిపూడి ఎత్తిపోతలపై ఎలాంటి టెండర్లు చేపట్టకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల ఏడున జరిగిన సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించిన విషయం విదితమే. గోదావరి-బనకచర్ల ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని జీఆర్ఎంబీ చైర్మెన్, ఏపీ సభ్యులు సమాధానం చెప్పిన సంగతి తెలిసిందే. కాగా, మరుసటి రోజే ఏపీ జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఆలస్యం చేయకుండా తక్షణమే ఏపీని నిలువరించాలని ఈఎన్సీ లేఖలో పేర్కొన్నారు.

21న నీటి లభ్యతపై భేటీ

గోదావరి బేసిన్‌లో నీటి లభ్యతపై కేంద్ర జలవనరుల సంఘం సమావేశం ఈనెల 21న జరగనుంది. న్యూఢిల్లీలో జరిగే ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధికారులు హాజరుకానున్నారు.

శ్రీశైలం కుడికాలువ లైనింగ్ పనులు అడ్డుకోండి

కేఆర్ఎంబీకి ఈఎన్సీ లేఖ

అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం చేపడుతున్న శ్రీశైలం కుడి ప్రధాన కాలువ లైనింగ్ పనులు అడ్డుకోవాలని కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. ఈమేకు ఈఎన్సీ జి అనిల్‌కుమార్ తాజాగా కృష్ణా బోర్డుకు లేఖ రాశారు. ఏపీ పునర్విభజనం చట్టం ప్రకారం కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందిన తర్వాతనే కొత్త ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. దీనికి భిన్నంగా ఏపీ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు మూడు టీఎంసీలు తరలించేలా రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టిందని తెలిపారు. దీనికితోడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు ఉన్న కాలువ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 89 వేల క్యూసెక్కులకు పెంచేందుకు వీలుగా సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టిందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను ఎన్‌జీటీ ఇప్పటికే నిలిపివేసిందని గుర్తుచేశారు. అయినా కృష్ణా పరివాహకంలోని తెలంగాణ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు ప్రయోజనాలు దెబ్బతీసేలా ఏపీ ప్రభుత్వం రహస్యంగా లైనింగ్ పనులు కొనసాగిస్తున్నదని వివరించారు. ఆయా ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకుని వెంటనే పనులను నిలిపివేయాలని ఈఎన్సీ లేఖలో పేర్కొన్నారు.

జర్నలిస్టుల హక్కులకై టీడబ్ల్యూజేఎఫ్ నిరంతర పోరాటం

- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య
- టీడబ్ల్యూజేఎఫ్‌లో 200 మంది జర్నలిస్టుల చేరిక



నవతెలంగాణ-మహేశ్వరం

జర్నలిస్టుల సమస్యలపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీడబ్ల్యుజేఎఫ్) భవిష్యత్తులో పెద్ద ఎత్తున జర్నలిస్టులను ఏకతాటిపై తీసుకొచ్చి బలమైన ఉద్యమం నిర్వహించబోతుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడి సోమయ్య, బి. బసవపున్నయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఎస్ఎస్ గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మిద్దెల సత్యనారాయణ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం ఎల్లవేళలా పోరాడుతుందని తెలిపారు. గత ప్రభుత్వం లాగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ప్రత్యేక రక్షణ చట్టం, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. ఆయా సంఘాలకు చెందిన 200 మంది జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి జగదీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ బి.దేవేందర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్ నరేష్, నరసింహారెడ్డి, ఆంజనేయులు అలుగొండ శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభవన్ వద్ద మాజీ సర్పంచుల అర్ధనగ్న ప్రదర్శన

- అరెస్టు చేసిన పోలీసులు
- పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలని చిన్నారెడ్డికి వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తమకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాభవన్ ఎదుట మాజీ సర్పంచులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. 'సర్పంచులు చనిపోతున్నా పట్టదా..సిగ్గు..సిగ్గు..బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి...బకాయిలను వెంటనే విడుదల చేయాలి' అని నినదించారు. దీంతో సర్పంచుల సంఘాల జేఏసీ అధ్యక్షులు సుర్వియాదయ్యగౌడ్‌తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, కేశ బోయిన మల్లయ్య, నాయకులు బొడ్డు నర్సింలు ,రవీందర్, మంగ నర్సింలు, దుర్గం నరేష్ యాదవ్, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

డీకేతో కేటీఆర్ మద్రాస్ ఒప్పందం

- రేవంత్‌రెడ్డినే ఐదేండ్లు సీఎం ఉండాలని కేసీఆర్ కోరుకుంటున్నడు
- దీంతో బీఆర్ఎస్ సర్కారుపై కేసులన్నీ పక్కదోవ : చిట్‌చాట్‌లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చెన్నైలో కాంగ్రెస్ నేత, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్రాస్ ఒప్పందం చేసుకున్నారనీ, దీంతో ఫోన్ ట్యాపింగ్, ఈ -కార్ రేసింగ్, ధరణి కేసుల విచారణ ముందుకు సాగడం లేదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. రేవంత్‌రెడ్డినే ఐదేండ్ల పాటు సీఎంగా ఉండాలని కేసీఆర్ కోరుకుంటున్నారన్నారు. అందుకే కాంగ్రెస్‌పై ఎన్నడూలేని ప్రేమను చూపిస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకుంటున్నాయన్నారు. హెచ్‌సీయూ భూములపై లోను తీసుకున్నదీ, ఆ భూములను అమ్మాలనుకున్నదీ కాంగ్రెస్ ప్రభుత్వమనీ, ఇప్పుడు బీజేపీపై బట్టగాల్చి మీద వేయాలని చూస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడటం కోసం బీజేపీ ఎంపీ అంటూ ప్రచారం మొదలు పెట్టారన్నారు. ఆ బీజేపీ ఎంపీ పేరును చెప్పకుండా ఎవరైనా అడ్డుకున్నారా? ఎందుకు చెప్పలేదు? 48 గంటల్లో చెబుతా అన్నావు కదా ఏమైంది? అంటూ కేటీఆర్‌ను ప్రశ్నించారు. గెలిచిన వంద రోజుల్లో కేసీఆర్, కేటీఆర్‌ను జైల్లో వేస్తానన్న మాట ఏమైంది? 15 నెలలవుతున్నా ఎందుకు చర్యలు లేవు? అని అడిగారు. కేసుల మాఫీ కోసం, అరెస్టుల నుంచి తప్పించుకోవడం కోసం కేటీఆర్ మద్రాస్ ఒప్పందం చేసుకున్నారనీ, కేటీఆర్ సుపారీ తీసుకుని బీజేపీపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి కేటీఆర్ బాడీ గార్డుగా మారారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసినా ముప్పై సీట్లు కూడా గెలవరని చెప్పారు.

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసుకుఫెడరేషన్ ఖండన

నవతెలంగాణ-హైదరాబాద్

సాక్షి దినపత్రిక సంపాదకులు ధనుంజయరెడ్డితో పాటు పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు జర్నలిస్టులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పి. రాంచందర్, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, ఇండియన్ ఫెడరేషన్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) ఉపాధ్యక్షులు పి.ఆనందం, తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీబీజేఏ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.రాధిక, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు డిమాండ్ చేశారు. మాచర్ల మండలంలో జరిగిన పి హరిశ్చంద్ర అనే వ్యక్తి హత్య కేసులో ప్రచురించిన వార్త కారణంగా సమాజంలో వైషమ్యాలు పెచ్చ రిల్లుతాయనే సాకుతో కేసు బనాయించటం సరికాదన్నారు. నిందితులను పట్టుకుని శిక్షించాల్సిన పోలీసులు ఆ పనికి బదులుగా ఈతరహా కేసులు పెట్టడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. ప్రచురితమైన సమాచారంలో తప్పులుంటే వాటిని సవరించుకునేందుకు వివిధ మార్గాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని వివరించారు. ఆ అవకాశాలను వదిలేసి మీడియాను, జర్నలిస్టులను భయభ్రాంతులు చేసేలా పోలీసులు వ్యవహరించడం సరైంది కాదన్నారు. వెంటనే సాక్షి సంపాదకులు ధనుంజయ రెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వచ్చే రెండ్రోజులు వర్ష సూచన

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- క్రమంగా పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శని, ఆదివారాల్లో గాలులతో కూడిన (30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) వర్షం పడే సూచనలున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, ఆదిలాబాద్, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముండటంతో ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అదే సమయంలో రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. శుక్రవారం నాడు ఆదిలాబాద్‌లో అత్యధికంగా 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ మేరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల, కొమ్రంభీం ఆసిఫాబాద్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. ఆ జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపై నమోదయ్యే అవకాశముంది.

గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఆదిలాబాద్	41.8
డిగ్రీలునిజామాబాద్	41.1 డిగ్రీలు
రామగుండం	39.4 డిగ్రీలు
మెదక్	39.2 డిగ్రీలు
ఖమ్మం	39 డిగ్రీలు



22 మంది మావోయిస్టుల లొంగుబాటు

ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

నవతెలంగాణ-ములుగు

నిషేధిత సీపీఐ(మావోయిస్టు)కి చెందిన 22మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా పోలీసులు, సీఆర్పీఎఫ్ 39 బెటాలియన్ అధికారుల సమక్షంలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోవడం కోసం నిర్వహిస్తున్న 'పోరుకన్నా ఊరు మిన్న, మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకొని హింసాత్మక నక్సలిజం మార్గాన్ని వదిలిపెట్టి లొంగిపోయినట్టు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. ఇందులో ఏసీఎం-03, పార్టీ సభ్యుడు - 01, ఆర్పీసీ కమిటీకి చెందిన 18 మంది, మొత్తం 22 మంది లొంగి పోయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ములుగు ఎస్పీ అజ్ఞాతంలో పని చేస్తున్న మావోయిస్టు నాయకులు, సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయి తమ కుటుంబంతో ప్రశాంతంగా జీవించాలని, లొంగిపోయిన వారికి జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల సదుపాయాలు అందించడానికి పోలీసు శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఆర్పీఎఫ్ పీఎంజీ పంచమీలాల్, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, వెంకటాపురం సీఐ కుమార్, పస్ర సీఐ రవీందర్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాట్సాప్‌లో ఏపీ ఇంటర్ ఫలితాలు



అమరావతి : ఇంటర్మీడియట్ ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు వాట్సాప్ ద్వారా ఈ ఫలితాలు చూసుకోవచ్చునని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృతిక శుక్లా శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదలవుతాయని వెల్లడించారు. మార్చి ఒకటి నుంచి 19వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 500,963 మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్ 4,71,021 మంది, ఒకేషనల్ 44,581 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. విద్యార్థులు తమ ఫలితాలను తీవంబశ్రీంఎఱవ.ఖజూ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. తొలిసారి వాట్సాప్ ద్వారా ఫలితాలు విద్యార్థులకు అందించే ఏర్పాట్లను ఇంటర్మీడియట్ బోర్డు చేసింది. వాట్సాప్‌లో 9552300009 నెంబర్‌కు హాయ్ అని సందేశం పంపి, హాల్ టికెట్ నెంబర్, పుట్టిన తేదీ వంటి వివరాలు నమోదు చేసి ఫలితాలు పొందవచ్చునని తెలిపారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో హాష్ ఆయిల్ సరఫరా

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- 4 కిలోల హాష్ ఆయిల్, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు కిలోల హాష్ ఆయిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.80 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ రమణారెడ్డి, భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఎస్‌వోటీ అదనపు డీసీపీ నంద్యాల్ నర్సింహా రెడ్డితో కలిసి సీపీ జీ.సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లికి చెందిన పేట్ల శేఖర్, అనిమి రెడ్డి దుర్గారావు చిన్ననాటి స్నేహితులు. శేఖర్ కెమికల్ కంపెనీలో పనిచేస్తుండగా, దుర్గారావు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఏపీ నుంచి గంజాయిని, హాష్ ఆయిల్‌ను రైళ్లలో తీసుకొచ్చి, నగరంలో కావాల్సినవారికి, తెలిసిన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైల్లో భువనగిరి వరకు వస్తున్నారు. అక్కడ ఇతర రైళ్లతోపాటు రోడ్డు మార్గంలో వాటిని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పోలీసులు గుర్తించకుండా కాలేజీ బ్యాగుల్లో గంజాయి, హాష్ అయిల్‌ను సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ పోలీసులు, మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసుల సహకారంతో ప్రత్యేక నిఘా వేశారు. పక్కా సమాచారంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ అంజయ్య, సీఐ పీ.చంద్రశేఖర్‌రెడ్డి, పీ.వాసుదేవ్, వీ.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైగా ల్యాండ్స్‌పై బోగస్ కోర్టు ఆర్డర్

సిట్ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ - హైదరాబాద్

శంషాబాద్‌లోని పైగా భూములపై యథాస్థితిని కొనసాగించాలంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు శుక్రవారం మరోసారి పొడిగించింది. ఈ భూముల విషయంలో హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వకపోయినప్పటికీ ఇచ్చినట్టుగా కొందరు తప్పుడు ఆర్డర్ కాపీలను తయారు చేశారనే విషయాన్ని హైకోర్టు గుర్తించింది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ వ్యవహారంపై త్వరగా విచారణ జరిగేలా సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ టి వినోద్ కుమార్, జస్టిస్ పి శ్రీసుధలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సర్వే నెం 611 నుంచి 664, 720, 721, 724 నుంచి 732, 775లో సుమారు 100 ఎకరాల వరకు ఉన్న పైగా భూములపై హక్కులపై మహమ్మద్ తాహెర్ ఖాన్‌కు అనుకూలంగా సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై హెచ్ఎండీఏ అప్పీల్ చేసింది. దీనిని బెంచ్ విచారించింది. ఈ వివాదంపై అప్పటికే కోర్టులో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుకు సంబంధించి తప్పుడు కోర్టు ఆర్డర్ సష్టించారనే విషయాన్ని హైకోర్టు గుర్తించింది. జస్టిస్ ఎస్.డి పట్నాయక్ 1988లో డిసెంబర్‌లో హైకోర్టు న్యాయమూర్తి అయితే, అంతకు ముందే అదే ఏడాది ఏప్రిల్‌లో పైగా భూములపై ఆర్డర్ ఇచ్చినట్టుగా తప్పుడు ఉత్తర్వులను సష్టించిన బాగోతంపై పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది

విద్యాహక్కు చట్టాన్ని ఎప్పుడు అమలు చేస్తారు?

రాష్ట్రంలోని ప్రయివేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లను కేటాయించాలనే విద్యా హక్కు చట్టాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. చట్టం అమలుకు తీసుకున్న చర్యల వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గత ఏడాది అక్టోబర్ 19న ప్రభుత్వం జారీ చేసిన మెమో మేరకు ఉచిత సీట్లు ఇచ్చేందుకు తీసుకునే చర్యలపై నివేదిక ఇవ్వాలంది. విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈలోగా అఫిడవిట్ వేయాలని పేర్కొంది. దేశంలో 2009లో తీసుకొచ్చిన విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రీ ప్రైమరీలో పాటు ప్రయివేట్ పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని, ఈ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ తాండవ యోగేష్ అనే లాయర్ 2020లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా బెంచ్ శుక్ర వారం విచారించింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఆర్‌టీఈ చట్టంలోని సెక్షన్ 12(1)(సీ)ని అమలు చేస్తారో లేదో చెప్పాలని రాష్ట్రాన్ని కోరింది.

బీఆర్ఎస్ సభకు అనుమతివ్వని పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలి : హైకోర్టు

ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వలేదంటూ ఆ పార్టీ వేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ నెల17లోగా నిర్ణయాన్ని వెలువరించాలని వరంగల్ సీపీ, కాజీపేట్ ఏసీపీకి నోటీసులు జారీ చేసింది. అదే తేదీకి విచారణను వాయిదా వేస్తూ జస్టిస్ వినోద్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి కోరుతూ మార్చి 28న, ఏప్రిల్ 4న వినతిపత్రాలు అందజేసింది. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 27న ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సభ, విజయోత్సవాలను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలన్న తమ వినతిపత్రాలపై పోలీసులు చర్యలు తీసుకోలేదని పిటిషనర్ హైకోర్టుకు నివేదించారు.

గ్రూప్-1 నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వానికి నోటీసులు

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపట్టిన గ్రూప్-1 నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంపుదలపై సవాల్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తమ ముందున్న వ్యాజ్యాలపై తుది ఉత్తర్వులు వెలువడేలోగా ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీలో ఎస్టీ రిజర్వేషన్ల పెంపుదల జరిపితే అవి తామిచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని షరతు విధించింది. ప్రభుత్వం తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2022లో జారీ చేసిన జీవో 33 ద్వారా పెంచిన ఎస్టీ రిజర్వేషన్లను విద్యా, ఉపాధి రంగాలకు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ జీవోను సవాల్ చేస్తూ పి. శ్యాంసుందర్‌రెడ్డి ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పాత నిబంధనల ప్రకారం ఎస్టీలకు ఆరు శాతమే రిజర్వేషన్లు ఉండాలని, పెంపుదల చేయడం చెల్లదని, పెంచిన రిజర్వేషన్ల వల్ల ఇతర వర్గాలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, పెంచిన రిజర్వేషన్లను కొనసాగించాలంటూ ఎస్టీ సంఘాలు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌లో తమ వాదనలు కూడా వినాలని కోరాయి. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందని చెప్పాయి. వాదనల తర్వాత ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను జూన్ 12కి వాయిదా వేసింది. ప్రభుత్వం నియామకాలు జరిపితే అవి తుది తీర్పునకు లోబడి ఉంటాయని షరతు విధించింది.

వివాహిత కారుణ్య నియామకానికి అనర్హురాలనడం సరికాదు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని పరిశీలించమన్న హైకోర్టు

కుమార్తె వైవాహిక స్థితిని పరిగణనలోకి తీసుకుని కారుణ్య నియామకానికి అర్హురాలు కాదని చెప్పడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. వివాహమైనా ఆమె అర్హురాలేనని, అయితే దీనికి వారి ఆర్థిక పరిస్థితి సహా పలు అంశాలను పరిశీంచాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఆ అంశాల మేరకు పిటిషనర్ దరఖాస్తును పున్ణ పరిశీలించాలని చెప్పింది. నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్లతో మళ్లీ వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తూ యూసఫ్ మృతిచెందారు. కారుణ్య నియామకం కింద తన కుమార్తె ఫాతిమాకు ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని సీపీ నిరాకరించారంటూ యూసఫ్ భార్య షాహీన్ సుల్తానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. 'షాహీన్‌కు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు. కుమారుడు కెనాడా వెళ్లి తండ్రి అంత్యక్రియలకు కూడా రాలేదు. కూతురు ఫాతిమానే తల్లిని చూసుకుంటోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లికి సరైన వైద్యం కూడా అందించలేక పోతోంది. వివాహమైనా కారుణ్య నియామకానికి అర్హురాలేనని గతంలో జార్ఖండ్ హైకోర్టు తీర్పునిచ్చింది' అని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. పిటిషనర్‌కు కుమారుడు ఉన్నారు. అతను ఉద్యోగం చేస్తున్నారు. అందుకే కారుణ్య నియామక విజ్ఞప్తిని సీపీ తిరస్కరించారు. ఫాతిమా, ఆమె భర్త ఆర్థిక పరిస్థితిని షాహీన్ వెల్లడించలేదు' అని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఆమె డాక్యుమెంట్లను పున్ణ పరిశీలన చేసి నిబంధన మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

రఘునందన్‌రావుపై కేసులో పోలీసులకు నోటీసులు

సిద్దిపేట్ జిల్లా దుబ్బాక పోలీస్‌స్టేషన్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుపై నమోదైన కేసు వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ కేసును కొట్టేయాలంటూ రఘునందన్‌రావు దాఖలైన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో దుబ్బాక స్టేషన్‌లోకి వచ్చి గొడవ చేశారని ఏఎస్ఐ ఎండీ గులామ్ సమ్దాని చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని పిటిషనర్ వాదన. దీనితోపాటే ఎన్. జీవన్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు 2024లో దుబ్బాక పీఎస్‌లో నమోదైన కేసులో, నల్లగొండ జిల్లా పెదవూర స్టేషన్‌లో ఎంపీడీవో దుబ్బ శ్యామ్ ఫిర్యాదు మేరకు నమోదైన మరో కేసులోనూ కౌంటర్లు దాఖలు చేయాలని సంబంధిత పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

ఉద్యోగ నియామక నోటిఫికేషన్ రూల్స్ మార్చడానికి వీల్లేదు

నోటిఫికేషన్‌లోని రూల్స్ ప్రకారమే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) అసిస్టెంట్ డైరెక్టర్ పోస్ట్ నియామకం ఉండాలని అధికారులకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫికేషన్ ఇచ్చాక అందులోని నిబంధనలను మార్పు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. నోటిఫికేషన్ ప్రకారం అర్హతలు సాధించిన తనను కాకుండా అదనపు అర్హతలు చేర్చడం ద్వారా మరొకరిని అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించారంటూ ఎస్. లావణ్య దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో విచారించిన సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుకు ఆమె అప్పీల్ దాఖలు చేశారు. ఆమె దరఖాస్తును తిరిగి పరిశీలన చేయాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలనే అప్పీల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారించింది. సీనియర్ లాయర్ కె. లక్ష్మీనరసింహ వాదిస్తూ, నోటిఫికేషన్‌లో నిబంధనల్లో రాత పరీక్ష, పవర్ పాయింట్ ప్రజంటేషన్, ఇంటర్వ్యూ అని ఉందని, అయితే ఎంపిక కమిటీ విద్యార్హతలు, పరిశోధన ప్రచురణలు, శిక్షణ వంటి అదనపు అర్హతలని చెప్పారన్నారు. దీని ప్రకారం డాక్టర్ శ్రీలతను ఏడీగా నియమించడం నోటిఫికేషన్ రూల్స్‌కు వ్యతిరేకమన్నారు. వాదనల తర్వాత ధర్మాసనం, నోటిఫికేషన్ రూల్స్ ప్రకారమే ఎంపిక ప్రక్రియ ఉండాలని తేల్చి చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా ఎంపికైన శ్రీలత ఏవిధమైన హక్కులను కోరేందుకు వీల్లేదని స్పష్టం చేసింది.

ఇండ్లు కట్టించాకే ఓట్లు అడుగుతాం

ఐదేండ్లలో గ్రామాల్లో మూడు సెంట్లు జాగా ఇచ్చి ఇండ్లు కట్టిస్తాం

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే సహించం

ఆగిరిపల్లి పి-4 ప్రజావేదిక సభలో సీఎం చంద్రబాబు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇళ్లు లేని వారందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు స్థలమిచ్చి ఇళ్లు కట్టించిన తర్వాతే ఓట్లు అడగడానికి వస్తామని, ఇందులో ఎవరికీ అనుమానం అవసరం లేదని, అందరికీ ఇళ్లు కట్టే కార్యక్రమం పెద్దఎత్తున చేపడతామని, గత ప్రభుత్వం నివాసానికి అనుకూలంగా లేని చోట స్థలాలిచ్చి మోసగించిందని సిఎం చంద్రబాబు అన్నారు. జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి సచివాలయం-2 పరిధిలో శుక్రవారం పి-4 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ యార్డుకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం పి-4 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మాట్లాడుతూ..పూలే జయంతి రోజున పి-4 కార్యక్రమం ప్రారంభించుకుంటున్నామన్నారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు పెంచుతామని, నామినేటెడ్ పోస్టుల్లో 33 శాతం అమలు చేస్తామని తెలిపారు. నేరస్తులకు సోషల్ మీడియా అడ్డాగా మారిందని, ఎవరి వ్యక్తిత్వాన్ని కించపరిచినా వాళ్లకు అదే చివరిరోజు అవుతుందని హెచ్చరించారు. సమాజంలో ఉన్నతస్థానంలో ఉన్న పది శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం పేదలను పైకి తీసుకొచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. తయారవుతారన్నారు. ఆగిరిపల్లిలోని 206 కుటుంబాలకు వారి మార్గదర్శకులు అండగా ఉంటారని తెలిపారు. రాష్ట్రంలో మొదటిదశలో 20 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి పైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. బంగారు కుటుంబాలకు ఎంపికైన ప్యారీ రేష్మ, బోనం లక్ష్మీదుర్గ మాట్లాడారు. బంగారు కుటుంబాలకు సాయం చేసేందుకు వచ్చిన మార్గదర్శకులు నూజివీడు అధినేత ప్రభాకర్, హ్యాపీవ్యాలీ స్కూల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, కుశలవ గ్రూప్‌కు చెందిన సిద్ధార్థ, నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ అధినేత నితిన్ కృష్ణ, మోడల్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పిన్నమేని ధనప్రకాష్, ఎన్ఆర్ఐ కాలేజీ చైర్మన్ రావి వెంకట్రావు మాట్లాడుతూ... నిరుపేద కుటుంబాలకు అండగా ఉండి పైకి తీసుకొస్తామన్నారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సిఎంను కలిసిన కోకో రైతులు

కోకోపంటకు సరైన ధరలేక ఇబ్బంది పడుతున్న రైతులు సిఎంను కలిసేందుకు రాగా పోలీసులు అనుమతించలేదు. దీంతో సభ ముగిసిన తర్వాత ఎంపి పుట్టా మహేష్ రైతులను కలిసి వారితో మాట్లాడి, సిఎం వద్దకు తీసుకువెళ్లారు. సిఎంకు కోకో రైతులు తమ సమస్యను వివరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిఎం వారికి హామీ ఇచ్చారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

- కొనసాగుతున్న మట్టి తవ్వకాలు :

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలోని ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నట్టు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు చేపడుతున్న సహాయక చర్యల్లో కన్వేయర్ బెల్ట్ ద్వారా టన్నెల్ లోపలున్న మట్టిని బయటకు తరలిస్తున్నట్టు వివరించారు. సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. టీబీఎం భాగాలను కత్తిరించే పనులు, సిల్ట్‌ను బయటకు తరలించే పనులు, ఊట నీటిని బయటకు తరలించే పనులు వేగంగా జరుగుతున్నాయని, సహాయక బృందాలు నిర్విరామంగా టన్నెల్ లోపల సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ విపత్తు నిర్వహణ విభాగం, రెస్క్యూ టీమ్‌లు, టన్నెల్ నిపుణుల సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్టు వివరించారు. సమీక్షా సమావేశంలో ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే హైడ్రా అధికారులు సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి, జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నదిలో కూలిన హెలికాప్టర్..

కుటుంబంతో సహా దిగ్గజ టెక్ సంస్థ సీఈఓ మృతి

న్యూయార్క్: అమెరికాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. న్యూయార్క్‌లో ఓ పర్యటక హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ నదిలో కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ టెక్ కంపెనీ సీఈఓ, ఆయన కుటుంబం దుర్మరణం చెందారు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది.

జర్మనీకి చెందిన దిగ్గజ టెక్నాలజీ కంపెనీ సీమెన్స్ కంపెనీ స్పెయిన్ విభాగ అధిపతి, సీఈఓ అగస్టిన్ ఎస్కోబార్ తన కుటుంబంతో కలిసి న్యూయార్క్ పర్యటనకు వచ్చారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హడ్సన్ నది మీదుగా వెళు న్న సమయంలో ప్రమాదానికి గురైంది. గింగిరాలు తిరుగుతూ నదిలో తలకిందులుగా పడిపోయింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మ ృతి చెందారు.వీరిలో ఎస్కోబార్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలతో పాటు పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన బెల్ 206 చాపర్‌ను న్యూయార్క్ హెలికాప్టర్ టూర్స్ విభాగం సైట్ సీయింగ్ కోసం వినియోగిస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలంలో బోట్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్ తలకిందులుగా పూర్తిగా నీళ్లలో కూరుకుపోయిందని వెల్లడించారు. గాల్లో ఉండగానే హెలికాప్టర్‌లోని ఒక భాగం విరిగిపోయిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాల్సిందే

- రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింల ఆందోళన



యంత్రాంగం : వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం పర్సనల్‌లా బోర్డు జెఎసి పిలుపు మేరకు ముస్లిములు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సవరణ బిల్లును వెనక్కి తీసుకునే వరకు ముస్లింలంతా ఏకమై కేంద్రంతో పోరాడుదామని అన్నారు. గుంటూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ముస్లిములు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. స్థానిక టిడిపి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మద్దతు ఇవ్వటానికి రావడంతో అదే వేదికపై ఉన్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నూరి ఫాతిమా పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు పలికి, ఇక్కడ ఎవరికి మద్దతు ఇవ్వటానికి వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అప్పటికే వేదిక ముందు ఉన్న ప్రజల నుండి వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే రాజీనామా చేయాలనే డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. చట్ట సవరణకు మద్దతు తెలిపిన టిడిపి నాయకులతో వేదిక పంచుకోలేమని సిపిఎం నాయకులు ముందుగానే వేదిక కిందకు దిగారు. నిర్వాహకు లు అందరికీ సర్ది చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరూ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా తాను చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు చిష్టీ, వివిధ సంఘాల నాయకులు ప్రసంగిం చారు. కర్నూలులోని వివిధ మసీదుల వద్ద ముస్లిములు మానవహారం నిర్వహించారు. ఆదోని మసీద్ కాలనీలో మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారు. బాపట్లలో అంజుమన్ ఎ ఇస్లామి యా ఆధ్వర్యంలో అంజు మన్ ఇస్లామియా మసీదు నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిం చారు. జాతీయ జెండాలు, ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ముస్లిము లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, సమాజ్‌వాదీ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గొర్ల శ్రీనివాసరావు పాల్గొని మద్దతు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలో ర్యాలీ, ఏలూరు జిల్లా నూజివీడులో ధర్నా నిర్వహించారు. విశాఖలోని గాజువాకలో శాంతియుత నిరసనలు తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ - మహమ్మదాబాద్



ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ వడదెబ్బతో మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ గ్రామంలో శుక్రవారం జరిగింది. తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన మాల జయమ్మ(55) మూడు వారాలుగా ఉపాధి హామీ పనులకు వస్తుండేది. గురువారం నీరసంగా ఉందని తోటి కూలీలకు తెలిపింది.. అయినా రోజు లాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వచ్చింది. ఉదయం పని ప్రదేశానికి వెళ్లి పని ప్రారంభించే క్రమంలోనే తీవ్ర అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందింది.